ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



"అలంకరణము"


చిత్రకారుడు: శ్రీ వి. కామేశ్వరరావు.

20-4-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు




వార్తా చిత్రాలు

ఢిల్లీలో గత వారాంతాన జరిగిన రాష్ట్రప్రధానుల సభ. చెన్నరాష్ట్ర ప్రధాని కుమారస్వామిరాజాగారు కుడివైపున మూడవస్థానంలో ఆసీనులైవున్నారు.



ఐక్యరాజ్యసమితి ఆర్థిక వైజ్ఞానిక, విద్యాశాఖతో సహకరించుటకు ఏర్పాటైన జాతీయ సంఘసభను 9 వ తేదీ ఢిల్లీలో ప్రధానమంత్రి నెహ్రూ ప్రారంభించారు.



బర్మా పరిస్థితిని గురించి భారత ప్రధాని నెహ్రూతో బర్మా ప్రధాని థాకిన్ నూ గతవారం ఢిల్లీలో చర్చించారు.



హంగరీ భారతదేశాల వాణిజ్య ఒడంబడికపై ఏప్రిల్ 8-వ తేదీన సంతకాలుచేసిన సి. సి. దేశాయి, మెండీ (హంగరీ ప్రతినిధి).



గతవారం నల్లగొండలో ప్రభుత్వంచే ఏర్పాటు చెయ్యబడిన ప్రదర్శనమును మేజర్ జనరల్ చౌదరిగారు ప్రారంభించిరి. అందు కమ్యూనిస్టులతో ప్రజలు సహకరింపరాదని, సహకరించినచో కల్గు ప్రమాదములును, వివిధ కార్యక్రమముల ద్వారా ప్రజానీకమునకు తెలియజేయబడెను. ప్రదర్శనములో వ్యవసాయశాఖవారు, ఆరోగ్యకరమైన ఆహారమును తయారుచేయు పద్ధతులను వివరించిరి. మేజర్ జనరల్ చౌదరి వ్యవసాయ ప్రదర్శనమును చూచుచున్నారు. వారి ప్రక్కనే నల్గొండ సివిల్ అడ్మినిస్ట్రేటర్ శ్రీ జోగప్ప నిలచియున్నారు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0 విడిపత్రిక అణాలు 0-4-0	ప్రతిబుధవారమున ప్రకటింపబడును	సంపుటము **41** సంచిక **31**

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర చైత్ర బహుళ అష్టమి బుధవారము



స్వస్తిక్‌వారి ధర్మాంగదలో కృష్ణవేణి



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ ఏప్రిల్ నెల 20-వ తేది బుధవారము

దర్బాన్ కల్లోలాల విచారణ

దర్బాన్ కలహముల విషయముల లోని న్యాయాన్యాయములు, దక్షిణాఫ్రికా ప్రభుత్వనియమితమైనవిచారణ సంఘము నివేదికను ప్రకటించుకొనక ముందే, ప్రపంచప్రజలలో పీడితుల పట్ల సానుభూతికల సహృదయుల కందరకు తెలిసినవే. శ్వేత, కాల, జాతి భేదములు కూడ న్యాయాభిప్రాయమును బైటపెట్టుటకు తదితర శ్వేత వర్ణులకు అభ్యంతరము కానంత క్రూర విధానములో ఈ పోట్లాటలను దక్షిణాఫ్రికాప్రభుత్వము రెచ్చగొట్టినది. ఈ హింసాకాండ వ్యవహారములోనూ, పూర్వాపర సందర్భములలోనూ కూడ ప్రభుత్వము తమ జోక్యము కల్పించుకొనుటయందునూ, కల్పించుకొనకుండ పోవుటయందునూ గూడ కుటిలనీతియుతమగు స్వప్రయోజనార్థమై అస్తవ్యస్తముగ వ్యవహరించినది. నేటికైనను నిష్పాక్షికవిచారణ మొనరించి నివేదింపవలసిన తరుణమున గూడ, అట్టిపనికై పూనుకొనిన సంఘము కేవలము ప్రభుత్వ ప్రచారశాఖవలె వ్యవహరించినది. దీనిలో ప్రపంచమునకు వింత ఏదియు గోచరించకనే పోయి ఉండెడిది గాని, ఏ ప్రభుత్వమునకైనను, ప్రభుత్వమున కతీతమై కేవలము, ధర్మమూలకమైనిలుచు, మహోన్నతన్యాయస్థానాధిపత్యస్థానమున నిలిచిన వ్యక్తి, ఈ విచారణసంఘ అగ్రమున నిలిచి, కేవలము ప్రభుత్వమునకు ప్రచారకుడుగా తన నివేదికను తయారుచేయుట శోచనీయము.

ఆఫ్రికన్ నివాసులు, ఉద్రిక్తులైన మూకలుగా భారతీయులను వెంటాడించుచూ హత్యాకాండలను జరుపుచుండగా, ప్రభుత్వపోలీసులునూ, శ్వేతవర్ణులునూ, ఏమాత్రమూ అలజడి లేక నిష్కామయోగమున భద్రముగా నిలచిన దృశ్యముల యథార్థ ఛాయాచిత్రములు, అమెరికా,ఇంగ్లండ్ ప్రముఖవార్తాపత్రికలు ప్రకటించినవి. వార్తలు, వ్యాఖ్యలు, తమపట్ల విరోధమువల్ల ప్రచురితమైన యబద్ధములన్ననూ, ఛాయాచిత్రములవల్లనైన, ప్రభుత్వము అవలంబించిన, ఇచ్ఛాపూర్వక స్తబ్ధవిధానమును, ఏ న్యాయవిచారణసంఘ ప్రచార అవసరమునూ లేకయే బయలుపడుచున్నది.

నాటి హింసాప్రేరేపకుల విషయమై అలసత తప్ప, జాగ్రత్త తీసికొనవలసిన అవసరముకూడ ఈ సంఘము ప్రభుత్వమునకు నివేదించుకొనలేకపోవుటలోనే, విచారణసంఘ స్వభావము, అర్హత, అధికారము, వెల్లడి యగుచున్నవి.

ఇట్టి కలహములు ప్రజ్వరిల్లునని ప్రభుత్వము కల గనినదా, లేక దివ్యదృష్టి యున్నదా, ఇదేమి జ్యోతిష్యమాయని విచారణసంఘము ప్రభుత్వమును సమర్థించినది. కాని పాపము తద్విరుద్ధముగా తాను జోస్యము చెప్పు అపేక్షను వదులుకొనలేకపోయినది. ఈ కలహములో ఎక్కువగా ప్రాణముల నష్టపడ్డవారు భారతీయులు. పగయేదైన నుండిన వీరి పక్షముననుండి యుండుట సహజము. కాని ఆఫ్రికన్లే పగదీర్చుకొన సత్వరులై యున్నారని, భారతీయులను ఖబర్దార్ అని చెప్పినట్లుగా విచారణసంఘము నివేదించినది. దక్షిణాఫ్రికాలో భారతీయుల నివాసము, ఆఫ్రికన్ జాతుల వారికన్న దక్షిణాఫ్రికా తెల్లప్రభువులకే ఎక్కువ కంటకముగా నున్న విషయము జగద్విదితము.

అట్టితరి భారతీయులను వెడలనడపుటకై ఆఫ్రికన్ జాతుల పేరిట భారతీయులపై హింసాకాండను, ఆఫ్రికన్ జాతులచే జరిపించుటకు మలాన్ ప్రభుత్వము సంపూర్ణముగ నిశ్చయించుకొన్నదని, తదవసరార్థమే, న్యాయవిచారణ నివేదికలలో గూడ ఈ భీతాహమును భారతీయులలో రేకెత్తించు ప్రయత్న మొనరించుచున్నదని స్పష్ట మగుచున్నది.

ఆఫ్రికనుల అవిద్య, దరిద్ర స్థితి, దుర్భర జీవిత పరిసరములూ, వీని నట్లే స్థిరీకరించి దక్షిణాఫ్రికాలో తమ ఆధిపత్యమునకు శాశ్వతత్వ మేర్పరుచుకొనవలెనని మలాన్ ప్రభుత్వము భావించిన, ఈనాటి ప్రజాస్వామ్య ప్రపంచమున అంతకన్న అనాగరికమును, నిరంకుశమును అగు అభిప్రాయముండదు. ఈ ప్రయత్నమునకు భారతీయులే అడ్డని మలాన్ ప్రభుత్వము భావించిన అది నిజముగా, మహాత్ముని వారసులగు దక్షిణాఫ్రికాలోని భారతీయులకే గౌరవదాయకము. ప్రభుత్వముయొక్క ఈ క్లిష్ట స్థితిని, ఆఫ్రికన్ ప్రజానాయకులూ, ప్రజలూ గుర్తించిన, భారతీయులతో వారికి కలహము లేకుండపోవుటయే కాక, తమ అభ్యుదయమునకు భారతీయుల సహాయమును అమితముగా సేకరించుకొనగలరు.

స్వతంత్రఐరిష్ రిపబ్లిక్

బ్రిటిష్ సింహాసనముతో ఇంతవరకు ఉండిన సంబంధమును అది దాదాపు నామమాత్రమైనదనే చెప్పవచ్చును-పూర్తిగ విచ్ఛేదము చేసికొనుటతో దక్షిణ ఐర్లెండ్ "సర్వాధికార సమన్విత స్వతంత్ర ప్రజారాజ్యము(రిపబ్లిక్)"గ అవతరించినందుకు ఐరిష్ ప్రజలే గాక, క్రిందటి అర్థశతాబ్దముగ ఐరిష్ ప్రజలు సాగించిన స్వాతంత్ర్య పోరాటమును గమనించుచుండిన భారతీయులు ముఖ్యముగ ఆనందింతురు. ఇతర కామన్వెల్తు ప్రభుత్వములు ఈ చరిత్రాత్మక సంఘటనను, ఇకమీదటజరుగు సంఘటనలను విశేషశ్రద్ధతో పరిశీలించెదరు.

తమ దేశము బ్రిటిష్ సింహాసనముతో గల సంబంధమును పూర్తిగ వదులుకొన్నప్పటికిని, బ్రిటన్-ఐర్లెండ్ స్నేహ సంబంధములకు, పరస్పర సహకారమునకు ఎట్టివిఘాత మూకలుగదని, పూర్వంవలెనే ఇకమీదటను ఉభయప్రభుత్వములు ఇరువురకు సంబంధించిన విషయములందుకలసి వ్యవహరింపగలవని ప్రధాన మంత్రి కాస్టెల్లో విస్పష్టముగ ప్రకటించి యుండెను. కాని, అట్టి సహకారము, మారిన పరిస్థితులలో సాధ్యమా యను సందేహము ఐరిష్ రాజకీయవేత్తలతోబాటు, యితర కామన్వెల్తు రాజ్యముల రాజకీయవేత్తలకును కలుగుట సహజము. ఐర్లెండ్ ఆంతరంగిక వ్యవహారములందు బ్రిటిష్ సార్వభౌమునకుఎట్టిసంబంధమూ లేకుండ 1936 వ సంవత్సరములో ఐరిష్ రాజ్యాంగమును సవరించిన డీవెలరా నిన్నటి ఉత్సవములందు పాల్గొనకపోవుటకు యిట్టి సందేహమే కారణ మని చెప్పవచ్చును. యథార్థమునకు నేడు దక్షిణ ఐర్లెండుకు అత్యంత ప్రధానమైనది విదేశ వ్యవహారములను బ్రిటిష్ సార్వభౌమునిద్వారా జరుపు ప్రస్తుతపు ఏర్పాటు రద్దు అగుట కాదు. 1939 లో ప్రారంభమైన ద్వితీయ సంగ్రామమున ఐర్లెండ్ తటస్థముగ నుండిపోవుటకు ఈ ఏర్పాటు ఎట్టి ప్రతిబంధకములనూకల్పించియుండలేదు. మిత్రరాజ్యసేనలకు స్థావరముల నిరాకరించుటకు కూడ ఈ ఏర్పాటు ఆటంకములను కల్గింపలేదు. అయినను కాస్టెల్లో ప్రభుత్వము, ఐర్లెండ్ సమైక్యతకు కృషిచేయుటకు మారు, నామమాత్రముగ నున్న ఈ సంబంధమును రద్దుచేయుటకు నిశ్చయించెను. ఇందువలన ఐర్లెండ్ కు ప్రస్తుతము కలుగు లాభముగాని, నష్టముగాని ఏమియు లేకపోవచ్చును. కాని డీవెలరా, ఆయన పక్షమువారు అభిప్రాయపడినట్లు ఈ విచ్ఛేదనము ఉత్తర దక్షిణ ఐర్లెండ్ సమైక్యతకు కొంత కాలమువరకైనను ప్రతిబంధకముగ నుండగలదు.

ఈ విధముగ స్వతంత్ర ఐరిష్ రిపబ్లిక్ శాసనము అమలు జరుగుట కాస్టెల్లో ప్రభుత్వము ఐరిష్ ప్రజల చిరవాంఛితమును సాధింపలేకపోయినను, ఇంచుమించు ఇదే విధమైన స్వతంత్రరిపబ్లిక్ నుస్థాపింప దలచుకొన్న దక్షిణ ఆఫ్రికా, భారతదేశములు ఒక నిర్ణయమునకు రాగలుగుటకు తోడ్పడవచ్చును. గురువారము లండన్ లో ప్రారంభము కానున్న కామన్వెల్తు ప్రధాన మంత్రుల సమావేశమునందు భారతదేశభవిష్యత్తుకు సంబంధించిన చర్చలకే ఎక్కువ ప్రాధాన్యము ఉండును. కనుక, ఐర్లెండ్ రిపబ్లిక్ అవతరణకు ప్రత్యేకప్రాధాన్యము ఏర్పడినదని చెప్పవచ్చును. భారత దేశము ఐర్లెండ్ మార్గమునే అనుసరింపవలసియున్నది. బ్రిటిషు ప్రభుత్వము ఇదవరకే బ్రిటన్ లోని ఐరిషు పౌరులకు బ్రిటిషు పౌరస్వత్వము నిచ్చుచు శాసనము చేసియుండెను. ఇతర అధినివేశములు కూడ అట్టి శాసనములను చేసి, తమ దేశమందు స్థిర నివాసమేర్పరచుకొనియున్న ఐరిషు ప్రజలకు పౌరహక్కుల నిచ్చుటకు సమ్మతించెను. "కామన్వెల్తు" స్వతంత్రరాజ్యములు ఐచ్ఛికముగ చేరి ఏర్పరచుకొనిన సమ్మేళన మని అంగీకరింపబడినపుడు స్వతంత్ర రిపబ్లిక్ స్థాయిని పొందిన దేశములు బ్రిటిషుసింహాసనమునకు భక్తి ప్రమాణము చేయకనే కామన్వెల్తునందుండుట కెట్టి ప్రతిబంధకములు ఉండరాదు.

ఐర్లెండ్ స్వతంత్ర రిపబ్లిక్ అగుట సంతోషదాయకమే. అనతి కాలములోనే ఐక్య ఐర్లెండ్ అవతరణకూడ సంభవించునని ఐరిషు ప్రజలతోబాటు, శాంతి, స్వాతంత్ర్యముల నభిలషించు దేశములన్నియు ఈ సమయమున ఆశించుట సహజము.

మనరాష్ట్రం; మనదేశం:

ఆంధ్రరాష్ట్రనిర్మాణానికిఆర్డర్-ఇన్-కౌన్సిల్ మద్రాసుప్రధాని అభిప్రాయం

ఆంధ్ర రాష్ట్రం ఎప్పుడే రీతిగా ఏర్పడ గలదో, ఇప్పుడు మద్రాసు ప్రభుత్వ కర్తవ్య మేదో ప్రధాని కుమారస్వామి రాజాగారిని పత్రికా విలేఖరులు ప్రశ్నించినప్పుడు, ఆయన భారత ప్రభుత్వం ఆజ్ఞకోసం నిరీక్షిస్తున్నట్లు చెప్పారు. పట్టాభి, పటేల్, నెహ్రూ కమిటీ నివేదికలో చెప్పిన ప్రకారం ప్రజాభిప్రాయం తెలుసుకోవలసి ఉంది కాబట్టి, ఏరీతిగా తెలుసుకోవాలో కూడా భారత ప్రభుత్వం ఆజ్ఞకోసమే నిరీక్షిస్తున్నారట.


ఆంధ్ర రాష్ట్రం వెంటనే నిర్మాణం కావాలని కోరినట్లయితే ఆంధ్రులు ప్రస్తుతానికి మాత్రమే చెన్నపట్నం మీద హక్కు విడిచిపెట్టాలి. కాని అదేతుదినిర్ణయం కాదని ప్రధాని కుమారస్వామి రాజాగారు చెప్పారు. ఈ పత్రికా సమావేశంలో భక్తవత్సలంగారు కూడా ఉన్నారు. చెన్నపట్నం గురించి కోరాపుట్టి గంజాం ప్రాంతం మాదిరిగానే ఉత్తరోత్తరా తిరిగి నిర్ణయించుకోవచ్చునని చెప్తూ ఒక బెదరింపు కూడా విసిరారు. చెన్నపట్నం విడిచిపోవడానికి ఆంధ్రులు అంగీకరించకపోతే వీరు ఆంధ్రరాష్ట్రం నిర్మాణం జరుగకుండా చెయ్యగలరు. ఆంధ్రరాష్ట్రం నిర్మాణం విషయమై నిర్ణయం చెయ్యవలసినది ఆంధ్రులే కాదు; తమిళ కర్ణాటక కేరళ సభ్యులు కూడా అనీ జ్ఞప్తి చేశారు. శాసన సభ్యుల అభిప్రాయం తెలుసుకోవాలని భారతప్రభుత్వం చెప్పినట్లయితే ఆంధ్రతమిళ వర్గాలంతా చేరి ఆంధ్ర రాష్ట్రం విభజనకి అనుకూలంగాను ప్రతికూలంగాను వోట్లు చెయ్యాలి, లేదా ఆంధ్ర సభ్యులు వేరు, తమిళ సభ్యులు వేరుగా తదితర సభ్యులు కూడా వేర్వేరుగా సభలు చేసి వోట్లు వేసి నిర్ణయాలు చెయ్యాలి. ఎలాగైనా కాని ఆంధ్రరాష్ట్రం నిర్మాణం కాకుండా చెయ్యడానికి తమిళులకు అవకాశం ఉన్నమాట నిజం. అందరూ ఏకంగా చేరి ఓటు చేసినా వారిదే సంఖ్యాధిక్యత అయినందువల్ల నిర్ణయం వారి చేతుల్లోనే ఉంటుంది. విడివిడిగా చేయవలసి వస్తే, నిర్ణయాలు ఏ ఒకవర్గం ప్రతికూలించినా నిర్మాణం జరుగదు. ఆ విధంగా కూడా నిర్ణయం చివరికి వారిపైనే ఆధారపడి ఉంటుంది. ఈ పరిస్థితినీ ఈ సవాలునీ తెలుగు శాసన సభ్యులు గమనించాలి. చెన్నపట్నంవిషయం వస్తే తమిళులంతా ఒక్క మాట పైన నిలబడగలరు. తెలుగు శాసన సభ్యులా రీతిగా నిలువలేరు. సరిగదా, చెన్నపట్నం అక్కరలేదు, ఆంధ్రరాష్ట్రమూ అక్కరలేదు. నాకు మంత్రిపదవి లభిస్తే చాలు ననేవారు కూడా ఉన్నారు. ఈ అనైక్య ఈ దౌర్బల్యం ఎరిగిన భక్తవత్సలం," నాడార్ గార్లు బెదరించ గలరు. ఏది చేసినా చెయ్యగలరు. ఇంతవరకూ జరిగిన అన్యాయాలకి అదేమని అడిగినవారు లేకపోయారు. తెలుగు శాసనసభ్యులు కట్టుకట్టి నిలుస్తే చెన్నపట్నంపైన ఇప్పుడు కూడా హక్కు విడిచిపెట్ట నక్కరలేకుండానే ప్రత్యేకరాష్ట్రం తెచ్చుకోవచ్చును. తెలుగు శాసనసభ్యులందరూ ఎవరి ఆజ్ఞలకోసం వేచి ఉండకుండా వేరే సభచేసి తీర్మానం చేసి, దానికి నిలబడగలిగితే చాలు, మర్నాడు ఆంధ్రరాష్ట్రం వస్తుంది. "నిజంగా మీరంతా కావాలని కోరితే మిమ్మల్ని అడ్డగలవా రెవరు?" అని సర్దార్ పటేల్ ఇదివరలో చెప్పినమాటల్లో ఇదే అర్థం. మనదౌర్బల్యం ఆయనకుకూడా తెలుసును.

రాయలసీమ చెరువులు

చెన్నరాష్ట్రంలో 26 వేల చెరువులను తవ్వి మరమ్మతుచేసి, అదనంగా 20 లక్షల టన్నుల ఆహారం పండించడానికి 50 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తేవాలని మూడుసంవత్సరాల ప్రణాళిక ఒకదానిని రాష్ట్రప్రభుత్వం తయారు చేసింది. మిగతా కార్యక్రమాలన్నిటికంటె ఈ కార్యక్రమాన్ని అత్యంతప్రధానమైనదిగా పరిగణించడానికి కేంద్రప్రభుత్వం అంగీకరించింది.

రాయలసీమలో కొన్నివేల చెరువులు మరమ్మతు కావలసినవి ఉన్నాయి. వీనిలో చాలావరకూ పంటలకు నీరు సప్లై చేయగలవే. అయినా ప్రభుత్వ అశ్రద్ధవల్ల అవి పాడుపడిపోయినాయి. ప్రజలకి త్రాగడానికి కూడ నీరు కరువైనా ప్రభుత్వం తగు శ్రద్ధ తీసుకోలేదు. రాయలసీమ ఆర్థికాభివృద్ధిమాటెలా ఉన్నా ముందుగా ఈ చెరువుల్ని మరమ్మతుచేసి పంటసాగుకీ, ఇళ్లలో వాడకానికీ నీటి సదుపాయం చెయ్యడం ప్రభుత్వంయొక్క కనీసధర్మం. ఇంతవరకూ ఈ అశ్రద్ధకి హేతు వేదో, ఎవరూ త్రవ్వుకోవడం అనవసరం. కాని ఇప్పుడు చెన్నరాష్ట్ర మంత్రివర్గంలో సర్కారు ఆంధ్రులతో రాయలసీమ ఆంధ్రులకు సమానప్రాతినిధ్యం లభించింది కాబట్టి ఇప్పుడైనా రాయలసీమపట్ల అధిక శ్రద్ధ చూపడానికి అవకాశం ఏర్పడింది. సర్కార్లవారు చెయ్యని దెంతో, రాయలసీమవారు చెయ్యగలిగే దెంతో, వాస్తవంగా రాయలసీమఅభివృద్ధికి విముఖు లెవరో ఇప్పుడు తెలుసుకో

(20 వ పేజీ చూడుడు)



కాశ్మీర్ పరిస్థితి

కాశ్మీర్‌లో యుద్ధవిరమణ సంధి 1949 జనవరి 1వ తేదీని అమలు జరిగింది. అప్పటికి పరిస్థితి కొద్ది మార్పులు మినహా దాదాపు 1948 అక్టోబరు మాసంలో ఉన్న మాదిరిగానే ఉంది. ఉభయ పక్షాలు ఈ పటంలో చూపిన స్థితిలోనే స్థావరా లేర్పరుచుకుని ఉన్నాయి. ఇప్పుడీ ప్రాంతాలలో ప్లెబిసైట్ జరిగే ముందు పరిపాలన ఏరీతిగా సాగాలో, ఎవరి సైన్యాలు ఎంతెంత ఎక్కడ నిలవాలో ఐక్యరాజ్య సమితి కమిషన్ భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలకు అందచేసింది. ఈ సూచనల్ని భారతప్రభుత్వం పరిశీలించి తమ అభిప్రాయాన్ని అప్పుడే కమిషన్‌కు అందచేసింది. ఈలోగా జనవరి 15 తేదీ నిర్ణయం ప్రకారం భారతసేనలు విడిచివెళ్లిన ప్రాంతాలలో టిత్వాల్, ఊరీ, గూరెజ్ రంగాలలో ముఖ్య ప్రదేశాలను పాకిస్తాన్ సేనలు ఆక్రమించి యుద్ధవిరమణ ఒడంబడికను అతిక్రమించాయి. గత మూడు మాసాలుగా 80 పర్యాయాలు పాకిస్తాన్ సైన్యాలు హద్దుమీరి దాటి వచ్చాయని భారత ప్రభుత్వం కమిషనుకు ఫిర్యాదుచేసింది.

ఈ చిత్రపటంలో వాలుగీతల ప్రాంతం షేక్ అబ్దుల్లా ప్రభుత్వాధీనంలో ఉన్నది. అడ్డగీతలప్రాంతం పాకిస్తాన్ సైన్యాల ఆక్రమణలో ఉన్నది. రెండింటికీ మధ్య చుక్కలుగల ప్రాంతం 1948 అక్టోబరులో రణరంగం. దాదాపు అదే ఉభయుల ఆక్రమణలోనూ లేకుండా విడువబడిన మధ్యప్రాంతం. ఈ ప్రాంతంలోనే టిత్వాల్, ఊరి, గూరెజ్ లున్నాయి.

పెద్దకథ :

"సర్వసుందరి"

మూలం :
శ్రీ బ్రజకృష్ణగుప్తా

అనుకరణ:
శశిభూషన్ పాత్రో

ప్రేమ గ్రుడ్డి దంటారు కొందరు. మానవజీవిత మనే సాగరంలో, యౌవ్వనం ఒక పెద్ద తుపానువంటి దంటారు మరికొంద రనుభవజ్ఞులు. పాపం! ఆ తుపానులో ఎన్ని జీవాల ప్రాణాలు పోతాయో! అందమైన కన్యలు కూడా పాపం! ఎన్నో గొంతెమ్మ కోరికలు కోరుంటారు. ఇలా అయితే బావుణ్ణు. అలా అయితే మరీ బాగుంటుంది. నా ప్రియుడు ఎప్పుడూ నాదగ్గరే వుండిపోవాలి. నేను మహారాణి నయితే...మరింకేం? ...శబాష్... హహ్హా హ్హా!!!

అనార్కలీ ఇటువంటి గొంతెమ్మ కోరికే కోరింది. ఆకాశా న్నంటబోయి, భూమ్మీద బోర్లపడ్డది. యువరాజు సలీమ్‌కి హృదయ మర్పించింది. భారతదేశానికి భావి మహారాజ్ఞి నవుతానన్నే స్వప్నాలు చూస్తుండేది. అమాయకురాలు...పిచ్చిపిల్ల...ఆమె కోరికలు ఆమెలోనే అంతరించిపోయినయ్. అక్బరుపాదుషాకి ఆమె ఒక పెనుభూతంలా కనిపించిందో లేక మరే కారణంచేతనో, ఆమె జీవితాన్ని నాశనం చేశాడు! సౌందర్యంయొక్క నమూనాని, బ్రతికుండగానే ఒక స్తంభంలో పూడ్చేశారు. అగ్నితో ఆడినందుకు తగిన ఫలితం పొందిన దని సంతోషించాడు పాదుషా. ఎన్నో మధురతమ స్వప్నాలు కన్న అనార్కలీ జీవితం, ప్రేమ చరిత్ర విషాదాంతంగా మారింది.

యువరాజు ఏవిధంగా దండించబడ్డాడో, ఎవరికీ తెలీదు. గాయపడ్డ హృదయంతో ఏం పనులు చేశాడో లేదో, ఏవిషయం కూడా చరిత్రలో లేదు. ఎన్ని పుష్పాల మధువు గ్రోలాడో అది కూడా చరిత్రలో లేదు. కాని, కొన్నాళ్ల తరవాత మెహరున్నిసా నయనబాణాలకు గురి అయ్యా డనిమాత్రం చరిత్ర చెబుతూంది. అక్బరుది "గ్రద్దకండ్లు" అని సలీమ్‌కి తెలీదు గాబోలు, ఆసంగతి కూడా పాదుషా చెవుల్లోకి ప్రాకింది. యువరాజుని ఉన్మాదావస్థలో చూశాడు కూడా. ఈ కంటకాన్ని దూరంచెయ్యాలనుకుని, బర్ద్వాన్‌కి శాసకుడైన షేర్ అఫ్ఘన్‌కి అప్పగించాడు ఆమెను.

ఒకేరకం కేసులో అక్బరు ఇటువంటి భేదభావా లెందుకు కల్పించాడు? ఒకరికి మృత్యుదండన. ఇంకొకరికి పుష్పశయ్య ఎందుకు? ఏ దెలావున్నా అది అక్బరున్యాయం. దాన్ని మన మెందుకు విమర్శించడం? అక్బరేం సామాన్యుడా! మొగలాయి చక్రవర్తుల్లో మాణిక్యం! మహమ్మదీయ సమైక్యతాధురంధరుడు! అబ్బో! దార్లో నున్న కంటకాన్ని దూరంగా విసిరి పారెయ్యగానే, దారి కంటకరహిత మైపోయిందనుకున్నా డక్బరు.

షేర్ అఫ్ఘన్ మహల్లో మెహర్ సురక్షితంగా వుంటుంది, అంతవరకూ యువరాజు వెళ్లలేడని తనలో తా ననుకున్నాడు. అనవసరంగా మనస్సులు పాడుచేసుకొనే విషయాలు మరేమీ లే వనుకొన్నాడు. అలా నిశ్చితగా వుండడం వల్ల అక్బరు ఎంత పొరపాటుచేశాడో, 'చరిత్ర' దానికి సాక్షి. సలీమ్ అనార్కలీని మర్చిపోయాడు. మెహర్‌మాత్రం అతని మనస్సులో ముల్లులా గుచ్చుకొని, వుండివుండి అతని హృదయాన్ని బాధపెట్టసాగింది. మరి ఆమె ఇంకో మహల్లో శోభిస్తూందిగా!!

మెహరున్నిసా సౌందర్యంయొక్క ఖ్యాతి, ఆమెకంటేముందే బర్ద్వాన్ కెళ్లిపోయింది. ఆ సౌందర్యరాశిని చూడటానికి ప్రజలంతా తండోపతండాలుగా రాజభవనానికి ఎదురుగా గుమిగూడారు. షేర్ అఫ్ఘన్ బర్ద్వాన్‌కి చేరు కునేసరికి ఈ తమాషా చూశాడు. తను అద్వితీయ సౌందర్యవతినని మెహరున్నిసాకి చాలా గర్వం! ఈ జనసమూహాన్ని చూసి, ఆమె మరింత పొంగిపోయింది. అందరికీ మధ్యను ఆమె కూర్చుంది గర్వంగా! మహారాణీలాగ! నిజమే, ఆమె రాణి! కాదు మరీ! తన మర్యాదకి భంగ మౌస్తుం దని ఎవ్వరితోనూ మాట్లాడలేదు. చెవులు మాత్రం అప్పగించి కూర్చుంది—తన విషయమై ఎవ రేమనుకుంటూన్నారో అని.

వినిపించింది. ఎవరో అన్నారు—"ఓస్! ఇంతేనా! ఇ దొక సౌందర్యమా! సౌందర్యం చూడాలంటే, శేట్ చతురసేనుని భార్యను చూడాలి. ఆమె ఆగ్రానుండి వచ్చింది. నువ్వే మంటే అనుగాని, ఆమెఅందంముందు, ఈమె ఎందుకి మారదు." మెహర్ వింటుందేమోనని చాలా మెల్లిగా అన్నమాటలు, ఆమె చెవులు బాగా విన్నయ్. పాముచెవులు గాబోలు!

మెల్లిమెల్లిగా అందరూ వెళ్లిపోయారు. ఎంతోమంది చెలికత్తెలు ఆమెను చుట్టేశారు. అందరూ తలోక పని చేయ నారంభించారు. ఒకత్తె తల దువ్వసాగింది. ఒకత్తె తలకు నూనె రాస్తుంది. ఇంకొకత్తె పూలు తగిలించడానికి తయారుగా వుంది. ఇంతలోనే షేర్ అఫ్ఘన్ ప్రవేశించాడు—"ఇంకా నువు ప్రయాణం బట్టలైనా మార్చలేదా?" ప్రశ్నలో ప్రేమరస మంతా ఇట్టే ఒలికించాడు. "చాల్లెండి, మీపని కత్తెలు ఎంతో అందంగా వుంటా రనుకున్నా గాని, యింతకురూపులని నా కిప్పుడే తెలిసింది. ఒక్కత్తైనా నన్ను ముట్టుకోడానికి అర్హురాలు కాదు." ఎంత గర్వం! కాదు మరీ? "మీ బర్ద్వాన్‌లో నాకు దాసీదిగా వుండడానికి మరెవ్వరూ అందకత్తెలే లేరా? అని మళ్లీ ప్రశ్నించింది. "జీవితమంతా యుద్ధాలూ, పులులూ, సింహాలతోనే గడిపాను. 'అందం'అనే అంగడి సంగతి నాకేం తెలుసు?" అన్నాడు అమాయకంగా చిరునవ్వుతో. "ఆ సంగతి నాకూ తెలుసు. కాని యిక్కడికి రాగానే తెల్సింది- శేట్ చతుర సేనుని భార్య నా కుపయుక్తమైన పరిచారిక అని."

"పట్టణంలో అందరికంటే వాడు పెద్దశేట్. నాకంటే ఎక్కువ ధనికుడు. అతని భార్యను దాసీగా నియమిస్తే ప్రజల్లో విద్రోహబీజాలు అంకురిస్తాయి. పాదుషాకి తెలిస్తే నా హోదా ఊడిపోతుంది. నే నటువంటి సాహసం చెయ్యలేను." అన్నాడు షేర్ జంకుతో. "నా ప్రథమ కోరికను మీరు ఆమాత్రం నెరవేర్చలేరా? మీరు సింహాల్తో దెబ్బలాడటంలో దక్షులే కావచ్చు. కాని అందానికి విలువకట్టడం మీకు చేతకాదు. శేట్‌జీభార్య ఈవేళ తప్పకుండా రావాలి. లేకపోతే ఈ వజ్రపుటుంగరాన్ని మ్రింగి శాశ్వతంగా నిద్రబోతాను. అప్పుడు పాదుషా మీ హోదాని మరింత ఎక్కువ చేస్తాడు. 'మా షేర్ సింహాన్ని చంపగలడు, సౌందర్యాన్ని అవమానించగలడుకూడా' అని అక్బరు గర్విస్తాడు. ఏమంటారు?" ఆ మాటల్లో ఎంత వ్యంగ్యం! ఒక్కొక్క శబ్దం బాకు పోటుల్లా తగిలాయి షేర్‌కి. అయినా అవి తన భార్య నోటంట వచ్చినయ్. అవే యింకొకరంటేనా!.........ఆమె అందాలకుప్ప!

"సరే, ఈ దాసుడు రాణీజీ ఆజ్ఞను శిరసావహిస్తున్నాడు" అన్నాడు షేర్ తన మనోభావాల్ని అణచుకుంటూ. చతురసేనుని కొక వుత్తరం రాసిచ్చాడు షేర్—అతని భార్యను బేగమ్ చూడగోర్తుందనీ, వెంటనే ఆమెను మహల్లోకి పంపించమనీ—వుత్తరంతోపాటు 'పల్లకీ' కూడా వుందనీ.

చతురసేనుడు వుత్తరం చదువుకున్నాడు. తరవాత తండ్రికీ, భార్య సర్వసుందరికీ చదివి వినిపించాడు. సర్వసుందరి సలహామీద ఉత్తరానికి జవాబు రాయబడింది—చతురసేనుడు, బేగమ్‌నీ, షేర్‌నీ విందుకోసం ఆహ్వానిస్తున్నాడనీ, సమయం, తేదీ నిశ్చయించుకుని తప్పకుండా దయ చెయ్యమనీ - రాజపరివారానికీ, గౌరవమర్యాదల్లో ఏవిధమైన లోటుపాట్లు రాకుండా అన్నిప్రయత్నాలు సర్వసుందరి చేస్తుందనీ - ఆజ్ఞకోసం నిరీక్షిస్తున్నారనీ.

అటునుండి జవాబొచ్చింది: ముందు షేర్‌యొక్క ప్రథమ ఆజ్ఞ పాలించితీరాలని, ఉత్తరాన్ని తీసుకెళ్లిన భటులు చెప్పారు. వెంటనే సర్వసుందరీదేవిని రాజభవనానికి తీసుకురమ్మన్నారనీ. చతురసేనుని ఇంటిచుట్టూ సశస్త్ర సైనికుల పహరా. లేఖద్వారా చతురసేనుడు కబురంపించాడు - ఈ విధంగా తన నవమానిస్తున్నారని. షేర్ స్వయంగా వచ్చాడు. చతురసేనుని తండ్రి, సర్వసుందరి, చతురసేనుడు, అతని కూతురు లాలీ, వీళ్లంతా పారిపోడానికి ప్రయత్నించారు. కాని, అంతా సైనికులచేత పట్టుబడ్డారు. శేట్‌జీ యుద్ధంచేస్తూ చచ్చాడు. అతని తండ్రినీ, లాలీనీ, ఇస్లాంమతంలో కలిపి వదిలేశారు. సర్వసుందరిని మెహరున్నిసాఎదుట నిలబెట్టారు. అబ్బా! ఏమిటీ అమానుష చర్యలు! ఉఫ్... రాక్షసం...!

ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. "ఇదిగో, ఈవేళటినుండీ నువు నా పరిచారికవు. ఈ క్షణంనుండీ నువు 'జులేఖా' అనే పేరుతో పిలువబతావు." అంది మెహర్ గర్వంగా. "నా సర్వస్వాన్నపహరించి నన్నొక్కత్తెనీ ఎందుకుంచావ్? నన్నూ కూడా చంపెయ్." జవాబిచ్చింది సర్వసుందరి. ఆమెస్వరంలో రోషం, ప్రౌఢేయత కావిలించుకున్నయ్.

"ఇలా చూడు, ఈ మగవాళ్లంతా వట్టి మూర్ఖులు సుమా! మేం కోరగానే నిన్నిక్కడికి పంపించకుండా, యింతవరకూ వచ్చింది, నీభర్త మూర్ఖత్వంవల్లనే. నాభర్త మూర్ఖత్వంవల్ల, నీభర్త పోయాడు. అయిపోయిం దేదో అయిపోయింది. జరిగిందంతా ఒక స్వప్న మనుకో. యిప్పుడు నువు వాస్తవికజగత్తులోని కొచ్చావు. నీ లాలీ నిప్పుడు పిలిపిస్తాను. నీ కిక్కడ ఏవిధమైన కష్టం, లేక అసౌకర్యం జరగదు. పాత సంగతులన్నీ మర్చిపో!" అంది మెహర్. ఏంసానుభూతి! శబాష్! పయోముఖవిషకుంభం! తేనె పూసిన కత్తి!!...

"నన్ను నాశనంచేసి, ఏవిధమైన సుఖం నాకు చేకూర్చగలరు? నేను మండిపోతున్నాను. నన్ను కాల్చేయండి. లేకపోతే నా హృదయాగ్ని జ్వాలల్లో మిమ్మల్నీ, మీరాజభవనాన్నీ, ఒక్కసారిగా మండేలా చేస్తాను." హృదయంలోని వ్యథంతా ఒక్కసారి జ్వాలాముఖిలా ప్రజ్వరిల్లింది. పాపం! సర్వసుందరి! అసహాయ!... అబల!...

"నాకు తెలుసు. నువ్వందంగా వున్నావు. నా భర్తను నీ సౌందర్యజాలంలో పడవెయ్యాలని చూస్తున్నావు గాబోలు, నేను దానికూడా విరుగుడు ఆలోచించాను. అతనిదృష్టి నీమీద పడకుండా వుండడానికి తగిన సరంజామా చేసి వుంచాను." హాస్యమాడింది మెహర్. అందకత్తెల పోటీ! యిద్దర్నీ సమాన స్థాయిలో సౌందర్యవతులుగా సృష్టించడంలో 'ఓల్డ్ హాగ్' (*Old hag*) బ్రహ్మయొక్క ఉద్దేశ మేమిటో! సృష్టివైపరీత్యం! వింత ప్రకృతి!...బలే తమాషా!...

"చచ్చిన పాముని యింకా ఎందుకు చంపుతారు? ఈవిధంగా నన్ను మీ రవమానిస్తే మీ కొచ్చిన లాభ మేమి? నా కుంకుమరేఖను మీరు మీ నిర్దయ హస్తాల్లో తుడిచేశారు. నేను హిందూ స్త్రీని. నేను రెండోపెళ్లి చేసుకోలేను" ఆమె ఏడవసాగింది. "అనవసరంగా పంతగించకు. ఇప్పుడు నీ మనస్సు సరిగా లేదు. వెళ్లి కొంచెం విశ్రాంతి తీసుకో. నీ కూతురు రేపు నీ దగ్గర కొస్తుంది. నామాట నమ్ము! నిన్ను నా ఆరో ప్రాణంలా చూసుకుంటాను."

చతురసేనుని తండ్రి లాలీతో ఎక్కడికో వెళ్లిపోయా డని రెండోరోజు తెలిసింది. ఎంత ప్రయత్నించినా ఫలితం శూన్య మయింది. సర్వసుందరికి మెహర్‌యొక్క దాసీత్వం ఒప్పుకోక తప్పింది కాదు. ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. కాని, ఆమె హృదయంలో రగుల్కొన్న అగ్ని జ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రతీకారంకోసం ఆమె బ్రతకా లని నిశ్చయించుకుంది. ప్రతీకారం!......భీషణప్రతిహింస!!!

రోజంతా ఆమెకు మెహర్ సేవలోనే గడచిపోయేది. రాత్రులు ప్రతీకారం తీర్చుకోడానికి ఉపాయా లాలోచించేది. స్వప్నాల్లో లాలీ కనబడి, ఆమె హృదయాన్ని కలవరపెట్టేది. ఈమె అంటే మెహర్‌కి ప్రత్యేకాభిమానం కుదిరింది. ఆమె మెహర్ హృదయంలో ప్రత్యేకస్థానం అలంకరించుకుంది. బేగమ్ కామె అంతరంగికమిత్రురా లయింది. ఆమె సలహా లేకుండా బేగమ్ ఏపనికూడా చేసేది కాదు. రోజులు దొర్లుతూన్న కొద్దీ, బేగమ్ కెందుకోగాని, సర్వసుందరి అంటే చాలా గౌరవం, నమ్మకం కుదిరింది. కాని...

రాత్రులు సర్వసుందరిఆలోచనలు! బేగమ్‌కి విషప్రయోగం చేస్తే? ఓస్, ఇంతేనా? ఏం లాభం! అలా చేస్తే మెహర్‌కేవిధమైన కష్టం వుండదు. శాశ్వతంగా కళ్లు మూస్తుంది! ఎందుకొచ్చిన ప్రతీకారం! లేదు! అలా కాదు! మెహర్ బ్రతకాలి! జీవితమంతా ఏడుస్తూ గడపాలి! గిలగిలా కొట్టుకుంటూ, గింజుకుంటూ, జీవితయాత్రను సాగించాలి. అప్పుడు మజా చూడాలి. అప్పుడామె కోరికలు నెరవేరుతయ్. ఆమె ప్రతిజ్ఞ ఫలిస్తుంది. ఆమె ప్రతీకారం పూర్తవుతుంది! వహ్వా!...హోహోహోహో.....చాలా బాగుంది! భేష్!......మంచి ఉపాయం!......

పోనీ, షేర్ భోజనంలో విషం కలిపేస్తే! మెహర్ 'విధవ'అయి కూర్చుంటుంది. జీవితమంతా కన్నీటి ప్రవాహంలో, ఈతరాని వ్యక్తిలా 'తేలానాం మునగానాం'అంటూ తేల్తూ మునుగుతూ గడుపుతుంది. ఛా! ఛా! అలా పనికిరాదు! ఆమె తురకది! అందమైనది. విధవయినా యింకో పెళ్లి చేసుకోగలదు. ఆమె సౌందర్యం ఆమెను వైధవ్యజీవనం గడపనివ్వదు. రోజూ ఆమె ఇలానే ఉపాయాలు ఆలోచిస్తుండేది. ప్రతీఉపాయంలోనూ మెహర్ సులువుగా తప్పుకునే మార్గాలు సునాయాసంగా కనిపిస్తున్నయ్. సమయంకోసం నిరీక్షిస్తూ ఇలానే కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

(22-వ పేజీ చూడుడు)

హైదరాబాద్ సంస్థానంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కార్యక్రమాలు

హైదరాబాద్ సంస్థానంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తికీ, ఇరిగేషన్ సదుపాయాలివ్వడానికీ అవకాశాలు అపారంగా ఉన్నాయి. పెద్ద, చిన్న ప్రాజెక్టు లనేకం నిర్మించడానికి ప్రభుత్వం సమకట్టింది. తద్వారా ఆహారోత్పత్తి వృద్ధి పరచడానికీ, విద్యుచ్ఛక్తి చౌకగా సప్లయిచేసి పరిశ్రమలు పెంపొందించడానికీ తలపెట్టింది. సంస్థానం అంతటా త్వరలోనే ప్రతిపనికీ విద్యుచ్ఛక్తి తోడ్పడగలదని సంస్థానవాసులు ఆశించవచ్చును.

సంస్థాన పబ్లిక్ వర్క్సు శాఖవారు అప్పుడే రెండు పెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల్ని నిర్మిస్తున్నారు. నిర్మాణం చురుగ్గా సాగిపోతూ ఉంది. ఒకటి నిజాం సాగర్ ప్రాజెక్టు. రెండవది తుంగభద్ర ప్రాజెక్టు. వ్యవసాయానికి నీరు సప్లయి చెయ్యడానికి నిజాం సాగర్ నిర్మించబడింది. ఇక్కడ ప్రవహించే నీటివల్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచెయ్యడానికి ఇప్పుడు యత్నాలు జరుగుతున్నాయి. ఇరిగేషన్‌కీ, విద్యుచ్ఛక్తి సప్లైకీ తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణం సాగిపోతోంది.

ఇవే కాదు. ఇంకా పదకొండు పవర్ ప్రాజెక్టులు నిర్మించాలని యత్నాలు జరుగుతున్నాయి. వీనిలో ముఖ్యమైనవి గోదావరి, పెన్‌గంగ, కృష్ణా ప్రాజెక్టులు ముఖ్యమైనవి. అమెరికాలోని టెన్నెసీవాలీ అథారిటీ, ఉత్తర భారతదేశంలో దామోదర్‌వాలీ అథారిటీల వంటిదే గోదావరి వాలీ అథారిటీ ఒకటి నిర్మించి గోదావరీ ప్రాజెక్టుల్ని ఇంకా అభివృద్ధి పరచాలని కూడా ప్రభుత్వం తలపెట్టింది.

నిజాంసాగర్ :

నిజాంసాగర్‌వల్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే కార్యక్రమం ఇదివరకే ప్రారంభించబడింది. విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి కావలసిన యంత్ర పరికరాల కొనుబడికి ఆర్డర్లు ఇచ్చారు. ఈ స్కీమువల్ల ఉత్పత్తి కాగల పవర్ 15,000 కిలోవాట్సు. ఫెదరింగ్ ప్రొపెలర్ పద్ధతి వాటర్ టర్బైన్లతో పవర్‌హౌస్ నిర్మించాలి. 5000 కిలోవాట్లు ఉత్పత్తి చెయ్యగల టర్బైన్లు మూడు నెలకొల్పబడతాయి. 11 వేల వోల్టుల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చెయ్యడానికి వీలవుతుంది. సప్లై ట్రాన్స్‌మిషన్‌కి 66 వేల వోల్టులు వృద్ధి చెయ్యవచ్చును. ఇక్కడ ఉత్పత్తి కాగల విద్యుచ్ఛక్తి అంతా హైదరాబాద్ నగరానికే డబుల్ సర్క్యూట్ ట్రాన్స్‌మిషన్‌వల్ల సరఫరా అవుతుంది. హైదరాబాద్ నగరానికి హుసేన్ సాగర్‌నుంచి సప్లై అవుతున్న విద్యుచ్ఛక్తి చాలదు. దేవనూరునుంచి కూడా విద్యుచ్ఛక్తి సరఫరా కాగలిగినప్పుడు దాని సరఫరానిమిత్తం కూడా ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణానికి కార్యక్రమం దీనితోనే తయారయింది. రెంటికీ కలయిక నిజాంసాగర్‌కు 20 మైళ్లలో ఉన్న పాపన్నపేటవద్ద. పాపన్నపేట దేవనూరుకు కూడా 20 మైళ్ల దూరంలోనే ఉంది.

తుంగభద్ర :

తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణం మద్రాసు హైద్రాబాదు ప్రభుత్వాలు రెండిటికీ సంబంధించినది. నది కిరువంకలా రెండు పవర్ హౌస్‌లు, ఒకటి చెన్నరాష్ట్రంవైపు తీరంలోనూ, రెండవది హైద్రాబాద్ సంస్థానంవైపు తీరంలోనూ నిర్మించబడతాయి. హైదరాబాద్ వైపున నిర్మించబోయే పవర్‌హౌస్‌లో 30 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది. ఇక్కడ పరిస్థితి నిజాంసాగర్‌వద్ద ఉన్నట్లే ఉంటుంది. ఇక్కడకూడా అదేరీతిగా జెనరేటర్లు నెలకొల్పబడతాయి. దీనివల్ల ఒక ఉపయోగం ఉంది. యంత్రపరికరాల్లో ఉపయోగించే చిన్న వస్తుసామగ్రి మార్చవలసినప్పుడు రెండింటికీ ఒకే రకం సామగ్రిని ఉపయోగించవచ్చును. తుంగభద్ర పవర్‌హౌస్‌వద్ద ఉత్పత్తిని 132 వేల వోల్టులకు వృద్ధిపరిచి రాయచూరుకు, అక్కడనుంచి గుల్బర్గా, షహబాద్‌లకు, మహబూబ్‌నగర్‌గుండా హైదరాబాద్‌కు విద్యుచ్ఛక్తిని ప్రసరింపచేయవచ్చును.

కొత్తగా నిర్మించదలచినవానిలో తుంగభద్ర నుంచి సప్లై అయ్యే విద్యుచ్ఛక్తికి నాలుగు కేంద్రాలను నెలకొల్పేవాని విషయమై ఇంకా పరిశోధన పూర్తి కాలేదు.

గోదావరిప్రాజెక్టు :

గోదావరి ప్రాజెక్టుకింద పదకొండు పవర్ సైట్సు ఉంటాయి. వీనిలో కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి. కవల్‌గుడావద్ద 45 వేల కిలోవాట్సు, ఉత్తరకాలువల నిర్మాణకార్యక్రమం క్రింద 60 వేల కిలోవాట్సు సైట్సు నాలుగు, దక్షిణకాలువక్రింద 40 వేల కిలోవాట్సు సైట్సు రెండు, ఇంకా దక్షిణాన 30 వేల కిలోవాట్సు సైట్సు నాలుగు.

దిగువ గోదావరి లేక ఇంచినపల్లి డెవలప్‌మెంట్ ప్రాజెక్టు: ఇక్కడ మధ్యపరగణాల నుంచి వచ్చే వైన్‌గంగావల్ల 20 వేల క్యూసెక్కుల నీటి సప్లై స్థిరంగా ఉంటుంది. ఇక్కడ రెండులక్షల కిలోవాట్సు పవర్ కేంద్రం నిర్మించ వీలున్నది. చెరువులు త్రవ్వవచ్చును. ఇక్కడ నీరు 120 అడుగుల ఎత్తునుంచి క్రిందికి ప్రవహించే విధంగా చెయ్యవచ్చును. విద్యుచ్ఛక్తిఉత్పత్తికి సంస్థానంలోకెల్ల అనువైన ప్రదేశం ఇదే.

పూర్ణానదివల్ల ఆరువేల కిలోవాట్సు ఉత్పత్తికి అవకాశం ఉంది. పెన్‌గంగా ప్రాజెక్టు పరిశోధన ఇంకా పూర్తికాలేదు. ఇక్కడ దాదాపు 30 వేల కిలోవాట్సు ఉత్పత్తి చెయడ వచ్చునని అంచనా వెయ్యబడింది.

కృష్ణాప్రాజెక్టులు :

ఎగువ కృష్ణా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఇంకా సేకరించవలసి ఉంది. దీనివల్ల ఆరంభంలో 50 వేల కిలోవాట్సు, తరువాత ఎగువను ప్రాజెక్టులు నిర్మించినప్పుడు లక్ష కిలోవాట్సు ఉత్పత్తి చెయ్యడానికి వీలవుతుంది.

దిగువ కృష్ణా ప్రాజెక్టువల్లకూడా ఇంతే.

ఇప్పుడు సంస్థానంలో సప్లై కాగల 7,90,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తినీ వివిధకేంద్రాలకు ప్రసరింపచెయ్యడానికి స్కీములు సిద్ధంగాఉన్నాయి.

దేవనూరు ప్రాజెక్టు :

దేవనూరు ప్రాజెక్టు మంజీరానదిపైన నిర్మించబడుతుంది. నిజాం సాగర్‌కూడా ఈ నదిపైనే నిర్మించబడింది. నదీప్రవాహానికి ఎగువను నదివెంట వడితే నిజాంసాగర్‌నుంచి దేవనూరు 107 మైళ్లుంది. కాని దేవనూరుకీ, నిజాంసాగర్‌కీ మధ్య దూరం 23 మైళ్లే. ఈ ప్రాంతంలో నదీమట్టం ఎగువదిగువలమధ్య తేడా 375 అడుగులున్నందువల్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి చాలా అనుకూలంగా ఉంది. దేవనూరు రిజర్వాయిర్ నుంచి నీరు ఎనిమిదిమైళ్లు వేగంగా ప్రవహింపచేస్తారు. అక్కడ నీరు పల్లానికి దిగవలసినచోట నీటిని టర్బైన్లలో ప్రవేశింపచేస్తారు. మొదటి పవర్‌హౌస్‌నుంచి మూడుమైళ్లు నీరు ప్రవహించి రెండవ పవర్‌హౌస్‌వద్దకు (అక్కడ మరొక పల్లం ఉంది) ప్రవహిస్తుంది. ఆ తరువాత నీరు నిజాంసాగర్‌వరకూ ప్రవహించి అక్కడ రిజర్వాయిర్‌లో కలుస్తుంది. దేవనూరు ప్రాజెక్టు నిర్మాణం అయినప్పుడు నిజాం సాగర్‌లో నీటిమట్టం పరిస్థితి ఇంకా మేలుగా ఉంటుంది. దేవనూరు పవర్‌హౌస్‌లు రెండింటిలోనూ మొత్తం 32 వేల కిలోవాట్సు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కాగలదు.

తిరుమలాపురం పవర్‌ప్రాజెక్టు :

తుంగభద్ర మెయిన్ కెనాల్ పతనమయ్యేచోట తిరుమలాపురం పవర్ ప్రాజెక్టు నిర్మించబడుతుంది. ఇక్కడ ప్రవాహం 95 అడుగుల పల్లానికి దిగుతుంది. కాలువలో నీరు నిండుగా ఉన్నప్పుడు 54 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కాగలదు.

బసవపట్నం సౌరంగం :

బసవపట్నం పవర్ ప్రాజెక్టు బసవపట్నం సౌరంగం వద్దనే నిర్మించ బడుతుంది. తుంగభద్రా నదినుంచి కొంతనీటిని దిగువ కృష్ణా కాలువకి సప్లై చెయ్యాలని ప్రభుత్వం నిశ్చయించింది. బసవపట్నం సౌరంగంవద్ద తుంగభద్రనీరు నూరడుగుల పల్లం దిగునట్లు చేస్తే ఈ విధంగా సప్లై చెయ్యవచ్చును. ఈ పవర్ ప్రాజెక్టువల్ల 18 వేల కిలోవాట్సు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కాగలదు.

ఇప్రావద్ద తుంగభద్రానది 74 అడుగులు పల్లం దిగుతుంది. ఇక్కడ కూడా నీటిని దిగువ కృష్ణా కాలువలో కలుపవచ్చును. ఇక్కడ 14 వేల కిలోవాట్సు ఉత్పత్తి చెయ్యవచ్చును.

తుంగభద్ర కాలువపై రాయచూరువద్ద గండి దగ్గర నీరు 82 న్నర అడుగులు పల్లం దిగుతుంది. ఇక్కడ కూడా 10 వేల కిలోవాట్సు ఉత్పత్తి చెయ్యవచ్చును.

[హైదరాబాద్ ప్రభుత్వ సమాచార పత్రిక నుంచి.]

హైదరాబాద్ కుటీరపరిశ్రమలు

బీదర్‌పాత్రలు, కరీంనగర్ వెండిబంగారు లేసులు, వరంగల్ చేనేతవస్త్రాలు

హైదరాబాద్ సంస్థానంలో లక్షలాది ప్రజలకు కుటీరపరిశ్రమలే జీవనాధారం. ఒక్క చేనేతపరిశ్రమలోనే పదిలక్షలమంది ఉన్నారు. సంస్థానంలోని జనాభాలో మూడింట ఒకవంతు ఈ చేనేతవస్త్రమే ధరిస్తారు. ఇటీవల కల్లోల ఫలితంగా నిరాశ్రయులైనవారనేకమందికి హైదరాబాద్ ప్రభుత్వం చేయూత నిచ్చి కుటీర పరిశ్రమల్లో ప్రవేశపెట్టింది. ప్రభుత్వం ప్రారంభించిన గృహపరిశ్రమల కార్యక్రమంవల్ల అనేకమంది స్త్రీలు, బాలబాలికలు గృహప్రాంగణంలోనే ఉండి ధనార్జన చేసుకోడానికి అవకాశం కలిగింది. సంస్థానప్రభుత్వ కుటీరపరిశ్రమశాఖవారి సేల్సుడిపో రు. 5 లక్షల విలువ గల సరకులు అమ్మి ప్రజలకు అత్యంతోపకారం చేసింది. అయితే డిపో లాభాల నార్జించే ఉద్దేశంతో వ్యాపారం చెయ్యడంలేదు.

ఈ కుటీరపరిశ్రమల్లో చౌకగా తయారైన వస్తువులు అతిసుందరమైనవి. అత్యంతోపయోగమైనది. ఇవి ప్రపంచంలోని అన్ని కేంద్రాలలోనూ ప్రదర్శింపబడినవి. బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, బెల్జియం, ఇటలీదేశాలలో ఈ వస్తువులు మన్నన పొందినవి. భారతదేశంలో ప్రదర్శనాలలోకూడా హైదరాబాద్ కుటీర పరిశ్రమల్లో తయారైన వస్తువులు ప్రశంస పొందినవి. ఈ సంవత్సరం ఈ వస్తువుల్ని లండన్‌లో బ్రిటిష్‌పారిశ్రామిక ప్రదర్శనానికీ, బ్రసెల్సులో ప్రదర్శనానికీ పంపారు. హైదరాబాద్ ప్రభుత్వం గత 18 సంవత్సరాలుగా చేయూత నివ్వబట్టిగాని, లేకపోయినట్లయితే ఈ పురాతన ప్రసిద్ధమైన కుటీరపరిశ్రమ లేనాడో నశించిపోయేవి.

ఇక్కడ కుటీరపరిశ్రమల్లో ముఖ్యమైనవి చేనేత, తివాసీలనేత, బొమ్మలచేత, వడ్రంగం, అద్దకం, ఊలుకుట్టు, అల్లిక, పేముపని, బీదర్ పాత్రల తయారీ, ఇవిగాక చేపలపరిశ్రమ, ఊలు అల్లికలు (మేజోళ్లు వగైరా), తోలు మొదలైన పరిశ్రమలు వృద్ధిపరచడానికి యత్నాలు జరుగుతున్నాయి.

నిత్యం మారిపోతూఉండే ఫేషన్లు ఇక్కడ కుటీరపరిశ్రమలపైనే ఆధారపడి ఉంటాయి. చేతిపరిశ్రమల నిపుణులకు ప్రోత్సాహమివ్వబడుతుంది. కొత్తకొత్త రీతుల ఈ పరిశ్రమల్ని వృద్ధి పరచడానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుంది. ఈ పరిశ్రమల్లో తయారైనవాని నాణ్యం మేలుగా ఉంచడానికి ప్రభుత్వం అజమాయిషీ చేస్తుంది. ఈ పారిశ్రామికులు తమ సరుకు లన్నిటినీ ప్రభుత్వపు కుటీర పరిశ్రమ వస్తువుల అమ్మకపు డిపోకే అమ్ముతారు. వీరికి మధ్యవర్తులు, దురాశాపరులైన కమీషన్‌దారులు దళారీల బాధ లేదు. మార్కెట్‌లో అమ్మజాలని వస్తువుల్ని సేల్సు డిపో కొని మార్కెట్‌లో పెట్టుతుంది.

ఈ డిపోకి హైద్రాబాద్‌లో ఒక శాఖ, ఔరంగాబాదులో ఒక ప్రదర్శనాలయం ఉన్నాయి. ఆధునిక పారిశ్రామిక విధానాల్లో శిక్షణ నివ్వడానికి సెంట్రల్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ఒకటి గాక నల్లగొండ, వరంగల్, రాయచూరు, కరీంనగరు, నందేడ్, పర్భనీ, ఔరంగాబాద్, గుల్బర్గా, మేథక్ పట్టణాల్లో కూడా శిక్షణకేంద్రా లున్నాయి.

చిత్రవిచిత్రాలైన వస్త్రాలు, అపూర్వమైన వస్తువులు, ఆభరణాలు, అలంకారాలు అన్నీ ఇక్కడ తయారవుతాయి. బొత్తాములు మొదలు దుస్తులవరకు, జడపిన్నుల మొదలు దంతపు దీపఛాయలు అన్నీ సేల్సు డిపోలో ప్రదర్శింపబడతాయి. ఔరంగాబాద్ చేనేత వస్త్రాలు, నిర్మల్ (అదిలాబాద్) ఆటబొమ్మలు, వరంగల్ సిల్కులు, రాయచూరు రగ్గులు, తోలు వస్తువులు, బీదర్ పాత్రలు అన్నీ కన్నుల పండువుగా కనిపిస్తాయి.

వెండి బంగారు లేస్‌పనికి ఔరంగాబాద్, పైఠాన్ జిల్లాలు చరిత్ర ప్రసిద్ధి పొందినవి. ముఖ్యంగా కామ్‌ఖాబ్ ప్రపంచఖ్యాతి పొందింది. 1609 లో గోల్కొండ కుతుబ్ షాహీ దర్బారులో పర్షియా రాయబారి కాంఖాబ్ తనతో స్వదేశం తీసుకెళ్లాడు. అది తయారు

(18-వ పేజీ చూడుడు)

అమెరికన్ డాలర్ల పెట్టుబడి ఆసియా ఆర్థికాభివృద్ధికా? దోపిడికా?

భారత దేశంలో పరిశ్రమల అభివృద్ధికి విదేశీయులు పెట్టుబడి పెట్టుకొనవచ్చు ననీ, వారికికూడా దేశీయులైన పెట్టుబడిదారుల కిచ్చే గారంటీలు, సౌకర్యాలు అన్నిటినీ ప్రభుత్వం ఇవ్వగలదనీ ఇటీవల భారతప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పార్లమెంట్‌లో ప్రకటించారు. విదేశీయులు పెట్టుబడి పెట్టినట్లయితే దేశీయ వస్తూత్పత్తి పెంపొంది ప్రజల ఆర్థికస్థితి వృద్ధి కాగలదని కొందరూ, కాదు విదేశీయుల పెట్టుబడికి అవకాశ మిస్తే, మనదేశంలో లాభాలను అపారంగా ఆర్జించి వారు వారి దేశాలకి వెండిబంగారాలు, వస్తువులు తీసుకుపోతే మనదేశంలో పెట్టుబడి సత్తా తగ్గిపోతుం దనీ మొదలైన విభిన్నాభిప్రాయాలు నెహ్రూ ప్రకటనపై వెలువడినాయి.

అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ అధికార స్వీకార సందర్భంలో తన పరిపాలనావిధానాన్ని వివరిస్తూ స్థూలంగా నాలుగు ముఖ్యాంశాలు చెప్పాడు. అందులో నాలుగో అంశం "ఆర్థికంగా వెనుకబడిన దేశాల ఆర్థికాభివృద్ధికి పెట్టుబడిధనం ద్వారానూ, నిపుణుల నిచ్చీ అమెరికా తోడ్పడగలదు"అని చెప్పాడు. దానితో మన దేశంలోనూ, బర్మా, సయాం మొదలైన ఇతర ఆసియా దేశాల్లోనూ అమెరికా మార్షల్ ప్రణాళికవంటిదే ఒక ప్రణాళికను అమలు జరుపుతుం దని భావించారు. కాని ట్రూమన్ అప్పుడు పలికిన పలుకేగాని, ప్రపంచబాంక్, అంతర్జాతీయనిధి వారి హడావిడి తప్ప తిరిగీ దానిమాట ఎవరూ ఎత్తలేదు. ఇప్పుడు మళ్లీ మార్షల్ ఆర్థిక ప్రణాళిక సంస్థ (ఇది యూరప్‌కు మాత్రమే సంబంధించినది.) ఆసియా "వలస"దేశాలశాఖ ఒకటి స్థాపిస్తోందట. ఈ "వలస"అనే మాటపైన చాలామంది సందిగ్ధావస్థలో పడ్డారు. ఇంకా యూరోపియన్ ప్రభుత్వాలక్రింద వలసలుగానే ఉన్న దేశాలకిమాత్రమే నేమో నని కొందరి అనుమానం. అది నిజమైనా కాకపోయినా, ఆర్థికపునర్నిర్మాణసహాయ కార్యక్రమంలో ఈ"వలస"దేశాలకీ, అన్య ఆసియా దేశాలకీ అమెరికా భిన్న రీతులు అవలంబిస్తుందేమో ననే అనుమానం మన దేశంలో ప్రబలంగా ఉంది.

మనదేశంలో ధనం కొల్లలుగా ఉన్నవారు దానిని సవ్యంగా పరిశ్రమాభివృద్ధికి వినియోగించడం లేదనీ, పెట్టుబడిదారులు ప్రభుత్వంపైన కత్తిగట్టినట్లు ప్రవర్తిస్తున్నారనీ దేశంలో అందరికీ తెలిసిందే. దీనివల్లనే దేశంలో వస్తూత్పత్తి వృద్ధి కాలేదనీ, అందువల్ల ఇన్‌ఫ్లేషన్ బాధ తగ్గకపోగా ఇంకా హెచ్చుతోందనీ ఇదివరలో ప్రభుత్వమే చెప్పింది. ఇటీవల ప్రభుత్వం పరిశ్రమలు, పెట్టుబడిపట్ల తన విధానాన్ని మార్చుకున్నప్పటికీ, వారి కింకా అదనపు సౌకర్యాలు కలిగించినప్పటికీ దేశంలో వస్తూత్పత్తి పెరుగుదల అతిస్వల్పంగానే ఉండిపోయింది. మన దేశంలో సహజసంపదని ప్రజల కందుబాటులోకి తెచ్చి, వారి జీవనం మరికొంత సుఖప్రదం చేయాలంటే, మనదేశంలో వస్తూత్పత్తి చాలా పెరగవలసిఉంది. పెరగవలసినంత వస్తూత్పత్తికి చాలినంత పెట్టుబడిధనంగాని, యంత్రపరికరాలుగాని లేవు. నిపుణులు లేరు. అందువల్ల విదేశీయుల పెట్టుబడి తెచ్చుకోకనూ తప్పడంలేదు. తెచ్చుకున్నాక వారే రాజకీయ షరతులు కోరతారో అని భయంగా ఉంది. ఇటువంటి వింతపరిస్థితిలో పండిట్ నెహ్రూ పై ప్రకటన చేశాడు. పెట్టుబడిదారుల్ని ప్రోత్సహించడం నిమిత్తం పరిశ్రమాభివృద్ధిపట్ల ప్రభుత్వ విధానం ఎలా ఉంటుందో ఇటీవలనే ప్రభుత్వం ఒక శాసనంద్వారా స్పష్టంగా వివరించింది. ఇంక తరుణంకోసం వేచిఉన్న డాలర్ మన దేశానికి ఊరేగుతూ రావచ్చును. ఆసియా దేశాలలో ప్రజల ఆర్థిక జీవన ప్రమాణాన్ని నూటికి రెండువంతులు వృద్ధిపరచడానికి యత్నిస్తే చాలు, అమెరికాలో పెట్టుబడిదారులు బంగారం పండుతున్నదనీ, అమెరికాలో నూరేసంవత్సరాలవరకూ నిరుద్యోగ బాధ ఉండదనీ ఇటీవల "లైఫ్" పత్రిక సంపాదకీయంలో వ్రాసింది. ఈ సందర్భంలో డాలర్ పెట్టుబడి అంటే ఏమిటో పూర్వానుభవాన్ని బట్టి విమర్శనాపూర్వకంగా అమెరికాలో లిబరల్ పత్రికైన 'నేషన్'లో థామస్ సాంక్టన్ వ్రాసిన వ్యాసాన్ని ఇక్కడ సంగ్రహంగా ప్రచురిస్తున్నాము.

ప్రపంచంలోని వలసదేశాలన్నిటిలోనూ ఆర్థికాభివృద్ధి నిమిత్తం ప్రెసిడెంట్ ట్రూమన్ సూచించిన "నూతనకార్యక్రమం"లో విశేషాలు తెలుసుకోవాలని అందరూ తహతహలాడుతున్నారు. అందరి సందేహాలు తీర్చేది ఎవరు? ప్రెసిడెంట్ ట్రూమన్ ఈ కార్యక్రమం గురించి అధికార స్వీకార సందర్భంలో నాలుగో అంశంగా చెప్పినప్పుడు, అంతకుముం దేమీ దీన్ని గురించిన వివరాలేవీ తయారు కాలేదు. అవి ఇంకా ఎవరూ తెలుసుకోలేదు. అటువంటి కార్యక్రమాన్ని గురించి ట్రూమన్‌కి దృఢాభిప్రాయం ఉండిఉండాలి. ఈ అభిప్రాయం ప్రపంచవ్యవహారాల్లో అత్యంతప్రధానమైనది. ఆర్థికంగా హీనస్థితిలోఉన్న దేశాల్లో కమ్యూనిజాన్ని అరికట్టా లనే ఉద్దేశమే ఈ కార్యక్రమానికి మూలం. అమెరికా ధనబలం ద్వారానూ, విజ్ఞానశాస్త్ర నిపుణుల తోడ్పాటుతోనూ కమ్యూనిజాన్ని అరికట్ట దలిచాడు. ప్రపంచంలోని స్వతంత్రజాతులు స్వయం కృషిపైనే ఆధారపడి ఆహారం, వస్త్రం విద్యుచ్ఛక్తి మొదలైనవాని ఉత్పత్తిని వృద్ధిపరుచుకోడానికి అమెరికా తోడ్పడి కమ్యూనిజాన్ని అరికట్ట దలచుకుం దని ట్రూమన్ చెప్పాడు.

ఇది సాధించాలంటే, ఆర్థిక వ్యవస్థ కల్లోలంగా ఉన్న దేశాలలో విరుద్ధ శక్తులు సంఘర్షణ పడుతున్న పరిస్థితులలో, పెట్టుబడిదారులు పెట్టుబడిన ధనంతో జూదమాడగలరు. కాని ప్రభుత్వం సక్రమ కార్యక్రమం నిర్వహించడం కష్టం.

వలసదేశాల్లో పెట్టుబడిపెట్టినవారి చరిత్రలో ఆదర్శపురుషుడు రాబర్ట్ క్లైవ్. క్రీస్తుమత ప్రచారకుడు కాదు. పెట్టుబడిదారుల తరహాయే అదొక రకంగా ఉంటుంది. వారి భావనారీతి, ప్రవర్తన, ఆశయాలు, ఆదర్శాలు వారివే. ఈ తరహాకీ, ట్రూమన్ కార్యక్రమంలో సూచించబడిన ప్రజాహితకాంక్షకీ పోలికే లేదు. లాభార్జన దృష్టిలేని ఈ వింత పెట్టుబడికి, కోటీశ్వరులతో కలసి ప్రభుత్వం పెట్టుబడి పెట్టడానికి తగిన బహుముఖఆర్థికాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించాలంటే, దానికవసరమైన వ్యక్తిగత ప్రతిష్ఠ, గ్రహణ పారీణత, రాజనీతి, దూరదృష్టి రూజ్‌వెల్టుకి ఉండేవి. ట్రూమన్ ఒక నిశ్చయానికి వచ్చాడంటే పట్టుదలతో పనిచేయగల సమర్థత అతని కుందిగాని, ప్రపంచవ్యాప్తమైన యింతటి కార్యక్రమాన్నిగాని, దీని వల్ల కలిగే ఫలితాలనుగాని గ్రహించే సమర్థత లేదు. అందువల్లనే అమెరికన్ విదేశాంగ వ్యవహారాలకు ప్రపంచ రాజకీయాలతో ముడిపెట్టి యుద్ధతంత్రంలోకి దించిన వ్యక్తులే ఈ కార్యక్రమాన్ని కూడా వలస రాజ్యాల్ని పిండి పిప్పి చెయ్యడాని కొక తంత్రంగా మార్చి వేయగలరు.

ఒక వ్యక్తిభావనా ప్రపంచంలో పుట్టిందీ కార్యక్రమం. ప్రపంచపరివ్యాప్తంగా ఆర్థిక పరిణామం తేవాలనే ఆశతో అధ్యక్షుడీ కార్యక్రమాన్ని అద్భుత రాజనీతి అని తలపోస్తున్నాడు. కాని చివరకు తంత్రజ్ఞులీ కార్యక్రమాన్ని ప్రభుత్వఆర్థికసహాయం పొంది పరదేశాల పీడనకు యత్నింపగల అవకాశం ఉంది.

ఇటువంటి కార్యక్రమాన్ని అధ్యక్షుడు తలపెట్టడానికి అసలు ఆలంబన ఏదో కనిపెట్టడం కష్టంకాదు. 1942 లో హెన్రీవాలెస్ ప్రపంచ ప్రజాస్వాతంత్ర్య సాధనకు చేయవలసిన త్యాగం గురించి చేసిన ప్రసంగం ఒకటి మూలమని చెప్తే వింతగా ఉండవచ్చునుగాని ఇది నిజం. యుద్ధకాలంలో అగ్రరాజ్య నాయకులతో సమావేశాలకు అధ్యక్షుడు రూజ్‌వెల్టు ప్రయాణం చేస్తూ ఉత్తరాఫ్రికా ఎడారులమీదుగా వెడుతున్నప్పుడు అతనికి వలసదేశాల అభివృద్ధినిగురించిన అభిప్రాయాలు ట్రూమన్‌కి తెలుసును. అసలు వీని కన్నిటికీ మూలం చీనా రిపబ్లిక్ సంస్థాపకుడు సన్ యట్ సేన్ కార్యక్రమం. రిపబ్లిక్‌ను కొత్తగా స్థాపించిన రోజుల్లో దాన్ని అభివృద్ధి పరచడానికిగాను రోడ్లు, రైల్వేలు, టెలిఫోన్లు, ఓడరేవులు, ఓడలు, మొదలైనవి నిర్మించడానికీ, గనులు త్రవ్వడానికీ జపాన్‌నీ యూరోపియన్ దేశాలనీ డా॥ సన్ ఋణా లివ్వవలసిందని కోరాడు. ట్రూమన్ కార్యక్రమం రూపొందితే డా॥ సన్ యట్ సేన్ కోరిన రీతినే జరుగుతుందన్నమాట. అప్పుడు 1921 లో వాషింగ్టన్ సమావేశం ఆ ఋణాన్నివ్వలేదు. అప్పుడు చీనా రాజకీయతంత్రం విత్తనాలు చల్లుకుంది. ఆసియా దేశాలలో బలహీనులపక్షం వహించి, బలవంతుల నణచే కూట రాజకీయ తంత్రాలకు ఋణం బలైపోయింది. దాని కీనాడు ఫలితం కమ్యూనిజం తుపానులా పచ్చిపడింది

ఐక్యరాజ్య సమితియొక్క ఆహార, వ్యవసాయ సంస్థ (ఫుడ్ అండ్ ఎగ్రికల్చర్ ఆర్గనైజేషన్) సమితిలోని రాజ్యాలలో వ్యవసాయ సమస్యలను పరిశీలించడానికి నిపుణుల్ని పంపి పరిశోధన చేస్తోంది. ఈ విషయం ట్రూమన్ కార్యక్రమంలో కూడా ఉంది. ఇటీవల వెనెజులాలో నూనె ఉత్పత్తికి సంబంధించిన సమస్యలను ఒక నిపుణులవర్గం పరిశీలించింది. ఆర్థికంగా హీనస్థితిలో ఉన్న దేశాలలో ధనం పెట్టుబడి పెట్టే విషయమై ప్రపంచ బాంక్ అధ్యక్షుడు జాన్ జె. మెకోయ్ ఒక నివేదిక తయారు చేశాడు.

అమెరికా ఆంతరంగికశాఖ సహాయకార్యదర్శి ఆస్కార్ ఛాప్‌మన్ ఆధిపత్యం క్రింద ఒక నిపుణుల వర్గం దీర్ఘకాలిక ప్రణాళికలు తయారుచేసి ఉంచింది.

ఈ పూర్వసూచనలు కాక, ఈనాటి పరిస్థితులు కూడా ఇట్టి కార్యక్రమ ప్రతిపాదనకి ప్రబలకారణ మయినాయి. యుద్ధకాలంలో అమెరికన్ సైన్యదళాలు, యంత్రపరికరాలు ఈ వలస దేశాలగుండా ప్రయాణంచేశాయి. అప్పుడే ఈ ప్రజల దీనావస్థను చూసి వీరి స్థితిని బాగుపరచవలసిన అవసరం అందరికీ గోచరించింది. కీకారణ్యాలు, నిర్జన దేశాలు, కొండలు ఏవీ ఆధునిక యంత్ర పరికరాలకు దుర్గమం కాజాలవు. చిరకాలం దుర్గమంగా ఉన్న ప్రదేశాలు బర్మారోడ్డు, ఆల్కన్ హైవే, ఆఫ్రికా ఖండ విస్తృత కార్యక్రమాలు మొదలైన వానివలన సుగమమైనాయి. బుల్‌డోజర్లు, ట్రాక్టర్లు ఫసిఫిక్ దీవులను కొద్ది వారాలలో పునర్నిర్మాణం చెయ్యగలిగాయి. అనాదినుంచీ కూలీలే నీరు తోడి, కర్ర కోసిన ప్రదేశాలలో చిన్న చిన్న డైనమోలు మనుష్యుల పరిశ్రమను తగ్గించాయి.

అధ్యక్షుడు ట్రూమన్ ఈ కార్యక్రమాన్ని ప్రకటించినప్పుడు కావలసిన ధైర్యస్థైర్యాలు సాహసంచూపలేక పోయినాడు. వలసదేశాలలో పెట్టుబడి పెట్టి పూర్వ వలస విధానాన్ని అనుసరించడంలో గల సమస్యల్ని అతను గ్రహించినట్టు లేదు. ట్రూమన్ ఉపన్యాసం అంతా షరాలతో నిండిఉంది. ఈ క్రింది వాక్యాలు చూస్తే అది గ్రహించవచ్చును. "ప్రజాహితానికి విరుద్ధం కాని రీతినే, పెట్టుబడిదారులకు కూడా హామీలు ఇవ్వాలి. ఆదేశాల ప్రజల పరిశ్రమ కూడా ఈ పెట్టుబడికి తోడైనప్పుడే ఉభయత్రా మేలు కలుగుతుంది."

"ఇతరదేశాలుకూడా పెట్టుబడి పెట్టడానికి రాదలిస్తే రావచ్చును." ఈ ఉత్తమాశయాల్ని సాధించడానికి "వ్యాపారులు, దేశీయ పెట్టుబడిదారులు, కర్షకులు, కూలీలసహకారం అవసరం".

"పూర్వ సామ్రాజ్యతత్వానికీ, లాభార్జన కోసం ప్రజల్ని పీడించే విధానానికీ మా కార్యక్రమంలో తావులేదు."

అయితే ట్రూమన్ వాస్తవపరిస్థితుల్ని విస్మరించినట్టున్నాడు. లాభకాంక్ష అనేది సర్వే సర్వత్ర సమానమే ననీ, అది హద్దు మీరినప్పుడు వలసలు జయించాలనే ఆకాంక్షగా మారుతుందనీ, పాశ్చాత్యదేశాల చరిత్ర నిరూపిస్తోంది. లాభకాంక్షకోసమే కొలంబస్ సముద్రయానం చేసి అమెరికా ఖండాన్ని కనిపెట్టాడు. అమెరికన్ ఆయిల్ కంపెనీ ఇరాక్ పెట్రోలియం కంపెనీల వ్యవహారాలు చూస్తే పూర్వ తత్వాలేమీ మారలేదని స్పష్టపడుతుంది. ఈ కంపెనీలకీ ప్రభుత్వ కార్యదర్శి ఫారెస్టల్ అండ ఉంది.

న్యాయధర్మాలకు నిలిచేవారే మన మిత్రులు అని ప్రెసిడెంట్ ట్రూమన్ చెప్పాడు. కాని కాలిఫోర్నియానుంచి ఏప్రిల్ 9-వ తేదీని వచ్చిన వార్త చూస్తే వాస్తవపరిస్థితులు బోధపడతాయి.

"అరేబియాలో పెట్రోల్ సేకరణ నిమిత్తం అన్ని షరతులకూ అంగీకరించినందుకు గాను కువెత్ షేక్‌కు కృతజ్ఞతాపూర్వకంగా బంగారు కడ్డీలు అంచులుగా అమర్చిన 195 అడుగుల చిన్న నౌకను బహుమతి పంపుతున్నారు. ఆ నౌకను మిలియన్ డాలర్ల ఖర్చుతో కొత్త పరికరాలతో అమర్చి నిన్ననే పంపారు. దీనితో పాటు 26 అడుగులు పొడుగు మోటారులాంచీలు రెండింటినికూడా బంగారుకడ్డీలు అంచులుగా అమర్చి పంపనున్నారు.

వలస సేకరణకు జరిగే పోటీలో దురాశ ఎంతవరకూ పనిచేస్తుందో ఈ క్రింది వార్తనిబట్టి గూడా తెలుసుకోవచ్చును. జనవరి 7 వ తేదీని డరోతీ థాంప్సన్ వ్రాసిన వ్యాసంలో ఈ క్రింది విషయం ఉంది: "గత జనవరిలో ఇండోనీషియన్ రిపబ్లిక్ ప్రభుత్వానికీ, ఒక న్యూయార్క్ కంపెనీకీ మధ్య హవానాలో

(21 వ పేజీ చూడుడు)



గవర్నర్ జనరల్ రాజాజీతో బర్మాప్రధాని థాకిన్‌నూ.

నేటిప్రపంచం:

బ్రిటిష్ కామన్వెల్తుదేశాల మధ్య సంబంధబాంధవ్యాలు: ఐర్ తెగతెంపులు: ప్రధానుల సమావేశం

బ్రిటిష్ కామన్వెల్తు దేశాలలో బ్రిటిష్ చక్రవర్తి హోదాను గురించి నిర్ణయించడానికే ప్రస్తుత కామన్వెల్తు ప్రధానుల సమావేశం జరుగుతోందని చెప్పవచ్చును. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం బ్రిటిష్ సామ్రాజ్యం దాదాపు కూలిపోయిం దని చెప్పవచ్చును. ఉత్తరాఫ్రికా మలయాలలో తప్ప మిగతా దేశా లన్నిటిలో ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వాలు పరిపాలన చేస్తున్నాయి. ఐర్లండ్‌లో ఉత్తరాన అల్స్టర్ తప్ప మిగతా ప్రాంతమంతా 1921 లో డొమినియన్ వ్యవస్థ సాధించింది. ఈ వ్యవస్థ సాధించేముందు ఐరిష్ ప్రజలు కూడా చాలా ఇక్కట్లకు లోనైనారు. బ్రిటిష్‌కూట రాజనీతి ఐర్లండ్‌లోనూ, భారతదేశంలోనూ ఒకేరీతిగా నడిచింది. ఆరంభంలోనే అల్స్టర్‌లో స్కాట్లండునుంచీ, వేల్సునుంచీ ప్రజల్ని వలసకు పంపించి వారి జనాభా స్థానిక ప్రజలకంటె మించే విధంగాచేసి దేశాన్ని విభజించారు. నార్వేలో దేశద్రోహానికి దిగి దేశాన్ని అన్యుల కొప్పగించి ప్రపంచ ఖ్యాతి పొందిన "క్విస్లింగ్" పేరు సామెతలో ఎలా చేర్చిందో, బ్రిటిష్‌కూట రాజనీతికి అల్స్టర్ అనే పేరు సంకేతసూచకమయింది. మానవ సమాజం పట్ల రాజనీతిజ్ఞుల దౌర్జన్యానికి ఇవి సాంకేతిక పదాలై చిరస్థాయి అయినాయి. ఈ దౌర్జన్యాల్ని, అన్యాయాన్ని ఐరిష్ ప్రజలు, (బ్రిటిష్‌వారి లోక విధంగా వారు జ్ఞాతులు) ఎన్నటికీ మరిచిపోరు. అందువల్లనే డొమినియన్ ప్రతిపత్తి ఇచ్చినప్పటికీ పాకిస్థాన్, సింహళ, భారతదేశాలవలె కాక ఐరిష్‌ప్రజలు బ్రిటిష్‌వారిపై తీరని ద్వేషం పూనారు. దీనికి ఫలితమే ఇప్పటి వారి నిర్ణయం. ఈ నెల 17 వ తేదీతో ఐర్ (అల్స్టర్ మినహా ఐర్లండ్ ప్రాంతం) ప్రభుత్వం బ్రిటిష్ సామ్రాజ్యంతో గల తుదిబంధాన్ని త్రెంచివేసింది. ఇకనుంచి ఐర్‌లో ప్రభుత్వం రిపబ్లిక్ ప్రభుత్వం.

ద్వితీయ ప్రపంచ సంగ్రామాన్ని అవకాశంగా తీసుకుని బర్మా యువక నాయకులు ప్రజలను కూడదీసుకొని బ్రిటిష్ కూటనీతికి సమాధానంగా ఇటు బ్రిటిష్‌వారిపైనా, అటు జపాన్‌పైనా యుద్ధం సాగించారు. ప్రజల స్థితిగతుల్ని, మార్క్సిస్టు తత్వవాదులైన నాయకుల పట్టుదలనీ గ్రహించిన బ్రిటిష్ కార్మిక పక్షు ప్రభుత్వం బర్మాకు సర్వస్వాతంత్ర్య మిచ్చివేసింది. కాని అక్కడకూడా అంతఃకలహ బీజాలను నాటిపోయింది. బర్మా రిపబ్లిక్ వ్యవస్థను ప్రకటించుకుంది. భారతదేశంలో బ్రిటిష్ రాజనీతి చక్కగా పనిచేసింది. దేశాన్ని విభజన చేసింది. ఇప్పుడు పాకిస్తాన్ సింహళాలు కామన్వెల్తులోనే ఉండిపోగలవనీ, బ్రిటిష్ చక్రవర్తి సర్వంసహాధిపత్యాన్ని అంగీకరించగల వనీ తలొగ్గుతున్నాయి. ఇంక భారతదేశం ఒక్కటే కామన్వెల్తును విడిచిపెట్టడంలో చాలా చిక్కులున్నాయి.

అందువల్లనే భారతదేశం కామన్వెల్తు విడిచిపెట్టనూలేదు. కాంగ్రెస్ ఆశయమైన రిపబ్లిక్ వ్యవస్థా రావాలి. ఈ సమస్యను పరిష్కరించడానికే 21 వ తేదీనుంచి కామన్వెల్తు ప్రధానులు లండన్‌లో సమావేశమౌతున్నారు. పశ్చిమయూరప్ రాజ్యాలను కమ్యూనిస్టు ముప్పునుంచి రక్షించుకోడానికి అట్లాంటిక్ ఒడంబడిక చేసుకున్న ఆంగ్లో అమెరికన్ దేశాలు ఇప్పుడు ఆసియా దేశాలవైపు దృష్టి మరల్చాయి. భారతదేశాన్ని ఎలాగైనా కామన్వెల్తులో ఉంచాలని బ్రిటన్ అనేకవిధాల యత్నిస్తోంది.

భారతదేశం రిపబ్లిక్ అయినంతమాత్రాన, బ్రిటిష్‌చక్రవర్తికి శిరస్సొగ్గనంతమాత్రాన కామన్వెల్తులో నుంచి విడిపోవలసిన అగత్యంలేదనీ, ఏదోరీతిని ఉండగల విధానం కనిపెట్టడం అసాధ్యం కాదనీ పండిట్ నెహ్రూ చెప్పారు. కాని ఈ పద్ధతి కొన్ని డొమినియన్లకు నచ్చడంలేదు. అయినప్పటికీ పరిస్థితులకు తలొగ్గి ఏదో రీతిని సమాధానం కుదుర్చుకోవాలని బ్రిటన్ చూస్తోంది.

భారతదేశం రిపబ్లిక్ అయికూడా కామన్వెల్తులో ఉండడానికి ఏదో ఒక పద్ధతి కనిపెట్టగలిగితే, దానికి బ్రిటిష్‌ప్రభుత్వం, ఇతర డొమినియన్లూ అంగీకరిస్తే, ఆ పద్ధతిపైనే బర్మాను కూడా కామన్వెల్తులో ఉండవలసిందని బ్రిటిష్ ప్రభుత్వం కోరగల అవకాశం ఉంది. బ్రిటిష్ ప్రభుత్వ ఆర్థికసహాయం కావలసిన బర్మా, ఈ ఆహ్వానాన్ని నిరాకరించడానికి కొంత ముందు వెనకలాలోచించవలసి ఉంటుందికూడా. భారతదేశం బర్మాల మైత్రిద్వారా ఈ ప్రాంతాన్ని కూడా కమ్యూనిస్టు ముప్పునుంచి కాపాడ్డానికి వీలుంటుంది. ఆసియా దేశాలపైనే ముడిపదార్థలకీ పెట్టుబడి తతంగానికీ యూరోపియన్ దేశాలన్నీ ఆధారపడాలి. ఆసియాలో వారి పెట్టుబడికీ, వారి నిపుణులకీ ఆస్కారం లేకపోతే, చౌక కూలీతో తమ పెట్టుబడితనాన్ని వృద్ధిపరచుకోడానికి వీల్లేకపోతే యూరప్‌లోనూ, అమెరికాలోనూకూడా నిరుద్యోగం దుర్భరంగా పెరిగిపోగలదు. వారి పెట్టుబడిధనం గుడ్డిగవ్వ విలువ చెయ్యదు. అందువల్లనే బ్రిటిష్ అమెరికాలు ఇంత తాపత్రయ పడుతున్నాయి. యూరప్‌లోకంటె జీవనప్రమాణం అమెరికాలో హెచ్చుగా ఉన్నందువల్ల అమెరికన్లు యూరప్‌లో పెట్టుబడి పెట్టితేకూడా లాభాలు వస్తాయి. యూరోపియన్ దేశాల్లోని పెట్టుబడిదారులు తమకంటె హీనస్థితిలో ఉన్న దేశాలు వెతుక్కోవాలి. మార్షల్ ప్రణాళికద్వారా అమెరికా తనబాధను కొంత నివారించుకుంది. ఇంక బ్రిటన్ మొదలైన దేశాలు పోగా మిగిలిన వలసల్ని నయానా భయానా పట్టుకుని వేలాడుతున్నాయి.

బర్మా ప్రధాని

బర్మా ప్రధాని థాకిన్‌నూ ఈవారం ఢిల్లీ, కరాచీ సందర్శించాడు. బర్మాలో విప్లవాన్ని అణచడానికి బ్రిటిష్ వారి ఆర్థిక సహాయం పొందడానికీ, ఆయుధ పరికరాలు తెచ్చుకోడానికీ ఇదివరలో చేసిన యత్నం విఘ్నమయినందువలన తిరిగి ప్రయత్నం చెయ్యడానికి, ఈమారు భారతదేశం, పాకీస్తానుల ద్వారా బ్రిటన్‌పై ఒత్తిడి తేవడానికీ థాకిన్‌నూ యత్నిస్తున్నాడు. బర్మాలో ప్రభుత్వానికి అంగబలం ఉంది. కాని రవాణా సౌకర్యాలు, ఆయుధాలు లోపం. వీనికోసమైనా బర్మా ఎవరినీ ముష్టెత్త నక్కరలేదు. బియ్యం అమ్ముకుంటే అన్నీ కొనుక్కోవచ్చును.

ఇంతవరకూ బర్మానుంచి బియ్యం ఎగుమతి అంతా బ్రిటిషు పెట్టుబడిదారుల గుత్త. కల్లోల పరిస్థితులమూలంగానూ, కొంత బ్రిటిష్‌పెట్టుబడిదారుల కుతంత్రంవల్లనూ ఎగుమతులు నిలిచిపోయాయి. బర్మా ప్రధాని థాకిన్‌నూ ఈవిషయాలనుగురించి పండిట్ నెహ్రూతోనూ, పాకిస్తాన్ ప్రధాని లియాఖత్ ఆలీ ఖాన్‌తోనూ సంప్రతించారు. తాను కోరినదంతా లభించిందని థాకిన్‌నూ స్వదేశం తిరిగిపోతూ చెప్పాడు.

చీనా శాంతిసమాలోచనలు

చీనాలో కమ్యూనిస్టు జాతీయ ప్రభుత్వాల మధ్య సమాలోచనలు పీపింగ్‌లో 11 దినాలు జరిగాయి. ఒక రాయబారి కమ్యూనిస్టుల షరతులు తెలపడానికి నాన్కింగ్ వెళ్లాడు. అయితే శాంతి సమాలోచనలు జరుగుతుండగానే, యాంగ్సీనదీతీరాన యుద్ధం సాగుతూనేవుంది.

ఒక వంతెనవద్ద యుద్ధం జరిగి అది రెండుమార్లు చేతులు మారింది. శాంతిసమాలోచనల్లో ప్రతిష్టంభన ఏర్పడే సూచనలుకూడా కనపడుతున్నాయి. కమ్యూనిస్టు సేనల్ని యాంగ్సీనది దాటిపోనివ్వాలని కమ్యూనిస్టు లొక షరతు పెట్టారు. ఆ షరతుకి నాంకింగ్ ప్రభుత్వం అంగీకరించడంలేదు. ఈ షరతుకి అంగీకరిస్తే ఉభయులమధ్యా జరిగేది సంధి కాజాలదు. ఒకరు పూర్తిగా లొంగిపోవడంకిందికే వస్తుంది. కమ్యూనిస్టు లీ రీతిగా అడగడానికి కూడా కారణం ఉంది. దక్షిణచీనాలో కాంటన్ రాజధానిగా జాతీయప్రభుత్వం తన స్థావరాల్ని బలపరుచుకొని ఆ ప్రాంతాలకు కమ్యూనిస్టులు రాకుండా చెయ్యడానికి రహస్యంగా యత్నిస్తున్నారనీ, ఒకవేళ నాంకింగ్ ప్రభుత్వం సంధి కంగీకరించినా చాంగ్ కై షేక్ అనుచరులు దక్షిణాన ఈ సంధి కంగీకరించక విడిగా పోరాడతారనీ కమ్యూనిస్టులు అనుమానిస్తున్నారు. కొందరు చీనాలో ఇంకా అమెరికా సహాయం పొంది యుద్ధం కొనసాగించడానికి యత్నిస్తున్నట్లు అమెరికన్ పత్రికలు ఇటీవల వార్తలు ప్రచురించాయి. అందువల్లనే అమెరికా ఇంకెంతమాత్రం చీనాజాతీయ ప్రభుత్వానికి ఆర్థికసైనిక సహాయా లివ్వబోదని విదేశాంగ కార్యాలయం ప్రకటించవలసి వచ్చింది. అమెరికానుంచి ఇంకా ఏదో సహాయం రాగలదనే ఆశ జాతీయప్రభుత్వాని కున్నందువల్లనే ఇంతవరకూ కమ్యూనిస్టులతో సమాధానం కుదరలేదనే అనుమానంతో అమెరికన్ ప్రభుత్వం అటువంటి ప్రకటన చేసింది. ఇప్పుడింక సంధి కాటంకాలు ఒక్కటి మినహా ఏమీ లేవు. యుద్ధనేరస్థుల విచారణ విషయంలో కూడా కమ్యూనిస్టులు అంతగా పట్టుబట్టరనీ, మిగతా షరతులన్నిటికీ జాతీయవాదు లంగీకరిస్తే కమ్యూనిస్టులు ఈ షరతును సవరణచెయ్యగలరనీ తెలుస్తోంది. అందువల్ల అదికూడా అంత పెద్ద ప్రతిబంధకం కాదు.

యాంగ్సీనదిని దాటనివ్వాలని కమ్యూనిస్టులు కోరడం ఒక్కటే ముఖ్యప్రతిబంధకంగా కనపడుతుంది. మొత్తానికి ఈ సంప్రదింపుల సారాంశం ఏమిటంటే, జాతీయవాదులు తమ ఓటమిని అంగీకరించి, కమ్యూనిస్టుల ఆధ్వర్యం కింద మిశ్రపక్షప్రభుత్వం ఒకటి స్థాపించడానికీ, కమ్యూనిస్టులు ప్రతిపాదించే భూమిశిస్తు, వ్యవసాయాది సంస్కరణలు ప్రవేశపెట్టడానికీ అంగీకరించాలి. జాతీయవాదులు ఎంతవరకూ ఓటమి నంగీకరించగల రనేది ఇప్పుడు చూడవలసి ఉంది. నాంకింగ్ ప్రభుత్వం అంగీకరించినా దక్షిణచీనాలో కొందరు అంగీకరించకుండా యుద్ధం కొనసాగించే పక్షంలో కమ్యూనిస్టులు అందుకు సంసిద్ధంగా ఉండాలి. ఈపోరాటంలో నాంకింగ్ ప్రభుత్వం కమ్యూనిస్టులతో సహకరిస్తుందో లేదో ఈ విషయమైకూడా సమాధానం కుదరవలసి ఉంది. చీనాభవిష్యత్తు దీనిపైనే ఆధారపడి ఉంది.

ఇండొనీషియా

ఇండొనీషియాలో రిపబ్లిక్ ప్రభుత్వం పునస్థాపనగురించి ఐక్యరాజ్యసమితి కమిషన్ ఆధ్వర్యంక్రింద ఉభయపక్షాలకీ మధ్య బటేవియాలో తిరిగి సంప్రదింపు లారంభమైనాయి. పండిట్ నెహ్రూ ఢిల్లీలో ఆసియా ప్రభుత్వాల రాయబారు లందరినీ సమావేశపరిచి పరిస్థితిని చర్చించారు. అమెరికా కెనడాలు మినహా అట్లాంటిక్ ఒడంబడికదేశాలన్నీ ఇండొనీషియా సమస్య ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశంలో చర్చకు రాకుండా చెయ్యాలని యత్నించాయి. భారతదేశం, ఆస్ట్రేలియాలు పట్టుబట్టి చర్చాకార్యక్రమంలో చేర్పించాయి. ఈ చర్చవల్ల బటేవియా సంప్రదింపులు భగ్నమౌతాయని నార్వే మొదలైన దేశాల ప్రతినిధులు హెచ్చరించినా, ఆ సంప్రదింపుల మూల్యం తెలిసిన ఆసియా దేశాలు ఆవాదాన్ని త్రోసిపుచ్చాయి. ఐక్యరాజ్యసమితి చర్చలో ఆసియా దేశాలన్నీ ఒక్కమాటపై నిలువగలవనీ, జనవరిలో ఢిల్లీ సమావేశతీర్మానం ప్రకారం వర్తించగలవనీ స్పష్టమయింది.

ఇండొనీషియాలో యుద్ధానికి వినియోగించరనే హామీ తీసుకొని గాని హాలండుకి మార్షల్ ప్రణాళిక, అట్లాంటిక్ ఒడంబడికల ననుసరించిన ఆర్థికసైనిక ఆయుధసామగ్రి సహాయా లివ్వరాదని అమెరికన్ కాంగ్రెస్ ఒక షరతుపెట్టింది. ఈషరతుకి అంగీకరించకున్నట్లు డచ్చిప్రభుత్వం తెలిపింది. కాని ఇదివరలో అనుభవాన్నిబట్టి ఈ వాగ్దానం విశ్వసించదగినది కాదు.

బాల్కన్ దేశాలు

అట్లాంటిక్ ఒడంబడిక అంగీకరించబడినది మొదలు బాల్కన్ దేశాల్లో పరిస్థితులు మారుతూ వచ్చాయి. పరిస్థితు లెంత సుముఖంగా ఉన్నా అమెరికన్ మిలిటరీ సహాయంవల్ల గ్రీస్‌లో కమ్యూనిస్టులు పూర్తిగా జయం పొందలేకపోయినారు. బల్గేరియా, యుగోస్లావియాలలోని కొన్ని ప్రాంతాలను గ్రీస్‌లో కమ్యూనిస్టు అధీనంలో ఉన్న ప్రాంతంలో చేర్చి, మాసిడోనియా అనే కొత్తరాజ్యాన్ని స్థాపించడానికీ, అక్కడ బల్గేరియన్ కమ్యూనిస్టుల ఆధ్వర్యంక్రింద కమ్యూనిస్టు ప్రభుత్వం స్థాపించడానికీ రష్యా యత్నిస్తోందని వదంతులు ప్రబలుతున్నాయి. ఈ రీతిగాచేస్తే రష్యాకు మధ్యధరా సముద్రంలోకి ప్రవేశం కలుగుతుంది. దీనివల్ల రష్యా ఇంక డార్డెనల్స్‌కోసం టర్కీతో ఇప్పుడిప్పుడే విరోధం తెచ్చుకోనక్కరలేదు. అట్లాంటిక్ ఒడంబడిక దేశాలపైన దురాక్రమణ జరుపనక్కరలేకుండానే మధ్యధరాసముద్రంలో స్థావరం ఏర్పరుచుకోవచ్చును.

బల్గేరియా ప్రధాని అయిన జార్జి డిమిట్రావ్ ప్రధానిపదవినుంచి నిష్క్రమించాడు.

అనారోగ్యం కారణమని చెప్తున్నారు. కా[ని] అది నమ్మనక్కరలేదు. టిటో, డిమిట్రావ్[ల] మధ్య విరోధాల కిది ఫలితమైనా కావచ్చును లేదా ఈ రోజుల్లో కమ్యూనిస్టు నాయకత్వంలో జరుగుతున్న మార్పుల్లో ఇదొకటి కావచ్చు. అ[దీ] కాకపోతే బాల్కన్ రాజకీయాల్లో ప్రధా[న] కార్యాస్నేదైనా నిరసించడానికి అతను నియమింపబడి ఉండవచ్చును. డిమిట్రావ్ మొన్న మొన్నటివరకూ అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థలో స్టాలిన్‌కు విశ్వాసపాత్రుడుగ ఉన్నాడు.

వీటో నిర్బంధానికి వీటో

ఐక్యరాజ్యసమితిలో అగ్రరాజ్యా లయిదు (అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చీనా) అయిదుగురికీ అంగీకారయోగ్యమైన సంస్థగ ఉంటేనే నడుస్తుంది కాని లేకుంటే ముం[...] పడుకుంటుంది కాబట్టి, ఈ అయిదుగురిలో [...] ఒక్కరికి అనిష్టమైనా అటువంటి విషయమై సమితి ఏనిర్ణయం చెయ్యరాదని నిర్ణయించారు ఏవిషయంపైనైనా ఈఅయిదుగురిలో ఏఒక్కరి ఆక్షేపణ ఉన్నప్పటికీ, వారు చెయ్యొత్తారంటే చాలు, ఇంక ఆ విషయమై విరుద్ధనిర్ణయం ఏమి[...] జరగదన్న మాట. ఈ పద్ధతినే వీటో అన్నారు. రష్యా ఇంతవరకు 30 సార్లు వీటో ప్రయోగించింది. అంతర్జాతీ[య] రాజకీయాల్లో నలుగురికీ సమ్మతమైన దారి పోడానికి రష్యా నిరాకరిస్తోం దని దీన్ని బ[...] అమెరికన్లు అన్నారు. అమెరికా వీటోని తరుచ[ు] ప్రయోగించకపోయినా, మార్షల్ ప్రణాళి[క] అనీ, వర్తకవ్యాపారాలనీ, ఋణాలనీ ఇచ్చి నాలుగుదేశాల్ని కూడగట్టుకుని వోట్ల ఆధిక్య[ం] వల్ల పరోక్షంగా తన వీటో ప్రయోగిస్తోం ద[ని] రష్యా నిందించింది. మొత్తానికి ఐక్యరాజ[్య] సమితిగాని, భద్రతామండలిగాని ఇన్నాళ్ల[ూ] చేసిన కార్య మేమీ లేకపోయిం దని ఆసియ[ా] రాజ్యా లనుకున్నాయి. కారణం అ[గ్ర] రాజ్యాలు నిత్యం తమ గొడవే గాని ఇతరు[ల] గొడవ పట్టించుకోవు.

అందుకని రష్యాని ఎల్లాగైనా వీటో ప్రయో[] గించకుండా కట్టేసి, తమ ఆజ్ఞలు పాలించే[టట్లు] చెయ్యాలనే ఉద్దేశంతో, అతిముఖ్యవిషయ[ా]ల్లోనూ, అయిదుగురికీ మధ్య వివాదం కలిగిం[చే] విషయాల్లోనూ తప్ప వీటో ప్రయోగించరా[దు] అని ఒక తీర్మానాన్ని రష్యామినహా మిగ[...]

(20 వ పేజీ చూడుడు)

ఉస్మానియా విద్యాశాఖపాలన

[మా ప్రత్యేక విలేఖరి]

విద్య, జాతీయాభివృద్ధికార్యక్రమములలో చాలా ముఖ్యమైనది. దానికొరకై ప్రత్యేకింపబడు ధనము చాలా పెద్ద మొత్తములో నుండును. ఆ ధనముతో ఉస్మానియా విద్యాశాఖ నడపిన దుష్కార్య క్రమముల ఫలితముగా, నేడు సంస్థానమునకు సంక్రమించిన తెగుళ్లు అనేకములు. విద్య, విద్యాశాఖ పాలన-రెండును మతవిద్వేషములను పురికొల్పి, మహమ్మదీయేతరులను తలెత్తకుండగా జేయుటకై ఉద్దేశింపబడినవి. సంస్థానంలో నూటికి 88 మందికి మాతృభాష ఉర్దు కాదు. కాని విద్యాశాఖలో మాత్రము నూటికి 88 మంది ఉర్దు తప్ప ఇతర భాషలు రానివారు. ఇతర భాషలను నీచముగా చూచువారు. పాఠ్యగ్రంథములన్నియు ఇస్లాం మతదృష్టితో మాత్రమే గాక, తీవ్రవిద్వేషముతో వ్రాయబడినవి. చరిత్ర, "మఘవశ్రీవారి"కి అనుకూలముగా మార్చివేయబడి, మహమ్మదీయుల ఘనతనుగూర్చి వివరించు కథయైపోయినది. ఇది అంతయు ఉర్దులో బోధింపబడును. కొద్దిలో చెప్పవలెననగా, చదువంతయు, ఇస్లాం ప్రచారమునకేగాక, అన్యమతములను నాశనము చేయుటకే ఉద్దేశింపబడినది.

విద్యాశాఖ పాలకులు:

ఇట్టి విద్యాశాఖపాలనకై, ఎట్టి మహనీయులు నియమింపబడుదురో వేరుగా చెప్పనక్కరలేదు. ఈ అధికారులందరునూ, విద్యాశాఖాధికారులుగాన సంపూర్ణ విద్యావంతులైననూ పరిస్థితి ఇంత అధ్వాన్నమయ్యెడిది కాదు. ఒక నెల ఇందటి వరకు పనిలోనున్న ఒక డిప్యూటీ డైరెక్టరుగారి చదువు మెట్రిక్ (అలహాబాద్). ప్రస్తుతము సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డులో నున్న ఒక ప్రధాన ఉద్యోగియొక్క డిగ్రీ మరీ వింతయైనది. అది - బి. సి. ఒ. యం.—ట! ఆ డిగ్రీని వ్రాసుకొనుటలో ఈ అధికారి, 'బి' ని పెద్ద అక్షరముగా వ్రాసి, 'సి' ని పెద్ద అక్షరముగా వ్రాసి "ఒ", "యం" లను చిన్న అక్షరములుగా వ్రాసివేయును. అది "బి. కాం" అని చూచువార లనుకొనెదరు; కాని, వాస్తవమున కది, "మెట్రిక్ (అలహాబాదు)" తుల్యమే! ఇవిగాక గవర్నమెంటుచే తెగ పోషింపబడుచున్న నిజామియా విశ్వవిద్యాలయమను నొక ఉర్దూ డిగ్రీలను ఇచ్చు సంస్థ కలదు. ఇందులో డిగ్రీని పుచ్చుకొనిన వ్యక్తి, ఎంత మహోద్యోగమునకైననూ అర్హుడే. కీరుగాక, విదేశపు డిగ్రీలను పుచ్చుకొనిన పెద్దలు, విశ్వవిద్యాలయ ఉపాధ్యాయునివద్దనుంచి తండోపతండములుగా నున్నారు. ఇందులో సగముమంది "ఎక్రొటాక్" డిగ్రీలను పొందినవారు. అనగా పుస్తకములను పుచ్చుకొని కళాశాలకు పోకుండగా, పరీక్షకు పోకుండగా, ఇంత దూరదేశము నుంచి పోయి చదువును వెలగబెట్టినందులకు ఫలితముగా, ఒక డిగ్రీని అల్లించి, బెల్లించి సంపాదించుకొన్నచో - అది "ఎక్రొటాక్" డిగ్రీ అగును. లేక "నాల్గవ తరగతి" డిగ్రీ అనినను తప్పులేదు. అయితే, కొన్ని విదేశీ విశ్వ విద్యాలయపు డిగ్రీలలో నాల్గవతరగతి కూడా యున్నది. ఆ విశ్వవిద్యాలయము లిచ్చిన "ఎక్రొటాక్" డిగ్రీ, ఐదవతరగతి డిగ్రీ అగును. కాని దేశీయవిశ్వవిద్యాలయములలో సంపాదించిన మొదటితరగతి డిగ్రీ కంటె, "ఎక్రొటాక్" కే, ఉస్మానియా విద్యాశాఖలో విలువ ఎక్కువ. అయితే అలీఘర్ డిగ్రీలు వేరు. అవి ఉస్మానియా దేశభక్తికి సంబంధించిన డిగ్రీలు. అలీఘర్ సంస్కృతపు ఎం. ఏ. మద్రాసు సంస్కృతపు ఎం. ఏ. కంటె, ఎన్నియో రెట్లు ఎక్కువ!

ఉస్మానియా విశ్వవిద్యాలయములో హిందూ విద్యార్థి ఎంత తెలివితేటలు కలిగినప్పటికిని ఒక్కొక్కప్పుడు పరీక్షలలో నెగ్గకుండుట మామూలు. ఒక నిర్ణీతపు లెక్కప్రకారము మాత్రమే హిందూవిద్యార్థులు ప్యాసు కాగలుగుదురు. కాబట్టి ఉద్యోగములకు అమాంతముగా దొరకువారు ముస్లిములే అగుదురుకదా. ఏమైనప్పటికిని, చిన్నచిన్న ఉద్యోగములలో పడియున్న అనేకులు—పెద్దపెద్ద చదువులు చదివిన హిందువులు కలరు. వారికి ఇన్నాళ్లనుంచి జరిగిన అన్యాయమును, కేవలము మతదృష్ట్యా కాక, యోగ్యతదృష్ట్యాకూడా విచారించి న్యాయమును కల్గింపవచ్చును.

ఉద్యోగములు - మతతత్వములు:

నేడు విద్యాశాఖలో-విశ్వవిద్యాలయమును మినహాయించి-ఉన్న 121 మంది గెజెటెడ్ ఆఫీసర్లలో 24 మంది హిందువులు. ఇందులో నల్గురే ఆంధ్రులు. ఇందులో ఒక్క హిందూ అధికారికికూడా ముఖ్యస్థాన మేదియును లేదు. పోనీ, ఉన్న ముస్లిం అధికారులైననూ, కాలానుసరణమైన మార్పులను సూచించు విశాలహృదయులు కారు. ఉన్న ఐదుగురు డివిజనల్ ఇన్‌స్పెక్టర్లు ముస్లిములే. 16 గురు జిల్లా ఇన్‌స్పెక్టర్లలో ఒక్కడే హిందువు. విద్యాశాఖ డైరెక్టరుఆఫీసులోనున్న 119 మంది నాన్‌గెజెటెడ్ ఉద్యోగులలో 15 మంది మాత్రమే హిందువులు. బంట్రోతులు కూడా దాదాపు అందరునూ ముస్లిములే. హైస్కూళ్లతో కలసిఉన్న కాలేజీలు 5 ఉన్నవి. వాని ప్రిన్సిపాళ్లు, గెజెటెడ్ హోదా కలిగిఉన్న అధ్యాపకులు, ఒక్కరిద్దరు మినహాగా అందరునూ ముస్లిములే హైస్కూళ్లు, మిడిల్‌స్కూళ్లు, ప్రైమరీస్కూళ్ల హెడ్‌మాస్టర్లలో నూటికి 80 మంది మహమ్మదీయులే. ఈ ముస్లిములలో ఒక్కరికి కూడా స్థానిక భాష లేవియును రావు.

తమాషా ఏమనగా - నిమ్న జాతులకని ప్రత్యేక పాఠశాలలను పెట్టిరి. అందులో ఉపాధ్యాయులు ఎక్కువమంది మహమ్మదీయులే! ఈ నిమ్నజాతి స్కూళ్లలో, ముస్లిం మతబోధ, ముస్లిం మతములోనికి చేర్చుకొనుట తప్ప, వేరేమియు జరుగలేదు. నిమ్నజాతుల స్కూళ్లకై ప్రత్యేక ఇన్‌స్పెక్టరున్నాడు. కాని ఆయనకీ స్కూళ్ల పాలనతో సంబంధము లేదు. నిమ్న జాతులకు కావలసిన సౌకర్యములను గురించి ఆయనను అడిగినదీ లేదు.

ఇవిగాక సైన్సుఇన్‌స్పెక్టరు, డ్రాయింగు చేతిపనుల ఇన్‌స్పెక్టరు, వయోజన విద్యా ఇన్‌స్పెక్టరు కూడా కలరు. ప్రపంచములో తమాషాకు చెప్పుకొని, నమ్మలేక నవ్వుకొనదగిన విషయములు సంఘటనలు ఎన్నియో ఈ విద్యాశాఖలో జరిగినవి. నేడా వింతలు జరుగకున్నను అజాగళస్తనములవలె, ఈ ఉపశాఖలు మాత్రము మిగిలినవి. ఈ ప్రత్యేక ఇన్‌స్పెక్టర్ల ఉనికివలన అభివృద్ధి లేశమాత్రమును కనపడదు. నల్గురు ముస్లిములకు ఉద్యోగములు లభించుట తప్ప, ప్రజలకు జరిగిన మేలు శూన్యము. వయోజనవిద్యాప్రచార మని పేరు చెప్పి రజాకారు ప్రచారము జరిగెను. ఒకవేళ ఈ వయోజన విద్యా ఇన్‌స్పెక్టరు హిందువుడైనను, అతడీ ప్రచారము నరికట్టగలడా!

కాని పాపము—ఐదు ట్రైనింగ్ స్కూళ్ల సూపరింటెండెంట్లను మాత్రము స్థానికభాషలను తెలసినవారినే నియమించిరి. ఉపాధ్యాయులకు స్థానికభాషలలో ట్రైనింగ్ నిచ్చుటకు, సూపరింటెండెంట్లకు ఆ భాషలు రావలె నను నియమములేదే! ఆ పనిని, ఉర్దూమతస్థు డెవ్వడైననూ చేయగలడని అప్పటి ప్రభుత్వమునకు తోచలేదు కాబోలు! అయితే ఇంటర్మీడియేట్ ట్రైనింగ్ కాలేజీలో ఎవ్వరికిని స్థానిక భాషలు రావు!

హోదాలు-సరదాలు:

ఇక హైస్కూళ్లను కాలేజీలుగా పెంచి, ఆ హెడ్‌మాస్టర్లకే విశ్వవిద్యాలయమువారు కొంత అదనపు జీతము నిచ్చి, ప్రిన్సిపాల్ పదవిని కట్టబెట్టుట, ఉస్మానియా విద్యాశాఖపాలనలో ప్రత్యేకత. ఇట్టి ప్రిన్సిపాల్ పదవిని చేజిక్కించుకున్నవానికి, అదనపు జీతముతో పాటు, అంతయూ విశ్రాంతియే. దాదాపు పింఛనుదారుడగును. కాలేజీతరగతులకు బోధించలేడు. ప్రిన్సిపాలు కాన హైస్కూలు తరగతులకు బోధించడు. చివరకు సామాన్యపు హైస్కూళ్లలో కూడా, హెడ్‌మాస్టరుగారి పనులన్నియు చేసిపెట్టుటకొక సహోపాధ్యాయుడుండును. ఇతడు సాధారణముగా హిందువై యుండును. అధికారము ప్రధానోపాధ్యాయునిది. చాకిరి సహోపాధ్యాయునిది. పైగా ఈ సంస్థానములో అనేకమంది హెడ్‌మాస్టర్లను ప్రిన్సిపాళ్లని పిలువవలసినదే! ఇది ఒక సరదాహోదా! ఏమైనప్పటికిని ఈ స్కూళ్లలో పనిచేయు మహమ్మదీయేతర ఉపాధ్యాయుల కష్టములను వారి నోటినుంచి వినవలసినదేగాని, వ్రాయుట సాధ్యముకాదు. ప్రస్తుతము వారి దాస్యస్థితి కొంతవరకు వదలినట్లు కనపడుచున్నది. కాని ఇతర ఉస్మానియా లాంఛనములు మర్యాదలు మాత్రము మారలేదు. స్కూళ్లలో ఇంకనూ బీరారుతో కలసిఉన్న నైజాంరాజ్య పటములు, ఉస్మానియా సలాములు మిగిలియే యున్నవి. ఎంతయో కాలమునుంచి, జీతముకాని హోదాగాని పెరుగక పడియున్న మహమ్మదీయేతర ఉపాధ్యాయు లనేకు లున్నారు. ప్రస్తుతము వారివారి సేవా కాలపరిమితినిబట్టి హోదాలను, జీతములను నిర్ణయించుట న్యాయముగా నుండగలదు. అదీ గాక, స్థానిక భాషాజ్ఞానము కలవారినే స్కూళ్లలో బోధింపనిచ్చినచో, అనేకులు జిల్లాలు వదలి హైద్రాబాదు నగరమును చేరుకొందురు - లేక ఆ భాషలను నేర్చుకొనెదరు.

కాని విద్యాశాఖలో అనేకులు ఘరానా ఉద్యోగులు, ప్రభుత్వ ధనసహాయముతో విదేశముల కేగి చదివిరి; చదువుచున్నారు. వీరికెవ్వరికిని స్థానికభాషలు రావుకదా. వారి నేమి చేయవలెను? అధమము వారిచేత ఏదో చేతిపని అయినను చేయించి ఆ అప్పు తీర్చుకొనవలెను. అయితే ఇంతకుముందు అప్పులు తీసికొని విదేశపు చదువులను వెలగబెట్టినవారందరునూ తదుపరి ఏ నవాబు బిడ్డనో పెండ్లాడి, పలుకుబడి సంపాదించి ఆ అప్పును కొట్టివేయించుకొనిరి. డబ్బుపోయిన పోనివ్వవచ్చును. కాని, వీరందరును పెట్టి విద్యావిధానమును నాశనము చేయుట భావ్యముకాదు.

ప్రజాధనము — దుర్వ్యయము

ప్రజాధనమును నాశనముచేయు కార్యక్రమములు అనేకము లున్నవి. హైద్రాబాదులో మహబూబియా గరల్స్ హైస్కూలని ఒకటి ఉన్నది. అందు ఇతరఉపాధ్యాయినుల మాట అటుంచి, గెజెటెడ్ ఆఫీసర్లు పద్నాలుగుమంది! ఒక్క హైస్కూలులో 14 గురు గెజెటెడ్ ఆఫీసర్లు! మజీదియా గరల్స్ హైస్కూలులో ముగ్గురు గెజెటెడ్ ఆఫీసర్లు! మద్రాసా - ఎ - ఆలియా బాలుర హైస్కూలులో 6 గురు గెజెటెడ్ ఆఫీసర్లు! జాగీర్దార్స్ కాలేజీ—ఇది కాలేజీ కాదు ఇందులో 8 మంది గెజెటెడ్ ఆఫీసర్లు! నాంపల్లి గరల్స్ హైస్కూలులో ముగ్గురు గెజెటెడ్ ఆఫీసర్లు! వీరందరునూ స్థానిక భాషలురాని మహమ్మదీయులే. ఈ స్కూళ్లన్నింటిలోనూ ఉర్దూయే బోధనాభాష. ఇవిగాక ఉస్మానియా కళాశాలల ప్రిన్సిపాళ్లందరునూ, పెద్దపెద్ద జీతములు పుచ్చుకొను గెజెటెడ్ ఆఫీసర్లే. ఈ జీతాలన్నీ రెండువేల పైపైవి. చూడండి. ఆర్ట్సు కాలేజి, సైన్సు కాలేజి, టెక్నలాజికల్ కాలేజ, ఇంజనీరింగ్ కాలేజి, లా కాలేజి, మెడికల్ కాలేజి, వెటర్నరీ కాలేజి, స్త్రీ కాలేజి, సిటీకాలేజి, నిజాం కాలేజి. ఇవిగాక శాస్త్రపరిశోధన శాఖా డైరెక్టరు - అనువాదశాఖా డైరెక్టరు కూడా ఉన్నారు. ఇంకా పైన రిజిస్ట్రారు, ఉపాధ్యక్షుడు ఉన్నారుకదా. వీటన్నింటిలో ఒక్క సిటీకాలేజీ ప్రిన్సిపాల్ పదవికి, రిజిస్ట్రార్ పదవికి, ఈమధ్యనే ప్రప్రథమంగా హిందువుల్ని నియమించారు. అంతమాత్రంలో పరిపాలనలో మార్పులు కలగక పోవచ్చు. కాని శాస్త్ర పరిశోధనపైన, అనువాదములపైన (అందెనదాని నల్లా ఉర్దులోకి అనువాదము చేయుటయే) కొన్ని లక్షలు - లేక కోట్లా!—ఖర్చయినవి. ఫలితం శూన్యం!

ఈ విధముగా డబ్బును దుర్వినియోగము చేయుటకు "మఘవశ్రీవారి" ప్రభుత్వమునకు ఇంకనూ అనేకమార్గములు దొరకినవి. ఒకఊరిలో ఒక హైస్కూలు ఉన్నదనుకొనుడు. దానిని "మఘవ" ప్రభుత్వము మూడు స్కూళ్లుగా చీల్చినది. హైస్కూలు - మిడిల్ స్కూలు - ప్రైమరిస్కూలు. ఆ ఊరిలో మూడు స్కూళ్లు! ఏమి "మఘవ!" వీటికి ప్రత్యేక ప్రత్యేకపు ప్రధానోపాధ్యాయులు! బయటి ప్రపంచమునకు - మా కిన్ని స్కూళ్లున్నవి-అని చెప్పుటకు ఇది మహోఘనత వహించిన ఎత్తు! ప్రస్తుతము వీటి నన్నింటిని కలిపివేసి, ప్రత్యేకపు ఖర్చులను, అదనపుఖర్చులను తగ్గించివేయుట అవసరము. ఈలోగా ఎవరైననూ ఉదారహృదయులు స్కూళ్లను పెట్టదలచియున్నచో వారికి ప్రోత్సాహ మిచ్చుట ప్రభుత్వధర్మము. ఇంతకు ముందు స్కూలును స్థాపింపబూనుటకూడా నేరమే. ఉర్దూస్కూలును - గట్టిగా చెప్పవలెనన్నచో, "మఘవ" శ్రీవారిని కీర్తించుటకై స్కూలును, పెట్టదలచినచో నేరము కాకపోవచ్చును. కాని అట్టి అదృష్టమునకు కూడా హిందువులు నోచుకొనలేదు. దానమునుకూడా నిర్భయముగా చేయ వీలులేదు. ఉర్దూ స్కూళ్లకిచ్చు గ్రాంటులు చాలా ఎక్కువ. ఈ గ్రాంటులను తగ్గించి, క్రొత్తస్కూళ్లకివ్వవచ్చును. మంత్రులు, నాయకులు దేశము నాలుగు మూలలా తిరిగి భాగ్యవంతులకు ప్రోత్సాహమిచ్చి స్కూళ్లను పెట్టించవచ్చును. తప్పులేదు. ఈ పనిని చేసినచో ప్రభుత్వపు ఖజానాపై ఎక్కువ ఒత్తిడి ఉండదు. నలుగురకు చదువు అబ్బును.

"మఘవ" ప్రభుత్వములో అనేకులకు స్కాలరుషిప్పు లివ్వబడును. చెప్పుకొనుటకు సంఖ్య మాత్రము బాగుగనే యుండును. కాని స్కాలరుషిప్పులు బీదవారికి మాత్రమే దొరకు ననుకొనుట సరికాదు. హిందువులకు అప్పుడప్పుడు మాత్రము దొరకును. స్కాలరుషిప్పుకు కూడా మతమే యోగ్యత. (ఈ విషయములో మాత్రము కాంగ్రెసు ప్రభుత్వములకు "మఘవ"కు సమీపసామ్యము కుదురును.) ఇంకనూ అనేకసామ్యము లున్ననూ, వాటిని వేరుగా వ్రాసుకొనుట మంచిది.

ఇంక మతాభిమానమునకు విద్యాశాఖలో కొదువ లేదు. ముస్లిములు స్థాపించిన లైబ్రరిలకే గ్రాంట్లు. హిందువులకు లైబ్రరీలను పెట్టుకొనుట క్షేమము కాదు. చివరకు అనాధ శిశుసంరక్షణాలయముల కిచ్చు గ్రాంట్ల విషయములో కూడా పక్షపాతమే. స్కూళ్లకు ఉర్దూ పత్రికలే రావలెను. పాఠ్యగ్రంథ నిర్ణయములలో గ్రంథకర్తయొక్క మతవిచారము రాకతప్పదు - గ్రంథవస్తువు ముస్లిం మతానుకూలమై యుండవలెను. ఒక మహమ్మదీయ పెద్దమనిషికి తెలుగు వచ్చును కాన అతడు తెలుగు, సంస్కృత పాఠ్యగ్రంథ నిర్ణయశాఖకు అధ్యక్షుడైపోయెను. అతడు తెలుగు సంస్కృత విద్యకు సంబంధించినంత వరకు ప్రభుత్వ సలహాదారుడు. స్కూళ్లకు, ఆఫీసులకు భవనములు కావలెనన్నచో ముస్లిముల భవనములే దొరకును. వాటికి అద్దెలు చాలా

(18-వ పేజీ చూడుడు)

కథానిక:

తండ్రీకొడుకులు

శ్రీ యరకల వీరవెంకటరావు

ఉండుండి వెంకటేశ్వరరావు యిలాంటి పని చేస్తాడని ఎవరూ అనుకోలేదు. తనకేమన్నా డబ్బుకు లోటా?—తండ్రి కలప వర్తకం చేసి వేనకువేలు గడిస్తున్నాడాయెను. కూర్చుని తినలేక యీ తలగోరిగింపు దేనికి! గొప్పవాడయితే నేమి ఉద్యోగం చేయకూడ దని కాదు. చూసిచూసి పేరు ప్రతిష్ఠలు లేని ఈ గుమస్తాగిరిలో దిగటం ఏమి తెలివయిన పని? పగలల్లా చాకిరీచేస్తే నెలకో అరవై రూపాయలు పడేస్తారు. పోనీ, ఏదో వొక వుద్యోగంలో చేరాడేపో, తండ్రినుంచి వేరుపడి పోవడ మేమిటి? ఆఖరకు నిక్షేపంగా బ్రతకలేక లేని తద్దినం తెచ్చిపెట్టుకున్నాడు. వెఱ్ఱివాడు! అనుకున్నారు ప్రజలు. "వెంకటేశ్వరరావుకు మతి భ్రమించిం" దని, కొందరు ప్రముఖులు నిర్ధారణగా తీర్మానించారు.

కాని వెంకటేశ్వరరావుకు తను చేసిన పని ఉత్కృష్టమయిన పనిగానే తోచింది. పెళ్ళయి మూడేళ్లయింది. ఈనాటివరకూ తను దమ్మిడీ తేలేదు. తండ్రి వ్యాపారం చేస్తుంటే తను భార్యతోబాటు పనీపాటా లేకుండా యింట్లో కూర్చోవడం అతనికి మనస్కరించలేదు. తనూ కొద్దో గొప్పో స్కూలుఫైనలువరకూ చదివాడు, గద! తన పొట్ట తను పోషించుకోలేడా! తను ఎందుకు బ్రతుకుతూన్నట్టు? ఈ ప్రపంచంలో నిరుద్యోగిగా బ్రతకటంకంటె దౌర్భాగ్యస్థితిలేదని పించిం దతనికి. తండ్రిపై ఆధారపడి వున్నంత కాలం తను అస్వతంత్రుడే నన్నట్టు తోచింది. తనని లోకులు తక్కువగా భావిస్తున్నట్టు వెంకటేశ్వరరావు నిత్యమూ తలపోయసాగాడు. ఏదో ఉద్యోగంలో ప్రవేశిస్తే తను ధైర్యంగా తలెత్తుకు తిరగవచ్చుననుకున్నాడు. అతని ఆలోచన లిలా నడిచాయి. ఈ ఆలోచనలతోనే వెంకటేశ్వరరావు యింట్లో ఎవరితోనూ సంప్రదించకుండానే కలెక్టరాఫీసులో గుమస్తాగా చేరాడు.

అప్పటివరకూ సుఖకరమయిన జీవితానికి అలవాటు పడివున్నా కష్టపడి సంపాదించుకొంటున్న ఈ రోజులే వెంకటేశ్వరరావుకు సుఖతరమనిపించాయి. తను తండ్రివద్ద నుండి దమ్మిడీ కూడా తీసుకోవడంలేదు—తన భారం తండ్రిమీద మోపలేదు. ఎంత సంపద వున్నా, కష్టపడి పనిచేసి సంపాదించుకోవడం మానవుని కుండవలసిన సహజలక్షణ మనుకున్నాడు వెంకటేశ్వరరావు. ఆ క్లుప్త జీతంతో జీవితం గడుపుకు రావడంతో అతనికి కొద్దికాలంలో అనేక అనుభవాలు కలిగాయి. కష్టజీవికుండే విశాల హృదయం, నిర్మలవాత్సల్యం భాగ్యజీవి కుండవని అతని కొక గాఢనమ్మిక కలిగింది.

వెంకటేశ్వరరావు చేసిన పనికి తండ్రి చాలా క్షోభపడ్డాడు. ఒకరోజున వచ్చి "నాయనా! నామీద కక్షతో యిలాంటి పని చేశావా? నేను నీకేమి ద్రోహం చేశాను? కోరినవన్నీ నిమిషాల మీద సమకూర్చాను. పుట్టినప్పట్నించీ ఏలోటూ రాకుండా పెంచాను. నన్నీ వృద్ధాప్యంలో ఎందుకు దుఃఖపెడతావు? లోకులు వెంకటేశ్వర్లుని తండ్రి యింట్లోంచి వెళ్ళగొట్టాడని చెప్పుకొంటుంటే నే నెలా తలెత్తుకు తిరగగలను? నీ కెందుకీ శ్రమ? వెంటనే మానేసి యింటికి వచ్చేయ్!" అని సజలనేత్రాలతో కొడుకును బ్రతిమాలాడు తండ్రి. వెంకటేశ్వరరావు చెదిరిన హృదయాన్ని కూడదీసుకొంటూ అన్నాడు: "నిన్ను చెడుగా లోకులు అర్థం చేసుకుందుకు నే నేమీ విషప్రచారం చేయలేదు నాన్నా! లోతుపాతులు తెలియని గ్రుడ్డి సంఘంచేసే ఆరోపణలకు భయపడటం వట్టి తెలివితక్కువపని. నా దారిని నేను బ్రతకదల్చుకొన్నాను. అదే నాకు సుఖం. నే నెల్లప్పుడూ నీపట్ల భక్తిగానే వుంటాను. నన్ను బలవంతపెట్టకు." తండ్రి ఎన్నో చెప్పిచూశాడు. వెంకటేశ్వరరావు సమ్మతించలేదు. వచ్చినవాడు వచ్చినట్లే వెళ్లిపోయినాడు తండ్రి.

అకస్మాత్తుగా వెంకటేశ్వరరావును మరొక వూరు ట్రాన్స్ఫరు చేశారు. ఎవ రెన్ని చెప్పినా వినకుండా భార్యను తీసుకుని ప్రయాణమై వెళ్ళిపోయాడు వెంకటేశ్వరరావు. పన్నెండు రూపాయల అద్దె కొక యిల్లు తీసుకుని వాళ్లిద్దరూ అందులో నివసించసాగారు. పగలెల్లా ఆఫీసరు మెప్పు పొందేందుకు చెమటోడ్చి పనిచేసేవాడు. రాత్రి పన్నెండుగంటలవరకూ ఏవేవో పుస్తకాలు చదివేవాడు. నానాటికీ అతనిలో ఉత్సాహకరమయిన ఉత్తేజం కలుగసాగింది. జీవితరంగంలో సాధ్యమయినంత ఉన్నతునిగా తయారయ్యేందుకు ప్రతీవానిలోనూ శక్తి కలదని అతని అంతరాత్మ పదేపదే నొక్కి చెప్పింది.

వెంకటేశ్వరరావు ఇంటర్మీడియేటుపరీక్షకు చదివాడు. ప్యాసయ్యాడు. ఆఫీసులో అతను హెడ్ గుమస్తా అయ్యాడు. కలెక్టరుగారికి కతనంటే అపారవాత్సల్యం ఏర్పడింది. ఇద్దరూ కులాసాగా షికారు పోతూంటారు. ఆయన కారులో వెంకటేశ్వరరావును తీసుకొచ్చి అతని యింటివద్ద దిగబెడుతూండేవాడు కలెక్టరుగారు. అతని హోదాను, గౌరవాన్ని చూసి తక్కిన గుమస్తాలు అసూయపడటం వెంకటేశ్వరరావు చూసీ చూడనట్లుండేవాడు.

ఇల్లు వదలిపెట్టివెళ్లిన ఆరేళ్లలో వెంకటేశ్వరరావు బి. ఏ. డిగ్రీ సంపాదించుకున్నాడు. ఇప్పు డతని బంధువర్గాలవారికి అతనొక అద్భుత వ్యక్తిగా కన్పట్టసాగాడు. వాళ్లల్లో వెంకటేశ్వరరావుని అర్థం చేసుకొన్నవారు అరుదు. అయినా అతను స్వయంశక్తితో పైకిరావటం వారికి వెంకటేశ్వరరావుపై ఆత్మీయతను యినుమడింపజేసింది

తన వూరిలోనే వెంకటేశ్వరరావుకు కలెక్టరు వుద్యోగం లభించినా, అతనేమీ పొంగిపోలేదు. తన పూర్వపు టనుభవాలను అతిభద్రంగా మననం చేసుకోవటం అతనికి పరిపాటయింది. వాటివల్ల అతను కనిపెట్టిందేమంటే "మనముందు గడచిపోతూన్న ప్రతీనిముషంలోనూ మహత్తరమయిన విలువ వుంది" అని. ఇప్పు డతని తండ్రి ననేకులు ధన్యుడని పొగడసాగారు. తన పుత్రుని మూలాన తన కింత పేరు వస్తుందని తండ్రి అనుకోలేదు. ఆ వృద్ధుడు కళ్లు మూసుకుని గద్గద కంఠంతో అనుకునేవాడు. "భగవంతుడా! నా పుత్రుని రక్షించు." తన పుత్రుని అభివృద్ధిని తాను నిరోధించినవాడల్లే బాధపడేవాడు వృద్ధజనకుడు. కలెక్టరుగారి తండ్రి మరణించాడంటే ఊరిలో అనేకులు వెంకటేశ్వరరావుకు సానుభూతి చూపారు. ప్రజలకు తనమీద యింత ఆదరణకలిగిందని అప్పుడే తెలుసుకున్నాడు వెంకటేశ్వరరావు. తండ్రికి చేయవలసిన పితృకర్మల నన్నిటినీ యథావిధిగా జరిగించాడు. తండ్రి సంపాదించిన అరవై వేల రూపాయల ఆస్తంతా ఏకైకపుత్రుడయిన వెంకటేశ్వరరావుకు లభించింది. దానితో తండ్రిస్మృతిచిహ్నంగా ఒక సత్రం కట్టించాడు. అతని స్వార్థత్యాగాన్ని అనేకులు వేనోళ్ల పొగిడారు. వెంకటేశ్వరరావు గత చరిత్రనంతా స్మరించి తండ్రిపట్ల తనేమయినా అక్రమంగా ప్రవర్తించానా అని పరితపించసాగాడు. "భగవంతుడా! నా తండ్రికి ఆత్మశాంతి ప్రసాదించు!" అని ఆఖరుసారిగా ప్రార్థించాడు.


కథానిక:

మందు నీళ్లు

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

బాగా చీకటిపడింది. ఊరంతా అప్పుడే మెల్లమెల్లగా నిశ్శబ్దంలోకి మునిగిపోతూంది. వీధిలో పంచకింద నులకమంచంమీద కంసాలి వీరయ్య జబ్బుతో మూలుగుతూ పడుకున్నాడు. మధ్యమధ్య దగ్గుతూ చూరుకి వేలాడవేసిన గోనె చేత్తో ఎత్తి, వీథిలోకి కాండ్రించి ఉమ్మేస్తున్నాడు. అవును పాపం, నెల్లాళ్లయి మంచ మెక్కాడు మరి! క్షయరోగం, మనిషిని పూర్తిగా తొలిచేసేవరకూ చంపీదు. అందులోకి ఇవాళ దగ్గు బాగా ఎక్కువైంది; ఈరాత్రి గడవడం కష్టం - కూతురు లచ్చమ్మ వచ్చి, ఇంట్లోకి వీథిలోకి కూడా వెలుతురువచ్చేటట్లు దీపపు బుడ్డి గుమ్మంమీద పెట్టింది. కంసాలి వీరయ్యకు లచ్చమ్మ ఒక్కర్తె కూతురు. రథాల్లాంటి ఇద్దరు కొడుకులు చచ్చిపోయారు. భార్య ఆనాడే వొదిలీసింది. దానికి సిగ్గులేదు. ముగ్గురు పిల్లల్ని కన్నతరువాత మొగుణ్ణి వదిలి, జంగపాడితో లేచిపోయింది.

వీరయ్య బాగా ఉన్నరోజుల్లో మంచి పనిమంతుడు. బాడితపడితే రూపాయి. చిత్రిక పట్టేడంటే, ఎలాంటి పేడు అయినా అద్దంలా తళతళ లాడాలి. "దీని తస్సా గొయ్యా, మనం, చిత్రికపడితే బల్లసెక్కమీద నీడ కనిపించాల బాబూ, నీడ. అదీ పనోడితనమంటే—మొన్న పట్నంలో పోలీసు ఇనస్పెక్టరుగారింట్లో మంచం సేసినాను సూసినారా బాబూ, ఏదీ పట్నపాడినొక్కడిని సెయ్యమనండి సూదాం"—అనేవాడు గర్వంగా. పొద్దున్నే లేచి స్నానం చేసి పిండికట్లు శరీరమంతా పెట్టి, నుదుటిమీద కానంత బొట్టు పెట్టి, భోంచేసి, బట్ట లేసుకుని, భుజంమీద ఎఱ్ఱటి సిల్కు వాణీ గాలికి ఎగురుతూంటే మీసం మెలివేస్తూ, మందగమనంతో మెల్లిగా అడుగులు వేసుకుంటూ దారి పోయే వాళ్లని పలకరించేవాడు. ఎవరేనా ప్రమాదవశాత్తు "ఎక్కడికోయ్"అని అడిగేరంటే, "తెలీదేటి బాబూ, పట్నంలో ప్లీడరిగారి ఇల్లు కడుతున్నాను గాదా? మాటమీద పంతం వొచ్చి ఇల్లంతా నా ఒక్కచేతిమీద కట్టేస్తున్నాను. ఇసవ్రొబ్రాహ్మడి పంతమంటే ఏటి? మజాకాలా?" అనేవాడు. అనడమే కాదు పనికూడా అలాగే చేసేవాడు. నలుగురి పని ఒక్కడే చేసేవాడు. లాల్చి యిప్పి, చేత్తో రంపం పట్టుకుని చూరు బల్ల కోస్తూంటే, చెమటపట్టిన శరీరంలోని కండలు, వెదురుకర్రలా పెళపెళ విరిగేవి. సాయంత్రమయేసరికి రెండుమూడు రూపాయిలు కళ్లజూసేవాడు. కాని తెచ్చిన డబ్బంతా తాగేశాడు. పిల్లలున్నారనైనా చూడకుండా ఉంచుకున్న సాలిదానికి చాలా డబ్బు పెట్టేశాడు.



దక్షిణ అమెరికాలోని చిలీరాజ్య ప్రతినిధియగు డా॥ జూ ఆక్ మారిక్ గారు ఢిల్లీలో ఏప్రిల్ 6 తేదీన భారత ప్రధాని పండిత జవహర్ లాల్ గారిని సందర్శించి సంభాషించిరి.

కాని ఇప్పుడో? కాళ్లుచేతులు వొంగిపోయాయి. వొంట్లో శక్తి లేదు. చాలారోజులై మంచం పట్టేడు. ఇంట్లో తాగడానికి గంజినీళ్లైనా లేవు. ఆఖరికి అభిమానం చంపుకుని సాలిదాన్ని పాతికరూపాయిలు అప్పు అడిగితే నోటు రాయమంది. అవును మరి. డబ్బున్నంతకాలమే అభిమానాలు! అయితే మూడునెలలనుంచి ఇంట్లో దినాలు ఎలా గడుస్తున్నాయి? అందులో రహస్యమే ముంది. లచ్చి తెస్తూంది. తెచ్చి ఇంట్లో అందరికీ పెడుతూంది. తను డబ్బు తెచ్చి ఊరువాళ్లకి పెట్టేశాడు. తనకంటె లచ్చి ఎన్నోరెట్లు నయం.

"లచ్చి" అని ఆయాసంగా మూలిగేడు ముసిలాడు.

"ఏటయ్యా—ఏటి కావాల?"

"నచ్చి, ఇయాలరేతిరి మరి గడవదే!" దగ్గుతో మాటలాడలేకపోతున్నాడు.

"మంగలాడినడిగి మందునీళ్లు తెస్తాను తాగు."

"ఛీ—ఎంతవొయిద్దుడయినా మంగలాడిసేతి నీళ్ళు తాగమంటావటే"—

"సాలిదానికన్న మంగలాడేటి తీసిపోనాడు? అయినా ఊరికావొక్కడే వొయిద్దుడు మరి—"

"లచ్చి, అన్నాళ్లు సాలిదానితో ఉన్నాగాని, ఒకదినం దానిసేతినీరు తాగనేదు. ఎరికా? ఏటనుకున్నావో, ఏం—" అన్నాడు గర్వంగా.

"సస్తూంటే జాతేటి నాయినా, బాపనాళ్లే తాగినారు ఆడిసేతి మందునీళ్లు."

"బాపనోళ్లకంటె సిగ్గునేదు. నా జలమలో కంసాలాడింట్లో తప్పించి ఇంకోడిసేతి నీళ్లు తాగనేదు. ఒకమెతుకు తిననేదు. అయినా సచ్చేముందు తాగితేమాత్రం ఏటి నాబంసెప్పు?" ముసిలాడికి బతుకుమీద ఆశ లాగుతోంది. బతికి సుఖపడకపోయినా, ప్రాణం అంటే ఎవడికి తీపి కాదు?

"కంసాలి గంగయ్యకి జ్వరమొస్తే పట్నం నుంచి తెప్పించినాడు డాకిటేరుని." అన్నాడు మూలుగుతూ.

"డబ్బో. ఆడు పాతికరూపాయి లిచ్చినాడు. ఆడికేటె నంజకొడుకు."


"ఛీ తప్పే. ఆడినంటే పుట్టగతు లుండయే. ఆ డెక్కడాడు? సాచ్చాత్తు ఈరబ్రెమ్మం!"

"డబ్బు నేకపోతే ఈరబ్రెమ్మమైనా మంగలాడి మందునీల్లు తాగాలసిందే!" అన్నది లచ్చి. ఆమాటకూడా నిజమే. డబ్బులేకపోతే గంగయ్య ఏం చేసేవాడో ముసిలాడు ఊహించుకోలేకపోయాడు. గంగయ్య ఊళ్లో కంసాలికులానికి పెద్ద. బంగారప్పనిచేసి డాబా ఇల్లు కట్టేడు. నూరు తులాల బంగారం ఆర్జించాడు. పాడీపంటా ఉన్నాయి. దైవభక్తుడు. ఊళ్లో గొప్పపలుకుబడి ఉంది. ఇంకేం కావాలి. వాడికి జబ్బొస్తే డబ్బు ఖర్చుపెట్టి బాగుచేయించుకుంటాడు. వాడిలాంటి

(21-వ పేజీ చూడుడు)



గడ్డకట్టిన సముద్రం లాగా అలుముకుపోయిన మంచులో చిక్కుపడిపోయిన గొడ్లు గడ్డితెస్తూన్న విమానం నీడను చూసి ఆశలు తెచ్చుకొంటున్నాయి.



గడ్డి తీసుకుపోతున్న ప్రత్యేకరకపు "C-82-విమ

మంచుబీళ్లల్లో విమానాలలో


ఉత్తర అమెరికాలో బీడు పొలాలు అక్కడ చిక్కుపడిపోయిన గొడ్లు ఎక్క వస్తూ ఉంటుంది. అందుకని విక




శీతాకాలం వచ్చే ఈ మంచుతుపానులలో, పది నుంచి ముప్ఫై అడుగుల ఎత్తుదాకా కూడా నేలమీద మంచు పేరుకుపోవటంకద్దు. పడమటి అమెరికాలో ఒక ఊళ్లో ఇల్లా రహదారి మీద పేరుకొన్న ఈ మంచు గుట్టలను, "బుల్ డోజర్లతో" చెక్కి శుభ్రం చేశారు.




మంచు ఉప్పెనలో మునిగినబీళ్లకు తీసుకుపోటానికి విమానంవద్దకు గడ్డిమోపులు చేరుస్తున్న లారీ.



దుప్పటిలాగా మంచు నేలంతా కప్పి గడ్డి పడేసేందుకు,





గడ్డి మోపులు కుదిమట్టంగా బేళ్లు కట్టి విమానాలలోకి ఎక్కించేందుకు సిద్ధంగా ఉంచుతారు.

ానము". ఈ విమానాల్నే ఈ పనికై వాడుతారు.

చిక్కుపడ్డ గొడ్లకు కి గడ్డి సరఫరా


శీతాకాలంలో మంచులో మునిగిపోతాయి. క్కీ కదలలేక, మేతలేక అక్కడే చచ్చిపోవలసి హాలద్వారా గడ్డి సరఫరా చేస్తున్నారు.



సామాన్యంగా గొల్లవాళ్లు కూడా, ఈ విమానాలలో ఉండి, వైమానికునికి గొడ్ల ఆచోకీలు తెలుపుతూంటారు.



ఉంటుంది. జంతువు లెక్కడున్నదో వెదికి, నం చాలా దిగువగా ఎగురుతూంది.



విమానంతో కండక్టరు గడ్డిమోపులను విమానంలోనుంచి పశువులున్న జాగాల క్రిందికి పడ వేస్తున్నాడు.

బాలానందం :

"ఐకమత్యమే వుంటే?"

శ్రీమతి నేమాని సుభద్రాదేవి

ఆఫ్రికాదేశంలో సహారా యడారి అనే పెద్ద యడారి వుంది. సుమారు వెయ్యిమైళ్లు వెడల్పు గలది. ఆ యడారిలో వర్తకులు ఒంటెలమీద సరుకులు వేసుకొని ఒక ప్రదేశం నుండి మరియొక ప్రదేశానికి తీసుకొని పోయి అమ్ముతూంటారు. ఆ యిసుక ప్రదేశంలో నీరు దొరకదు. అక్కడక్కడ నీటి పట్టులు కనబడతాయి. ఈ వర్తకులందరు ఆ నీటి పట్టుల వద్ద ఆగి, తోలు సంచుల నిండా నీరు నింపుకొని ఒంటెలకు కూడా నీరు త్రాగే అవకాశ మిచ్చి తిరిగి బయలు దేరుతూంటారు. యడారిలో ప్రయాణం చెయ్యాలి గనుక ఒంటెకు వారం దినములకు సరిపోయే నీరు త్రాగే శక్తి, యిసుకలో నడవ గలిగిన దిండ్ల వంటి పాదములు భగవంతుడు ఒంటెకు ప్రసాదించేడు. అచ్చటి వర్తకులు గుంపులు గుంపులుగా ప్రయాణం చేస్తారు గాని ఒంటరిగా చెయ్యరు. ఎందుచేతనంటే అక్కడ దొంగల భయం జాస్తి.

ఒక దినం యిద్దరు వర్తకులు జట్టు నుండి వెనక బడ్డారు. అందులో ఒకని వద్ద తాను తెచ్చుకున్న నీరు అయిపోయింది. రెండవ వాని వద్ద తోలు సంచిలో ఒకటి రెండు సార్లు త్రాగటానికి మాత్రం సరిపోయే నీరుంది. మొదటివాడు రెండవ వానిని "అన్నా, నా దగ్గర నీరు అయిపోయింది. నాలిక లాక్కొని పోతూంది. ఒంటెను చంపి దాని కడుపులో నిలువ వున్న నీరు త్రాగుదామంటే ప్రయాణం సాగదు. కనుక నీ దగ్గర నీరు నాకు కొంచెం యియ్యి" అని బ్రతిమాలాడు రెండవ వాడు. "సోదరా, నీకు పట్టిన గతి నాకు కూడా కొంచెం కాలంలోనే పట్టవచ్చు. ఆ మాత్రం నీరు లేక పోతే నా ప్రయాణం సాగదు. ఎవరి ప్రాణం వారికి తీపి అని నీవు ఎరుగనిది కాదు" అన్నాడు. మొదటివాడు యింక ఎంత మాత్రం ఆగలేక, తన మిత్రుణ్ణి చంపి అయినా సరే, నీరు త్రాగాలని యుద్ధానికి బయలు దేరేడు. చాల సేపు యిద్దరూ ఒకరి నొకరు కొట్టుకున్నారు. కడకు మొదటి వాడు 'తన మిత్రుణ్ణి కత్తితో పొడిచాడు.

పోటు తినినవానికి కోపం, దాని బంధువైన కసీ ఎక్కువై, తన గాయాన్నుండి రక్తం కారకుండ చేతితో అదిమి పట్టుకొని, తాను యిక ఎలాగూ బ్రతకనని నిశ్చయించుకొని, తన విరోధినికూడా బ్రతికించుట యిష్టము లేక, చురుకుగా తత ఒంటె దగ్గరకు పోయి, దాని నడుంపై వ్రేలాడే తోలు సంచిలోని నీరు క్రింద పోసి, ఒంటెకడుపులో వున్న నీటిసంచికి కూడా కన్నం పెట్టి నీరు కారిపోయేలా చేసి క్రిందపడి చనిపోయాడు.

రెండవవాడు, తనకు దాహం ఎక్కువ అవటం చేత, ఒంటెను చంపక తప్పదని, ఆ ప్రయత్నం చేయబోగా, అందుకు కావలసిన నేర్పరితనం లేక, ఆ నీటిని క్రిందనే పడిపోయేలాగా చేసేడు. కడకు "నీరు, నీరు" అంటూ నాలిక పీక్కుని చనిపోయాడు.

పక్షిభాషతెలిసిన మంత్రి

శ్రీమతి నరహరిసెట్టి మహాలక్ష్మి

పూర్వకాలం మహమ్మదు అనే ఒక రాజు వుండేవాడు. అతడు యెన్నో యుద్ధాలు చేసి యెన్నో రాజ్యాలు సంపాదించాడు. యెన్ని రాజ్యాలకు అధిపతి అయినా ఆ రాజుకు తృప్తి అంటూ వుండేది కాదు. అతడు ప్రజలను యెంతో హింసించే వాడు. అందమైన పట్టణాల నెన్నిటినో యుద్ధాలలో నాశనం చేసేశాడు. పరిష్యారాజ్యంలోని సగం మంది ప్రజలను నాశనం చేశాడు.

ఆ రాజు దగ్గర ఒక తెలివైన మంత్రి వుండేవాడు. ఆ మంత్రి తనకు అన్ని రకాల పక్షుల భాషలూ తెలుసునని చెపుతూ వుండేవాడు. మంత్రికి పక్షిభాష తెలుసునని రాజ్యమంతా పేరు మోగిపోయింది. ఒక రోజున రాజూ మంత్రీ కలిసి వేటకు వెళ్ళి తిరిగి వస్తుండగా రెండు గుడ్లగూబలు ఒక పడి పోయిన పాత గోడమీద కూర్చుని వుండగా చూచారు. రాజు అన్నాడు కదా "మంత్రీ! ఆ రెండు పక్షులు యేదో రహస్యం మాట్లాడుకుంటున్నట్లుంది. అదేమిటో వినాలని నాకు చాల కుతూహలంగా వుంది. వాటి సంభాషణ విని నాతో చెప్పు." మంత్రి నెమ్మదిగా ఆ గుడ్లగూబలు కూర్చున్న చోటుకు వెళ్ళి, యెంతో తెలిసినవాడిలాగ వింటున్నట్లు నటించాడు. కొంత సేపటికి రాజు దగ్గరకు తిరిగి వచ్చి అన్నాడు: "అయ్యా! వాటి సంభాషణ నేను కొంత విన్నాను. కానీ అది మీతో చెప్పలేను" రాజుకు ఆతృత యెక్కువయింది. అవి చెప్పుకున్న ప్రతిమాటా తనకి తెలియ చేయవలసిందని నొక్కించి అడిగాడు మంత్రిని. ఇక తప్పని సరిగా చెప్పవలసి వచ్చినట్లు మంత్రి మొదలుపెట్టాడు :

"అయ్యా! ఆ రెండు గుడ్లగూబలలో ఒక దానికి ఒక కొడుకు, రెండవ దానికి ఒక కూతురూ వున్నారు. ఆ రెంటికి పెండ్లి సంబంధం కుదుర్చుకుంటున్నారు. కొడుకు వున్న తండ్రి, పెండ్లి కూతురు తండ్రితో అంటున్నాడు కదా 'బావగారు, మీ అమ్మాయికి 50 పాడు పడ్డ వూళ్ళు కట్నంగా యిస్తే మా అబ్బాయికి మీ అమ్మాయిని చేసుకుంటాను.' అందుకు పెండ్లి కూతురు తండ్రి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ అన్నాడు: "అయ్యో, మీరు 50 అడిగారు కానీ, నేను 500 యియ్యగలను. దేవుడు మహమ్మదు రాజుగార్కి సంపూర్ణ ఆయుస్సు యిచ్చుగాక! వారు రాజ్యమేలుతున్నంత కాలం మనకు పాడుబడ్డ వూళ్ళకు కరువు లేదు.' ఇంతవరకు నేను విన్నానయ్యా" అని అన్నాడు మంత్రి. ఈ సంగతి వినే సరికి రాజుగారి మనస్సు చివుక్కుమంది. బుద్ధి తిరిగింది. ఆ రోజు మొదలుకొని పాడుబడ్డ ప్రదేశమంతా బాగు చేయించారు రాజుగారు. అక్కడి నుండి ప్రజల క్షేమం కోరేవారు.

మంత్రుల ఎన్నిక

చి॥ అయ్యగారి కనకం

పూర్వకాలం ఓ ఊళ్లో ఓ రాజుగారుండేవారు. ఆయన తెలివిగల మంత్రి కావలెనని, పట్టణమంతా చాటింపు వేయించారు. వెంటనే సుబ్బయ్య, సుబ్బారావు గార్లు మంత్రిపదవులకై నిలబడ్డారు. ఇప్పటివలె, అప్పుడు ప్రజాభిప్రాయాలు ఓట్లు లేవు. రాజుగారే స్వయముగా పరీక్షించి, మంత్రిని నియమించుకునేవారు. అందుచేత, సుబ్బయ్యకి, సుబ్బారావుకుకూడ చెరి నలుబదిఐదు మినపసున్ని ఉండలు యిచ్చి, సమానదూరములో నున్న గ్రామములలో గల బంధువులవద్దకు కాలినడకను పోయి అందజేసి, ఇచ్చినట్లు రశీదు పుచ్చుకు రమ్మని పంపించారు. సుబ్బారావుగారు వెళ్లిన ఊరినించి నలుబది ఐదు ఉండలు ముట్టినట్లుగా వార్త వచ్చినది. సుబ్బయ్యగారి ఊరినుంచి నలుబది యుండలు మాత్రమే ముట్టినట్లుగ తెలిసినది. వెంటనే రాజుగారు, కాబోయే మంత్రులిద్దర్నీ పిలిపించారు. 'మీరు తీసికొని వెళ్లిన ఉండలన్నీ అందినట్లు రాలేదని సుబ్బయ్యను అడిగారు. ఆకలి బాధకు తాళలేక తినివేశానన్నాడు సుబ్బయ్యగారు. సుబ్బారావుగారి యుండలుకూడ తిరిగి తెప్పించారు. వెలక్కాయంతంత పరిమాణం గల యుండలు, నిమ్మకాయ రూపంలో నున్నాయి. ఈయన ఆకలి వేసినపుడల్లా ఉండలు రూపంగా కాకుండా మినపసున్నుండలు చుట్టూ దులుపుకుని తినేసేవాడు. ఈ ఉండలు చూచేటప్పటికి రాజుగారు కడుపు చెక్కలయేటట్లుగా నవ్వేశారు. సుబ్బారావు తెలివికి మెచ్చుకొని రాజుగారు యితనినే మంత్రిగా నియమించుకొన్నారు.

గేయాలు :

స్వయంపాకం

చి॥ యల్. యమ్. సెట్టిబాబు

పట్టణవాసం
పరీక్ష చదువూ
రూములో నున్న
రుక్మిణి కుక్కరు
రంజ రంజగ
రడీ అయ్యేను
రేషను బియ్యపు
రంగులన్నమూ!

వెన్నను తెచ్చా
వేడిని చేసా
వేయించానూ
వేగముగా నే
వాడి పోయినయ్
వుల్లొంకాయలూ!


పాలను తెచ్చా
పొయి మీ దెట్టా
పొయిలో మంట
పెద్దది కాగా
పాలొక సారిగ
పొంగీ పోయినయ్!

కత్తి మీదనూ
కూరలు తెగకా,
కంగారుల్లో
కసిరి కోయగా
కరము చివరనే
కత్తి- తె- గిం- దీ—

'చియ్యి' మసగ
చిన్న కూరలు
చెడిపోవు నని
చేత్తో పట్టి
చూడగ బోతే
చేయ్- కా- లిం- గి—

పట్టణ వాసం
పరీక్ష చదువూ—
పరుగు పరుగు నే
పోవాలంటూ
హల్లెంలో నే
పదార్థాలను
పట్టీ తింటే
పె- ద- వు- లు- మా- డె- !—

బాధల వంటా—
భరించ లేమని
భోజన శాలలో
భుజించ వెడితే
బలము- నశించును,
బొజ్జలు- నిండవు,
బుక్కులు- తెరవవు
బుద్ధులు పె- ర- గ- వు!



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౨౩

అన్నమయ్యాగారి రచన: (సంపు. 3; ప.౨)

భైరవిరాగం-చతురశ్రరూపకం

[పల్లవి]

(౧) , మ గ రి గ మ | పా ధ మ-ప ధ ప ధ పా | , ప మ ని ధ ప | మ ప గా , రి రి , స స గ
గం ధ ము బూ సే వే లే క మ్మ ని మే నై

(౨) రి గ మ ప గ రి గా ప మ పా ని ధ ప మ ప రి గ మ పా | , ధ ని సే ని ధ పా | ,,
గం ధ ము బూ సే వే లే క మ్మ ని మే ,,

(౩) రి గ మ ప గ రి రి గ మ ప ధ ని ధ ప ధ మ ప రి గ మ పా | , ధ ని సే ని ప ధ మ పా , | మ ప ని ని ధ ప మ గా రి స గ
గం ధ ము బూ సే వే లే క మ్మ ని మే నై

(౪) రి గ మ ప గ రి ని స రి గ | మ ప ధ ని సే ని ధ ప ధ మ పా | , ధ ని సా రి గ రి సే ని ధ ప | మ ప ధ ప ని ని ధ ప మ గ రి స
గం ధ ము బూ సే వే లే క మ్మ ని మే నై

(౧) రి గ మ గ రి సా , గ | రి స నీ నీ ని స గా రి | , మ గ రి గ మ ప ధ ని ప ద | పా , , , ,
గం ధ ము నీ మే ని తా వి కం టె నె క్క డా

(౨) , మ గ రి ని స రి గ | రి స నీ ధా ని స మ గ గ రి | రి స మ గ రి గ ని ని ధ ప ధ మ | పా , , , మ గ
గం ధ ము నీ మే ని తా వి కం టె నె క్క డా

(౩) రి గ మ గ రి ని స రీ గ రి | సా రి స నీ స ని ధ ప ధ ని స రి గా | , రి రి స రి గ మ ప ధ ని | సా రి సే ని ధ పా , ,
గం ధ ము నీ మే ని తా వి కం టె నె క్క డా (గంధము)

[చరణం]

, ని ని ని ని | ని ని ధ ని ధ ని సే నీ | , ధ ధ ని సే ని ధ పా | పా , ని ధా , మ ప ధ ప ధ మ ప
అ ద్దము జూ చే వే ళ అ ప్ప ట ప్ప టి కి ని

, మ మ ని ధ ప మ గ మ | పా ధ మా ప మ గ రి సా | , గా రి గ మ ప ధ ని ప ధ | పా , , , ,
అ ద్ద ము ని మో ము కం టే అ పు రూ ప మా

, స ప ధ నీ | , , సే సే సే సే | , సే ని సే రి రి సే రి మ గ రి | సా రి ని ధ ప పా
ఒ ద్ది క దా మ ర వి రి నొ త్తే వు క న్ను లు నీ

, ని ని ని ధ నీ | ధ ని సా రి సే ని రి సే ని ధా పా | మ ప ధ ని సే రి ని సే ప ధ మ ప | మ ప ధ ని ధ ప గా , , రి స
గ ద్ద రి క న్ను ల కం టె క మ ల ము ఘ న మా
రి గ (గంధము)

ఇట్లే ఈ క్రింది చరణములు:

(౨) బంగరు పెట్టే వేలే - పడతి నీ మెయినిండా
బంగరు నీతనుకాంతి - ప్రతి వచ్చీనా ?
ఉంగరా లేటికె నీ - యొడికపు వ్రేళ్ల ?
వెంగలి మణులు నీ - వేలిగోరు బోలునా ? (గంధము)

(౩) సవర మేటికినే - జడియు నీ నెఱులకు
సవరము నీ కొప్పు - సరివచ్చీనా ?
ఇవలజవులు నీకు - నేల వేంకటపతి
సవరని కెమ్మోవి - చవికంటేనా ? (గంధము)

లఘుటీక : కమ్మనిమేను = సుగంధముగల దేహము; గద్దరికన్నులు = చూచినవారిని గదరించి లోగొనగల కన్నులు; ఒడికపువ్రేళ్లు = ఒడికారము-ఒడయతనముగల వ్రేళ్లు; వ్రేళ్లసౌందర్యానికే అందరూ పరవశు లగుదు రన్నమాట; ఒడికమను పదానికి శబ్దరత్నాకర మిచ్చిన అర్థాలన్నీ ఛాయలు; జడియు నీ నెఱులు = ఒత్తుగా బెరిగిన నీ కురులు, ఈ ధాతువు కీ యర్థం కన్నడంలో గలదు. 'చెట్లో పండ్లు జడుస్తుం'దనీ, 'జగుస్తుం'దనీ పశ్చిమాంధ్రులలో వ్యవహార మున్నది; ఇవలజవులు = ఈ ప్రక్క-బైటి రుచులు; సవరని = చక్కని.

ముద్రితపాఠములు : బంగారుపెట్టే కెలి, పతివచ్చినా, ఉంగరాలేటికినే, సవరనీకెమ్మోవి.

లేఖలు

రామరాజ్యం

అయ్యా!

శ్రీ మహాత్మా గాంధిగారు యీ దేశప్రజలకు పరప్రభుత్వపు పీడనమును తొలగించినారు. మరియు రామరాజ్యమును నిర్మించదల పెట్టిరి. గాని ఇంతలోనే వారిని అకాల మృత్యువు తీసుకొనివెళ్లినది. దేశం దుఃఖస్థితిలో ఉండగా, దేశప్రజలు చెల్లాచెదరై వారి ఉపదేశములను, ఆచరణ కార్యములను, మరచి ప్రపంచములో యితర దేశస్థులవలె ఆశ అనే మోహములో బడి, వారు ఉపదేశించిన జ్ఞానమును మరచితిమి. మనబుద్ధి యెప్పుడు ఆశమీదికి వెళ్లుచుండుననిన్ని, ఆశను కోసివేయుటకు జ్ఞానమను కత్తిని దగ్గిర యెల్లప్పుడు ఉంచుకొనవలెననిన్ని చెప్పియున్నారు. ఆ ప్రకారం చేయుటకు కష్టం అనే విషయం అందరకు తెలిసిన విషయమే. అయితే శ్రీ మహాత్ములవారు రామరాజ్యమును యేర్పరుచుటకు పునాది వేసిరి. ఆ పునాదిమీద మనము గృహమును నిర్మించి అందులో సుఖముగా కాపురముండి యితర దేశస్థులకు మార్గదర్శకులము అయ్యే యెడల శ్రీమహాత్మగాంధిగారి ఆత్మ సంతోషించగలదు. వారి ఆత్మ అందరిలోను ఆత్మవకటే అనే హిందు ధర్మమును బోధించుచున్నందున మనము అందరము సంతోషపడుదుము. అందుకుగాను మనము నిర్మించవలసిన గృహం యెటువంటిది. దానికి కావలసిన అంగములు యేమి అను విషయములో మనలో మనకు అభిప్రాయభేదములు వచ్చి గృహము కట్టలేకపోగా గృహమునకు వేసిన పునాదులనుకూడా కనుపడకుండా చేయుచున్నామా అను సందిగ్ధస్థితిలో పడినాము. అందుకుగాను శ్రీరాములవారు మనవలెనె అయోమయస్థితిలో ఉన్న భరతునకు రామరాజ్యం యేలా ఉండవలసినది రామాయణం (వాల్మీకి)లో 100 సర్గలో 76 శ్లోకములలో పరిపాలన నీతులు వ్రాశినారు. గాన ముఖ్యముగా చట్టనిర్మాణ సభికులున్ను కాంగ్రెస్‌సంఘముల అధికార్లున్ను యీ రామరాజ్యగృహనిర్మాణకర్తలు, ఉపదేశించువారే గాక, యజమానులుకూడా అయిఉన్నారు. గాన పై వారిని నేను ముఖ్యముగా కోరునది యేమన—దయచేసి రామాయణం తీసుకొని 100 సర్గ చదివి, ఆప్రకారం చేయగలవారుమాత్రం పైన సూచించిన సంస్థలలో ఉండి, ఆ ప్రకారం ఆచరించవలసినదిగానున్ను, అలా చేయనివారు వెంటనే తనుతమ అధికారస్థానములు వదులుకొనవలసినదిగానున్ను ప్రార్థన. మరియు మద్రాసు చట్టనిర్మాణసభ కాంగ్రెసు మెంబర్లలోనుంచి లీడరును, మంత్రులను యెన్నుకొనుటలో 100 సర్గ చదువుకొన్నాము అనిన్ని, ఆప్రకారం నడిచెదమని ప్రమాణం చేయువారిలోనే లీడరును, మంత్రులను నియమించవలెననిన్ని విన్నవించుకొనుచున్నాను.

మరియు, భారతములో ధర్మపాలన లేనప్పుడు దేశం క్షేమంతో పీడింపబడుననిన్ని, వర్షములు లేక పశువులకు, మేతయున్ను, పంటలు లేకపోవుటయున్ను జర్గిన దనిన్ని, ధర్మపరిపాలకులు అయిన ధర్మరాజాదులు ఉన్నచోట్ల వర్షములు కురియుట, పంటలు పండుటవల్ల కరువు ఉండదన్ని, అందుకొరకు పాండవులు యెక్కడ ఉన్నది విచారించుటలో గల విషయములను కూడా తమరు విచారించి దేశం సుభిక్షంగా ఉండుటకుగాను, బ్లాకుమార్కెట్టు, లంచగొండితనం, రేషనింగు పోగొట్టుట మొదలగు నితర కృషితోపాటు ప్రభుత్వబాధ్యతానిర్వాహకులెల్లరు ధర్మరాజాదులవలె ధర్మమూర్తులగుటకు త్రికరణశుద్ధిగా తమకు తాము సాక్షులై ప్రవర్తింప దీక్ష బూనుదురుగాక యని మనవి.

ఉ॥ ముత్తెంరాజుగారు,
కయకలూరు.

సాహిత్యమీమాంస:

తెలుగుభాష

శ్రీ బసిరెడ్డి' ఈశ్వరరెడ్డి

నన్నెచోడ, నన్నయాదుల సంతతలతపఃఫలితముగా ఉద్భవించి కృష్ణరాయలకీర్తిచంద్రికలతో విస్తరించి విశ్వవిస్తృతమైన యీ ఆంధ్రభాషా కల్పవృక్ష మహిమ నెరుగనివా రరుదు. తేనెలూరునట్టి తెలుగు కున్నట్టి మధురమైన ప్రవాహసంగీతపూర్ణమైన సాహిత్యం ఏ భారతీయ భాషలోనా లేదు. అనేక భారత భాషలు వయస్సులో తెలుగుకంటే పెద్దవైనా సౌష్ఠవంలో మధురత్వంలో పదబంధపేశలత్వంలో ఆంధ్రమునకు సాటిరా వని విషయసామ్యం ఘటనా సామ్యం సందర్భసామ్యం కల యితర భాషల ప్రాచీనగ్రంథములతో తెలుగు కావ్యములను సమీక్షచేసి పక్షపాతరహితుడైన ఏ విదేశీయుడైనా ఒప్పించవచ్చును. తిక్కనయొక్క తియ్యదనమునకు పోతన్న భావుకత్వ మాధుర్యమునకు, శ్రీనాథ కవితా కళానైపుణ్యమునకు ముగ్ధులు కానివా రెవ్వరు? ప్రాచీన సాహిత్య ప్రేరణతో మనం ఆధునికమైన తెలుగును సకల విషయ సమృద్ధముగా చేసికొనవలెను. ముందుగా మన భాషలోని లోటు తెలిసికొనడమునకు ప్రయత్నించవలెను.

తెలుగులో సాక్షాత్మకమైన స్వతంత్ర రచనలు తక్కువ. విదేశీయ సాహిత్యమును పరిశీలిస్తే సమీక్షాత్మక గ్రంథముల అవసరం తేటతెల్లము కాగలదు. షేక్స్పియర్ గ్రంథములపై ఎన్ని వేలు సమీక్షాగ్రంథములు వెలువడినవో అనూహ్యం. రచనయొక్క మంచిచెడ్డలు, రచనలోని ఉత్తమత్వం, ఉపయోగిత్వమును తెలిసికొనడమునకు పాఠకుని జిజ్ఞాసాపూర్తికి విజ్ఞాన వికాసమునకు సమీక్షలూ సమాలోచనలూ అత్యవసరం. కావ్యం సృష్టివైచిత్ర్యాన్నీ, సమీక్ష కావ్యవైచిత్రమునూ విశదీకరిస్తుంది. సమీక్షలూ విమర్శలూ సామాన్య మానవ సంస్కారమునకూ ఉత్తమ సాహిత్యసృష్టికీ తోడ్పడును. సరియైన సమీక్షలు చెత్తసాహిత్యమును నిరోధించుటకూ లేకున్న చెత్తసాహిత్యంపై సామాన్య పాఠకునకు గల మమతను సంస్కరించడమున కుపయోగించును. సంస్కృతంలో కావ్య ప్రకాశం, సాహిత్యదర్పణం మొదలగు అనేక గ్రంథములు విస్తృత వివేచనా పూర్ణమైయున్నవి. తెలుగులో రచన రచయితయొక్క అంతఃసలమును విశదంగా ప్రగాఢంగా వివరించు సమీక్షలు తక్కువ పత్రికల్లో పదిపది పంక్తుల్లో చేయబడు సమీక్ష అసంపూర్ణమైనది. పుస్తకాల్లో పేరికల్లో చేయబడు సమీక్షకూడా అసంపూర్ణమైనదే వ్యక్తి దూషణ లేకుండా విషయవివేచనాత్మకమైన గ్రంథములు నేడెంతో అవసరం.

నేడు తెలుగుసాహిత్యంలో కథాభాగం మాత్రమే అత్యంతముగా వృద్ధిజెందినది. గీత సాహిత్యంకంటే కావ్యసాహిత్యంకంటే నవలా సాహిత్యంకంటే కథాసాహిత్యమే అతి వేగంగా అతి విస్తృతంగా పురోగమించినది యిది ఆనందించదగిన విషం కానీ ఆరంభంలోని భారతి మొదలగు పత్రికలలో ప్రచురితమైన కథలలో వైలక్షణ్యం ప్రతిభాతత్వం గోచరించినా నేటి కథలలో అంతటా ఒకేవిధం ఒకేప్లాట్ ఒకే ఘటనాక్రమం కన్పిస్తున్నది. ప్రతిభావంతులైన చలం, సౌరీస్, మునిమాణిక్యంవంటి కథాకారులూ లేకపోలేదు. మణిమాణిక్యంలో గృహస్థజీవన యథార్థచిత్రణా, చలం రచనల్లో సంఘసంస్కరణ విద్రోహాత్మక తీవ్రత్వం యిట్లే ప్రత్యేకతలు గల్గిన కథాకారులూ ఉన్నారు. కాని పత్రికల్లో వెలువడు కథల్లో చాలాభాగం పెద్దపట్టణాల్లోని ఆఫీసు గొడవలు, కాలేజీ ప్రణయములు మినహాయిస్తే మరేమీ ఉండదు. ప్రేమచంద్ లోని మన స్తత్వం సౌరీస్ బాపిరాజులలోని భావుకత్వం నిపుణత్వం యింకా ఎక్కువ కావలసియున్నది. ఎంత గంభీరవిషయమునైనా ఎంత నీతినైనా ఎట్టి సమస్యనైనా ప్రజాసామాన్యమునకు సుబోధకం చేయుటకు కథలే ముఖ్యసాధనము. మద్రాస్ లోని ఆఫీసు గొడవలు రైలుప్రయాణంలోని వింతలు కాలేజీ కులాసాలు మాత్రమే చరమధ్యేయంగా భావించు కథాకారు లీ విషయమును గమనించి ఒకటే రొకటిపాటను మానుకొనవలెను. కాలేజీ ప్రణయం, సంఘాన్ని తిట్టడం, ఆత్మహత్యా మాత్రమే సర్వస్వం కాజాలదు. కామం క్రోధం లోభం మోహం మొదలైన మానవుని మౌలిక (*original*) ప్రవృత్తులను నిపుణంగా చిత్రించునట్టి కథలే అత్యుత్తమమైనవి. సామాన్య కథకులు మాత్రం ఘటనాప్రధానమైన కథల నుంచీ యింకా పైకి పోలేదు. ప్రేమ, కామం మాత్రమే గాక కథల్లో, ఘృణ, లజ్జ, మదం, ఆక్రోశం మొదలగు మనః ప్రవృత్తులుకూడా ప్రజల నెక్కువ ఆకర్షించును. అనేక సామాన్య కథకులు ప్రేమను కామమును అభిన్నములుగా భావించడము విచారకరమైనదనడం అప్రస్తుతం కా దనుకొంటాను. పత్రికల్లో తమ కథలు పడవలెనను అపేక్ష, సంస్కారశూన్యమైన రచనా వ్యామోహమే మన కథలు కొంతవరకూ నీరసముగా ఉండడమునకు ప్రధానకారణ మని నా భావన. యిట్టి స్వల్పలోపము లెన్నియున్ననూ తెలుగుకథల భవిష్యత్తు ఉజ్జ్వలమైనది. దానికి సూచన లనేకమున్నవి.

యిక నవలా సాహిత్యంలో ఉత్తమ సాహిత్యంతో బాటు చెత్తసాహిత్యం కూడా కావలసినంత వృద్ధిజెందినది అట్లే ప్రస్తుతం డిటెక్టివ్ నవలల ప్రభావం తగ్గిపోయిననూ తద్గురకం సాంఘికనవలల ప్రభావం మాత్రం తగ్గలేదు. ప్రపంచంలోని ఏ నవలలతోనైనా పోటీ చెయ్యగలిగిన మాలపల్లి, వేయిపడగలు, తుపాకీ వంటి నవలలు మన కున్నవి నవలా రంగంలో అనవాగాల పొంగుమాత్రం యింకా తగ్గలేదు. ఉత్తరయిండియాలోని ప్రతి చెత్త రచనా తెనుగులోనికి అనువదించబడడం మా దురదృష్టం. విస్తృతవిషయ చిత్రణ పాఠకునిపై చిరస్థాయియైన ప్రభావం కల్గించుటకూ ప్రాచీన ప్రబంధములవలె రసపరిపాకమును కల్గించుటకు నవలయే సాధనము. కథ ఒక శీకరము, మెరపుతో పోల్చబడితే నవలను చిరశైతల్యాన్ని కల్గించే మందానికితో సరిపోల్చవచ్చును. బహుజ్ఞతయే నవలాకారుని కుండవలసిన సుగుణము. సజీవమైన పాత్రలతో సూక్ష్మమానసికవిశ్లేషణతో ప్రవాహపూర్ణమైన, కథాక్రమంతో రచియింపబడిన నవల ఘటనా వైచిత్ర్యం లేకున్ననూ ఉత్తమమైన దనబడును. ప్రతిభావంతులైన ఆంధ్రనవలాకారులలో బాపిరాజు ముఖ్యుడు. తెలుగులోని ప్రముఖ నవలాకారులందరూ తమ క్షేత్రంపైననే దృష్టిని కేంద్రీకరించవలెనని నా వినతి

గీతిసాహిత్యం బహుముఖంగా విస్తరిస్తున్నది జానపదగేయాలుకూడా అక్కడక్కడ ప్రచురించబడుచున్నవి. గీతిసాహిత్యమునకు జానపదగేయములే జీవకఱ్ఱవంటివి. నేడు ఆధునికకవులెక్కువగా పల్లెటూరి పాటలనే అల్లుతున్నారు. ప్రథమంలో భారతిలో ప్రచురించబడిన తురగా వెంకట్రామయ్య మొదలగువారి గీతములు మరపురానివి. జానపద గీతములు అభిజాత్య గీతములు ద్వారా గీతిసాహిత్యంలో ప్రముఖస్థానమును సంపాదించినది. యీ సందర్భంలో ఎంకి పాటలూ, కిన్నెరసాని పాటలూ మరపురానివి. పూర్వకాలంలోవలె శాస్త్రీయతను పాటిస్తూ దీక్షితులూ శ్యామాశాస్త్రులవలే గీతములు వ్రాయువా రిప్పుడు లేరు. నేడు శాస్త్రీయ సంగీత బద్ధమైన గీతములను వ్రాయవలసిన అవసరం కూడా లేదు. కానీ పాటలలో ఒక వ్యవస్థా, ఒక చరణక్రమం ఉండవలసిన అవసరం కలదు. పదక్రమం చరణక్రమం లేని పాటలు ఎంత గొప్ప భావములతో నిండినా ప్రజల్ని ఆకర్షించవు. నేడు పత్రికలలో ప్రచురించబడు గేయములు, అవి పాటలో పద్యములో కూడా తెలియదు. ఒక క్రమాన్ని అనుసరించిగానీ, చివరకు లయ ననుసరించియైనా పాటలువ్రాయలేనివారు గద్యంలో వ్రాయడం మంచిది. జాతీయ గీతములను కూడా హిందీ ట్యూన్ల ననుకరిస్తూ వ్రాయవలసిన దుర్గతి ఎప్పుడు విడిపోవునో తెలియదు. మృతభాష యనబడు సంస్కృతములోని జయదేవుని కీర్తనలను ఎప్పుడూ రేడియోలద్వారా వింటూనే ఉన్నాం. సంస్కృతం మృతభాషా కాదు. ఉత్తమ గీతములకు వినాశమూ లేదు. ఓపిక గల పండితులు విశాలాంధ్రదేశములోని జానపద గేయములను సంపాదించి పుస్తకరూపంగా ప్రకటిస్తే ఎక్కువ ప్రయోజన మున్నది. సుమంగళిలోని "దేట్రాయిస్వామిదేవుడా" వంటిప్రాచీన జానపద గీతములు ప్రజల నెంతగా ఆకర్షించునో మా కడరి, మైసూర్ ప్రాంతగ్రామీణుల పరిశీలించిన తెలియగలదు రవీంద్రుని రహస్యాత్మక గీతప్రచారం యితర ప్రాంతములవలె మనభాషలోనికి ఎగ్రాకలేదు. యిది మంచిదే. ప్రజాసామాన్యానికతి సన్నిహితంగా ఉండవలసిన గీతి సాహిత్యంలో ఛాయావాద రహస్య వాదములు మన కనవసరం.

ఆధునిక కవిత్వంలో కావ్యములకంటే ఖండకావ్యములూ ముక్తక పద్యములే యెక్కువ. యితరపద్యములపై ఆధారపడక స్వతః సంపూర్ణమై ఏదో ఒక ఘట్టాన్ని మాత్రమే వివరించు పద్యసంపుటములే నేడెక్కువ. కానీ విస్తారంగా కథను వర్ణించే కావ్యములు చాలా తక్కువ. దశకుమార చరితం వంటి పెద్ద కథలకంటే చిన్న కథానికలకే ప్రాధాన్యమెక్కువ. నాటకముల కంటె ఏకాంకికలకే ప్రచారంఎక్కువ. ఏమిటో కారణం? బహుశా నేటి పాఠకులు తక్కువ కాలంలో ఎక్కువ మనోరంజనకు ప్రయత్నిస్తారు కాబోలు. ఆధునికాంధ్ర రచయితల్లో మహాకవులున్నారు, శివశంకరశాస్త్రి, రామిరెడ్డిల మధురకవిత్వం ఎప్పటికీ మరపురానిది. సమ్మోహకమై విప్లవాగ్నిని రగుల్కొల్పే రచయితలు కూడా ఉన్నారు. ఆధునిక కవిత్వంలో భిన్నత్వం ప్రత్యేక పోకడలు ప్రచురంగా కన్పిస్తున్నవి. వివరించడం కష్టం. మన ప్రాచీనకావ్యసాహిత్యం అతిగౌరవపూర్ణమైనది. ఆ గౌరవమునకు వారసురాలైన నేటి కావ్య సాహిత్యం కూడా యోగ్యతాపూర్వకంగా తన ఉత్తర దాయిత్వమును నిలబెట్టుకొనుచున్నది. అనుపార మందాకినివలె సంతతరసోద్రేకాన్ని కల్గించు కావ్యములు నేడు తక్కువైననూ క్షణికంగానైనా రసోద్రేకమును కల్గించు నెలయేళ్లవంటి ముక్తక పద్యములు పద్యమయవ్యాసములవంటి రచనలూ మనకు కొల్లలుగా ఉన్నవి. నేటిపద్య రచనలో ప్రాచీన సరసత్వం తక్కువైననూ కాలానుగుణ్యమైన భావోన్నతత్వం ఆలోటును పూర్తిచేస్తున్నది. తెలుగు భాషలోని కావ్యాంగము కూడా పరిపుష్టమైన దని ఒప్పుకొనక తప్పదు.

ముఖ్యముగా శాస్త్రీయ గ్రంథాభావమే తెలుగుభాష కున్న లోటు. గణితం జ్యోతిషం, విజ్ఞానం, పదార్థ తత్వజ్ఞానం మొదలగు విషయములు సాహిత్యంలో చేరకపోవచ్చు. పాఠకుల నానందప్రవాహంలో తన్మయులను కావించకపోవచ్చును. కానీ యీ నాడు ఏ భాషలోనైన శాస్త్రీయగ్రంథములు లేకున్న అది మృతభాషతో సమానమేగదా. నేడు తెలుగు మాత్రమే తెలిసిన పాఠకునకు ప్రపంచంలోని శాస్త్రీయ, సాహిత్యక విషయములను కూలంకషముగా తెలిసికొనుటకు సాధ్యపడకపోవచ్చును యితర ప్రాంతములలోని శాస్త్రీయ విషయనిపుణులు ఎక్కువగా తమ ప్రాంతీయభాషల్లోనే శాస్త్రీయగ్రంథములు రచింతురు. కొన్ని భాషల్లో సాహిత్యగ్రంథములతో సమానముగా శాస్త్రీయగ్రంథము లున్నవి. ఆంధ్రదేశములోని ప్రొఫెసర్లంతా వైజ్ఞానికవిషయములను సామాన్య పౌరుడుకూడా తెలిసికొనుటకు వీలుగా ఆంధ్ర భాషలోనే విజ్ఞాన గ్రంథ రచనకు పూనుకొనవలె నని నా మనవి. దేశాభివృద్ధికి నేడు శాస్త్రీయ జ్ఞానమే అత్యవసరమైనది.

పాశ్చాత్య దేశములలో వైజ్ఞానికవిషయములు పిల్లలకుకూడా గ్రాహ్య మయ్యేట్లుగా అనేక వైజ్ఞానిక గ్రంథములు రచించబడినవి. అక్కడ బాలురుకూడా వాటిని ప్రేమతో చదువుదురు. మనం వైజ్ఞానిక విషయజ్ఞానమునకై ఆంగ్లగ్రంథములపైననే ఆధారపడియుండడం శోచనీయమైనది. ఆంగ్లంలో వ్రాయబడిన న్యూటన్ సిద్ధాంతములు డార్విన్ పరిణామవాదము మొదలగు విషయములను తెలిసికొనడం వాటిని మననం చేయడం స్వల్పాంగ్లజ్ఞాతలైన విద్యార్థులకు కష్టముగా ఉండును. సామాన్యవిజ్ఞానసూత్రములనూ, నూతనావిష్కారములనూ తేలికగా తెలియజేయు గ్రంథములు నేటి ప్రజానీకమున కెక్కువ అవసరం.

నేడు ప్రముఖాంధ్రరచయితల దృక్పథములనూ విశేషములనూ వివరంగా వెల్లడించే సమగ్రమైన పుస్తకములు మనకవసరం. విభిన్నవిషయాల్లోని పండితులతో కవులతో పండితులతో కళాకారులతో తెనుగులోని విభిన్నరంగములలోయింత వరకూ జరిగిన పురోభివృద్ధిని సమీక్షించువ్యాసములను వ్రాయించవలెను. నన్నయకాలంనుంచీ నేటివరకూ జరిగిన వికాసమేగాక ఆధునిక రచయితలఆదర్శాలు కూడా వివరించబడవలెను. అట్లయిన యెడల సామాన్యప్రజానీకమునకు అత్యవసరంగా



10 వ తేదీ ఆదివారము గవర్నరుజనరల్ రాజగోపాలాచారిగారు పరిషత్తు సభ్యులకు అల్పాహారవిందు చేసిరి.

విదేశీయుల నీ దేశము నాకర్షింపజేసిన దేది? భారతీయుల నాగరికత. పారిశ్రామిక విజ్ఞానము, వాణిజ్యము. సాంఘిక, మత, ఆర్థిక, రాజకీయ వేదాంతశాస్త్ర సూత్రముల సునిశిత వివేకము విజ్ఞానము మొదలగునవి. "పూర్వప్రతిష్ఠ గడించినట్టియు, ఇటీవల విఖ్యాతి గాంచిన, జాతులన్నిటిలోను భారతీయు లగ్రగణ్యు లనియును, వారి నాగరికత అతిప్రాచీనమైన దనియును అనుట నిర్వివాదాంశము. కాలానుగుణ్యమగు వివేకమును ప్రజలలో వ్యాప్తి నొందించుట కనువగు విద్యానిలయములిం దనేకము లుండెడివి. జీవితములను వెళ్లబుచ్చుకొనుట కిరవగు వృత్తులనేగాక, విజ్ఞానోదయాస్పదమగునట్టి, నిష్కళంకములగు కళల ననేకములను క్రీస్తుశకమునకు పూర్వమే తెలిసికొని, వాటి నాచరణలో బెట్టి, జయప్రదముగా నిర్వహించుచుండి రనుటకు నిదర్శనము లనేకములు కలవు. శరీరాయాసము నుండి విరమించి, మానసికవిశ్రాంతి నొందదలచి, యాముష్మిక విద్య నభ్యసింపదలచిన వారికి ప్రోత్సాహజనకములగు సావకాశములు, సదుపాయములు సునాయాశములగునవి పెక్కులుండెడివి. పాశ్చాత్య నాగరికత కాదర్శప్రాయమగు గ్రీసు, ఇటాలియన్ దేశములందలి ప్రజలు, ఈజిప్టుదేశములోని, నైలునదీ పరిసరములందున్న పిరమిడ్సు అను గోరీలను అత్యంతాశ్చర్యముగా విలోకింప కుతూహలపడు కాలమునాటికి, భారతదేశము అటివాటికంటె ఆశ్చర్యజనకములగు వింతల ననేకములను కలిగియుండి రపత, కాంచన రత్నరాసులకు సాటిలేని మేటిదై అష్టైశ్వర్యములతోను తులదూగుచుండెడిది. పలురకముల పరిశ్రమలకు నిలయమై యున్నదనుటకు నిదర్శనముగా, దేశమందంతటా కదలిక గలిగినట్టియు సోమరితన మననేమో యెరుంగని పారిశ్రామికాభిలాషులగు ప్రజాసముదాయముచే నావరింపబడి యుండెడిది. ప్రాణికోటి జీవనాధారమున కావశ్యకమగు వివిధ రకముల పదార్థములను కర్షకు లతిజాగరూకతతో, నుత్సాహపూరితులై భూమిని సేద్యము జేసి పండించుచుండెడివారు. దేశమునం దుత్పత్తియగు ముడిపదార్థముల నతిసొగసుగాను, నాణ్యముగాను, ఉపయోగార్హముగా నుండునట్లు మార్పొదవించి, రూపమేర్పరుప గల కళాపారంగతులగు ప్రతిభాశాలురు పెక్కండ్రుండెడివారు. వేలకొలది సంవత్సరములు దేశ మరాజకస్థితియందున్నను శిథిలమొనరింపవలనుండని కట్టడములను నిర్మింప సమర్థులగు శిల్పశాస్త్ర ప్రవీణులు లెక్కకు మిక్కుటమై దేశమునం దన్ని భాగములందును లభించెడివారు. సృష్టివైచిత్ర్యములను చూచినవి చూచినట్లు చిత్రింపగల చిత్రకారులు దేశమునందు పలుతావుల వేనవేలుండెడివారు. రాజులు, రాజబంధువులు. తదితరరాజ్యములందలి వారివలె దేశద్రిమ్మరులై అజ్ఞాతవాసము జేయ జూచువారివలెగాక, స్థిరావాసముల కలవడి, స్ఫటిక, మణిమయ నిర్మితములగు శుద్ధాంత సౌధములందు నివసించుచు, స్వీయదేశపు మగ్గములపై నేయబడినట్టియు, బంగారు జలతారులతోను, రత్నములతోను, కనులు మిరుమిట్లు గొలుపునట్లు అలంకరింపబడిన దుకూలాంబరములను ధరించి మృగరాజులవలె స్వేచ్ఛానువర్తులై సంచరించుచుండెడివారు. చారిత్రాత్మకములగు తమ పూర్వుల చరిత్రలను పరిశోధించి కావ్యరూపకముగా గ్రంథస్థములు గావింపగల ఉత్తమ కవి సత్తములనంతముగా నుండెడివారు. ఆ కాలపునాటి వేదాంతుల తత్వపరిశోధన లీ కాలపువాటికంటె వీర్యవంతములును, తేజో

ఒకక్రమం లేనట్లు కన్పించు ఆధునిక సాహిత్యమును అవగతం చేసికొనుటకు వీలగును. ఉత్తమ పత్రికాసంపాదకు లెవ్వరైననూ పై విశేషములతో కూడిన ప్రత్యేక "తెలుగు సాహిత్యసంచిక" ద్వారా ఆంధ్రప్రజలకు అశేషసహాయం చేయవచ్చును. అట్లు చేసినయెడల ఎవరు భావకవియో, ఎవరు అభ్యుదయకవియో, ఎవరు ప్రాచీన పరిపంథియో తెలిసికొనుటకు వీలగును. ఏకైకాంధ్ర సాహిత్యపత్రికయైన భారతి సంపాదకులవంటివారు ఆధునికాంధ్రసాహిత్యసంచికను ప్రచురించి మన ఈ కలను యథార్థం చేయగల రని ఆశిస్తాం.

రాజ్యాంగము - అర్థనీతి

శ్రీ యద్దనపూడి వెంకటరత్నం

వంతములును, భావగర్భితములై యలరారుచున్న వనుటలో అతిశయోక్తి యిసుమంతయును లేదు. ఈ నా అభిప్రాయములన్నియు వూహాజనితములు గాక లిఖితరూపకమగు నాధారములు కలవని, "హిందూదేశమందలి బ్రిటిషు సామ్రాజ్యము" అను గ్రంథరచయితయగు సర్ ఎడ్వర్డుధారన్ టిన్ వారు. 1859 సంవత్సరమున పునర్ముద్రితమునందు వివరించియున్నారు. ఇదేవిధముగా భారతదేశము యొక్క హెరిడోటస్, డియోడరస్, మార్కోపోలో, స్ట్రాబొన్, మాక్సు ముల్లర్, రోమెన్‌రోలాండు మొదలగుపాశ్చాత్య చరిత్రకారు లొక్కొక్క విషయమును గురించి ఒక్కొక్కరు వినుతించియున్నారు.

ఏమయిన దీ ప్రతిభ అంతా?

క్రీ. శ. 10 వ శతాబ్దము నాటికి వెండిబంగారాలు మొదట త్రోవతీయడం ప్రారంభించాయి. అదివరకు వాటంతటవి దొరలించ్చేవి, చెప్పకుండా జారిపోవడం మహమ్మదుఘుజనీ, ఘోరి, తామర్లేను, నాదర్షాలు, ఏనుగులమీద, ఒంటెలమీద వేసి తరలించుకొని పోయారు. తరువాత మొగలాయి సామ్రాజ్య మేర్పడి స్థాయి భావము దాల్చి తేనెటీగలలాగున కూడబెట్టారు. వీరి హయాంలో పాశ్చాత్యు లీ దేశమందు ప్రవేశించారు. వీరిలో ఈస్టిండియాకంపెనీవారు స్థిరపడి, మొగలాయీలు కూడబెట్టిన దానిని, పట్టపగలు కొల్లగొట్టి కంపెని వుద్యోగస్థులు వారిలో వారు పంచుకున్నారు. వీరి హయాములో, విదేశముల నుండి భారతదేశమునకు వచ్చే వెండిబంగారముల మార్గములు పూడిపోయినాయి. అంతవరకు సంచితము చేసి నిలువయుంచబడిన నిధులు అదృశ్యమైనాయి. తరువాత 1856 సిపాయీల పితూరీ వచ్చింది. దీని నణచుటకు ద్రవ్యము కావలసి వచ్చినది. ఇంగ్లాండునుంచి రాదు. భారతదేశములో లేదు. ఈ ద్వందం కనుపెట్టి, ఈస్టిండియా కంపెనీవారు, మెల్లగా ఈ దేశమందు వారు అప్పటికి సంపాదించిన రాజ్యమును, ఇంగ్లాండు రాజుగారికి పౌ. 630,000 ల అప్పుతో స్వాధీనపరచినారు.

అధోగతి ప్రారంభం

అది లగాయతు, వెండిబంగారములను బయటకీడ్వడం ప్రధానలక్ష్యముగా బెట్టుకొనక, భారతీయుల ప్రాచీన విభవమునకును, విఖ్యాతికిని ఆకరమగు వనరను పూడ్చిపెట్టి, వాటివాళ్లను తమజాతికి సంక్రమింపజేయు సాధన సంపత్తి నరయుటలో నిమగ్నులైనారు. భారతీయులలో అర్థశాస్త్రపారంగతు డని వాసిగాంచిన కౌటిల్యునివంటి అర్థశాస్త్రజ్ఞు డొక డవతరించినాడు. అతని పేరు ఆడస్మిత్తు. ఇతని అర్థశాస్త్ర సూత్రములు వెల్తు ఆఫ్ నేషన్సు అను గ్రంథమునందు గ్రంథస్థము గావింపబడినవి. ఇతని గ్రంథమునందలి సారాంశమేమనగా, ప్రాచ్యదేశములందు తులమెత్తు బంగారము వెలువడిందా, దానిని పాశ్చాత్య దేశములకు చేరవేయు విధానములు, ఒకప్పుడు చేరిన వెండి బంగారములు తిరిగి వెడలిపోకుండ నిలువయుంచుట కవలంబింపవలసిన చర్యలకు సంబంధించిన సూత్రాలు. వీటి నన్నిటిని ఆకాలపు యువకులు లెస్సగ హృద్గత మొనరించుకొని, ప్రపంచమందలి వివిధదేశములను తిరిగి తమ సిద్ధాంతముల నాచరణలో బెట్టినారు. తద్రీత్యా చాలవరకు సంకల్పసిద్ధి పొందారు. ఇప్పుడు ప్రాచ్యదేశాలలో కన్నుపొడుచుకున్నా వెండిబంగారములు కనుపించవు పాశ్చాత్యదేశములం దట్లుగాక, హిట్లరు ప్యారిసు పట్టుకున్నాడంటే, ముందుగా ఖజానాలోని వెండి బంగారములను ప్రత్యేకరైళ్లమీద బెర్లినుకు కొనిపోయాడని వార్త వెలువడింది—భారతదేశమునకు బ్రిటిషువారి ధర్మకర్తృత్వమువలన సమకూరిన సదుపాయము.

నాణెములు

ఈస్టిండియా కంపెనివారి హయాములో యీ దేశమందు వెండి బంగారు నాణెములు ప్రచారమందుండేవి. కొంతకాలమువరకు కంపెనీవారికి ప్రత్యేక టంకసాల వుండేది కాదు. అప్పటికి భారతదేశమునందుండే వెండి రూపాయలనే, వాణిజ్య వ్యాపారములలో కొలమానముగా తీసుకుంటూయుండేవాడు. 1792 సం॥ రం॥లో కంపెనీవారికి మైసూరు యుద్ధములో టిప్పుసుల్తానుతో జరిగిన యుద్ధసందర్భములో, టిప్పుసుల్తాను కంపెనీవారికి యుద్ధవ్యయము క్రింద 3,50,00,000/-(మూడుకోట్లయాభైలక్షల) రూపాయిలు యిచ్చుటకు ఒప్పుకున్నాడు. అతడా మొత్తమునకు, తన దేశపు రూపాయిలను పంపించినాడు. వాటిని, అప్పటి వెండిధర ప్రకారం, ఖరీదు కట్టుకుంటే, కంపెనీవారికి సగానికిసగం నష్టం వచ్చింది. వెంటనే కంపెనీవారు, ఇంగ్లాండులోని తమపై అధికార్లకు వ్రాసి, వారిఅనుమతిపొంది, ప్రప్రథమమున, కలకత్తాలో నొక టంకసాలను స్థాపించుకొని, తమ రూపాయిలను ప్రత్యేకంగా ముద్రించుకుంటూ, అప్పటినుండి ప్రజలకు యిచ్చి పుచ్చుకొనుటను గురించిన వ్రాతలలో, "కంపెనీవారి వెండి" రూపాయలనే పదమును వుదాహరిస్తూ వుండేవాడు. అప్పటి రూపాయలమీద నాలుగవ విల్లియం విగ్రహం ముద్రింపబడేది. దరిమిలాను, కంపెనీవారికి బెంగాలు, బీహారు, ఒరిస్సా, జాగీర్లు సంక్రమించినతరువాత, వ్యవసాయదారులవద్దనుండి దస్తు శిస్తులు వసూలుచేయు సందర్భములలో, ఆయాపరగణాలయందుండే తమ తాశీదారులకు, కల్తీరూపాయిలు పుచ్చుకోవద్దనిన్ని, విలువలేని లోహములతో ముద్రింపబడిన నాణెములు, రూపాయి విలువకంటె యెక్కువ మొత్తాలను పుచ్చుకోవద్దనీ, మొదలైన యాదాస్తుల నందజేస్తూయుండేవారు. ఈ బాపతు 1792 లో 1802 వరకు రెగ్యులేషన్సు యొక్క ఉద్దేశములను చదివినవారికి బోధపడగలదు.

దరిమిలా సంస్కరణలు

కంపెనీవారివలన ముద్రింపబడిన వెండిరూపాయిలో 11 పాళ్లు చాదీవెండి, ఒకపాలు రాగియును వుండేది. కొంతకాలమునందు, నాణెములందలి పరిశుద్ధలోహము నెచ్చించి, నీచలోహపు మిశ్రమమును తగ్గించి తూకము సరిపుచ్చుట, పరిశుద్ధలోహమును తగ్గించి, నీచలోహపు పరిమాణమును హెచ్చించి, తూకము సరిపుచ్చి, పూర్వపు విలువే మారవలె నని శాసించుట, మొదలగు అక్రమపు విధానముల నవలంబించి, పాలితులను మోసపుచ్చసాగిరి. ఇట్టి విధానముల అవలంబనకు, ఇంగ్లాండురాజులే కారకులు. వీరిలో, ఏడవ ఎనిమిదవ హెన్రీలు, అయిదు ఆరవ ఎడ్వర్డుయరాజులగ్రస్థానము వహించినారు. ఈపననే, భారతదేశమందు మహమ్మద్ బిన్ టుగ్లకు అవలంబిస్తే అతనిని పిచ్చివాడని యాగీ చేసినారు.

"తగ్గింపబడిన నిజలోహపు విలువగల నాణెముల చలామణి, ప్రజలను దోచుకొనడముగా పరిణమించడమే కాకుండా, నిత్యవ్యవహార నిర్వహణములో చాల యిబ్బందులను కలుగజేయడమేగాక, వ్యాపారమునందు కలవరము పుట్టించి, యితరదేశమువారు, తమదేశపు నాణెములతో మనదేశపు నాణెమును విలుగట్టుకొనునప్పుడు, వారి నాణెపుముద్రను హెచ్చించి, మన నాణెపువిలువను తగ్గించుచుండుట ఘటిసించుటకు హేతుభూతమగుటవలన, యీ యిబ్బందులకు అందరును గురిగాక మానరు" అని ఒక అనుభవజ్ఞుడు అన్నాడు.

ప్రస్తుత పరిస్థితులు

మనది వెండినాణెము. నేటివరకు మన పాలి

(21 వ పేజీ చూడుడు)



అగ్నిమాపకదళంవారు మంటల నార్పి విరూపాక్షస్వామిరథాన్ని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారు.

హైదరాబాద్ కుటీర పరిశ్రమలు

(7 పేజీ తరువాయి)

చెయ్యడానికి పైఠాణ్‌లోని మగ్గాలన్నీ అయిదు సంవత్సరాలు పనిచేశాయట.

సిల్కు, తివాసీ పరిశ్రమలకి వరంగల్ ప్రసిద్ధి చెందినది. వెండి ఫీలిగ్రీపనికి కరీం నగర్ చిరకాలంనుంచి ఖ్యాతి పొందింది.

హిమ్రూ, మష్రూ :

పడుగుపేకల్లో పడుగుకి ప త్తినూలును, పేకకి సిల్కు నూలును వాడి నేసే పద్ధతి ఇక్కడ ఉంది. ఈ పద్ధతిని రకరకాలైన చారల్తో, చదరాలతో, పువ్వులతో, లతలతో వస్త్రాలు నేస్తారు.

వీనిలో పురుషులు ధరించే దుస్తుల నిమిత్తం తయారయే వానిని హిమ్రూ అనీ, స్త్రీల వస్త్రాలని మష్రూ అనీ అంటారు. ఈ పద్ధతినే జాలర్లు, జలతార్లు తయారుచేస్తారు. ఇప్పుడు జాలర్లకు గిరాకీ ఎక్కువగా ఉంది.

బంగారు, వెండి దారాలతో లతలు మొదలైన వానితో సిల్కు గుడ్డలపై అల్లి తయారు చేసే వస్త్రాల్ని కాంఖాబ్ అంటారు. వీనిని వోణీలుగా, తలపాగాలుగా కళ్యాణాది సమయాలలో వస్త్రాలుగా ఉపయోగిస్తారు. కాంఖాబ్ చీరలు కూడా నేస్తారు.

వెండి బంగారు తీగలతో చీర అంచులు పైఠాణ్‌లో తయారు చేస్తారు. ఈ అంచులకు పడుగుగా సిల్కునూలును, పేకగా బంగారు, వెండితీగలను, రంగు రంగుల నూళ్లు ఉపయోగించి వీనిని తయారుచేస్తారు. చిన్న చిన్న మగ్గాలపై బంగారు తీగతో లతలు, అజంతా బొమ్మలు వగైరా గల చీర అంచులు తయారు చేస్తారు. వీనిని సాధారణంగా చీరలకు, తలగడ గలీబులకు వాడతారు. కాని ఇప్పుడు మేజాలపై కప్పుతున్నారు. విదేశాలలో స్త్రీలు చేతి సంచులకు దుస్తులకు ఉపయోగిస్తున్నారు. వీనిలో కొన్ని చిన్న ముక్కలు కూడా వేల రూపాయల ఖరీ దుంటాయి.

బంగారులేసులు :

పైఠాణ్, ఔరంగాబాదులలో బంగారు లేసులు తయారుచేసే విధం చిత్రంగా ఉంటుంది. పైనుంచి కిందివరకూ చిల్లులు గల ఏడేపె అంగుళాల వెండి కడ్డీలను ఉక్కుపలకలో తాపి, ఆ చిల్లులలో నుంచి బంగారు కడ్డీలను సాగదీసి సన్నతీగగా చేస్తారు. చిన్న బంగారు ముక్కల్ని వెండి ముక్కల్ని ఈరీతిగా వందలాది అడుగుల పొడవుకు సాగదీస్తారు. బాగా సన్నగా సాగిన తరువాత వీనిని కాంఖాబ్‌పై బ్రొకేడ్ పనికి ఉపయోగిస్తారు.

ఇవిగాక ఆరమూరు సిద్దిపేటల సిల్కు పీతాంబరాలు, నారాయణపేటలో తయారయ్యే బరువైన అంచులుగల చీరలు, కొప్పాల్, కిన్వాల్, గుల్బర్గా, నారాయణపేటలలో తయారయ్యే చోల్కన్లు (లతలుగల రంగు రంగులలో రవికెలు లేక బాడిస్‌లు), సంగారెడ్డి సిల్కులు, జాల్నా సిల్కు చీరలు కూడా ప్రసిద్ధి కెక్కినవి. వరంగల్, నల్లగొండ జిల్లాల్లో బుందానీ రుమాళ్లు తయారవుతాయి. అద్దకాలలో దుప్పట్లు, మేజాగుడ్డలు, తెరలు, జంపకానాలు, చీరలు కూడా ఉన్నాయి. సంగారెడ్డి సిల్కు చీరలు డిజైన్లకు ప్రసిద్ధి కెక్కినవి.

వరంగల్ తివాసీలు, కంబళ్లు భారతదేశంలోకెల్ల నాణ్యమైనవి. యూరప్‌లో పారిశ్రామిక ప్రదర్శనాల్లో ఇవి చాలా కొంటారు. 1851 లో ఇవి ప్రపంచంలోకెల్ల మేలైన వని లండన్ ప్రదర్శనంలో చెప్పబడింది. తివాసీల నేత ముఖ్యంగా షేక్‌ల వృత్తి. వీరు పర్షియా దేశంనుంచి వచ్చినవా రని ప్రతీతి. వరంగల్ తివాసీలు, సిల్కు, ఊలు, ప త్తినూళ్లతో తయారవుతాయి. కంబళ్లలోనూ, తివాసీలోనూ బలమైన ప త్తినూలు మధ్య మధ్య రంగు ఊలుతో బిగించి నేస్తారు. తివాసీలపై డిజైన్లన్నీ పర్షియా రీతి ననుసరించినవి. పొడుగు 15 గజాలవరకూ ఉంటుంది. గజంనుంచి ఆరుగజాలవరకూ వెడల్పుంటుంది. చాకరకం కంబళ్లుకూడా ఇక్కడ తయారవుతాయి. మహబూబ్‌నగర్, మక్తల్ పట్టణాలలో దుప్పట్లు ప్రసిద్ధి.

బీదర్ పాత్రలు:

దక్కన్‌లో వెండి బంగారాల పనిలోకెల్ల బీదర్ పాత్రలపని అద్భుతంగా ఉంటుంది. ఈ పాత్రలకు నల్లనిచదునుపై వెండి నగిషీలు, చిత్ర విచిత్రాలైన బొమ్మలు ఉంటాయి. వీనిలో అనేకరకాల డిజైన్లు ఉంటాయి. బీదర్‌కోటలో ఆభరణాలే చాలవరకు వీనిమీద వేస్తారు. జంతువుల బొమ్మలు అట్టే ఉండవు. కాని నీటికి వాడే పాత్రలపై చేపల బొమ్మలు చాలాకాలంనుంచి వేస్తున్నారు.

ఈ పాత్రల్ని తుత్తునాగం, రాగి కలిపిపోసిన లోహంతో తయారుచేస్తారు. బీదర్‌లో దొరికే ఒకరకం మట్టితో తోమితే ఈ లోహానికి చిత్రమైన నలుపురంగు వస్తుంది. తుత్తునాగం రాగి కలిపి పోసిన లోహంతో పాత్ర తయారుచేసి, వెండి బంగారాల లతలు వానిపైన పొదివి మెరుగు వేస్తారు. తరవాత పాత్రను కాల్చి దానిపైన బీదర్‌లో దొరికే మట్టితో మెరుగుపెట్టితే పాత్ర అంతా నలుపెక్కుతుంది. వెండి బంగారాల లతలు మెరుస్తాయి.

పుష్పగుచ్ఛాలు అలంకరించే పాత్రలు, పెద్ద పళ్లేలు, సిగరెట్టుపెట్టెలు, భరిణలు, కంకణాలు, బొత్తాములు, చిన్నగిన్నెలు, మొదలైన అనేక చిన్నపాత్రలు వీనితో తయారుచేస్తారు.

కరీంనగర్ ఫిలిగ్రీపని :

ఫిలిగ్రీపనికీ, తీగపనికీ కరీంనగర్ అనాది నుంచీ పేరు పొందింది. ఈనాడు అపురూపమై పోయింది. అక్కడక్కడ మిగిలిన కొద్దిమంది నిపుణులే ఈ పని ఇప్పుడు చేస్తున్నారు. వెండి తీగతో అనేకరీతుల అనేకడిజైన్లు తయారు చెయ్యగలరు.

సంస్థానంలో ఆటబొమ్మల తయారీ చురుగ్గా ఉంది. దీనివల్ల ఆవృత్తిదారులుకూడా బాగా ధనార్జన చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ వీనికి ప్రసిద్ధి. ఈనాడు నిర్మల్ ఆట బొమ్మలు సంస్థానంలో ప్రతిచోటా కనిపిస్తాయి. కర్ర కాగితం చేర్చి, కర్ర మన్ను చేర్చి వీనిని తయారుచేస్తారు. ఇవి అతిసున్నితంగా ఉంటాయి. సున్నితమైన వివరాలుకూడా చక్కడం తీర్చి దిద్దుతారు. జంతువులు, పక్షులు, పువ్వులు, గ్రామసీమ మొదలైనవి ఈ బొమ్మలకు విషయాలు. హైదరాబాద్ సంస్థానంలో ఏటాలక్షల రూపాయల విలువగల బొత్తాములు తయారవుతాయి. వీనిలో బీదర్‌లోహంతోను, ముత్యాలతోనూ తయారయేవి చక్కగా ఉంటాయి. బంగారు, వెండి లోహాలతోనూ, కొమ్ము, ఎనామెల్ తోనూ కూడా బొత్తాములు తయారు చేస్తారు.

దంతపరిశ్రమకూడ ఇక్కడ కుటీరపరిశ్రమల్లో పేరుపొందింది. కొమ్ముతో బొత్తాములు, దువ్వెన్న లేకాక ఇతరవస్తువులుకూడా కొన్ని తయారుచేస్తారు.

వేముకుర్చీలు, సోఫాలు, మేజాలు, బుట్టలు మొదలైనవన్నీ ఇక్కడ కుటీరపరిశ్రమలే. రాయచూరు, బీదర్, హైదరాబాదు నగరాల్లో తోలు పరిశ్రమ ఉంది. బీదర్‌లో నీటిపాత్రలు తయారవుతాయి. ఇటువంటివి భారత దేశంలో మరెక్కడా లేవు.

[హైద్రాబాద్ ప్రభుత్వసమాచారపత్రిక నుంచి]

ఉస్మానియా విద్యాశాఖ

(10-వ పేజీ తరువాయి)

దారుణముగా నుండును. పి. డబ్లియు. డి. శాఖవారు చాలా ఉదారతతో ఈ అద్దెలను నిర్ణయించిరి. ఈ భవనములను ఖాళీచేసిన, బోలెడు ధనము ఆదాయమగును. చివరకు పరీక్షలలో విద్యార్థులపై కాపుదలయుండుటకు కూడా హిందూ ఉపాధ్యాయులు పనికిరారు! ఏదో లాంఛనముగా నల్గురైదుగురు హిందూ ఉపాధ్యాయుల నేరుదురేమో—

నిమ్న జాతుల విద్య అని ఇంతవరకు చేసినది చాలును. నిమ్మజాతులకు ప్రత్యేకముగా స్కూళ్లనవసరము. హరిజనులను హిందువులనుండి పూర్తిగా విడదీసి, మెల్లి మెల్లిగా ముస్లిం మతములోనికి మార్చుటకు పెట్టిన శాఖ ఇది. పైగా ఇట్టి ప్రత్యేకపు స్కూళ్లనుపెట్టుట ప్రజలకు తీరని అవమానము. వీటిని వెంటనే తీసివేయవలెను. ఆదిమవాసుల సంగతియూ నింతియే.

పరదా విద్య :


ఇక చివరకు స్త్రీవిద్య. స్త్రీలకున్న విద్యా సౌకర్యములే అసలు చాలా తక్కువ. ఉన్న కొలది సౌకర్యములుకూడా పక్షపాత హృదయముతో చేయబడినవి. ఉన్న 38 ఆడ గజెటెడ్ ఆఫీసర్లలో నల్గురే హిందువులు. అందులో ఒక్కరే ఆంధ్రులు అని పేరునుబట్టి తోచుచున్నది. ఈ ఆడగజెటెడ్ అఫీసర్లలో అనేకులు పెద్దపెద్ద ప్రభుత్వసేవకుల చుట్టములే—లేక స్నేహితురాండ్రు. విద్యార్థినులలో నూటికి అరవై వంతులు ముస్లిములే. అసలు స్కూళ్లను చూచినచో అవి ముస్లిములకేనని బోధపడును. తాటిచెట్టెత్తు ప్రహరిగోడ లెందుకీ స్కూళ్లకు! ఉస్మానియా విశ్వవిద్యాలయపు గదులలో, విద్యార్థినులకు పరదాభాగము లున్నవి! ఏ సౌకర్యము జరిగినను, అది ముస్లిములనే దృష్టిలో పెట్టుకొని చేయబడినది. కాని ఈ కొండెత్తుగోడలు, నడుచు గుడారములు, పరదాగదులు ఈ ముస్లిం స్త్రీలకు సౌఖ్యదాయకములా ఏమి? పరదాతో ఇన్‌స్పెక్షన్‌కు పోలేక, స్త్రీ ఇన్‌స్పెక్టర్లు ఆఫీసులలో కూర్చొనుదురు! మొత్తమునకు హిందూ స్త్రీలకు విద్య లేకుండగా ప్రత్యేకపు ఏర్పాటులు చేయబడినవి. ఇంత మహాపనికి, మహబూబియా గరల్స్‌స్కూలులో 14గురు గజెటెడ్ ఆఫీసర్లు! సికింద్రాబాదులో కీస్ హైస్కూలు, హైద్రాబాదులో నారాయణగూడా ఆంధ్రబాలికా పాఠశాల, స్టేన్లీ గరల్స్ హైస్కూలు, నైజాం కాలేజీ తప్ప హిందూబాలికలకు స్కూళ్లే లేవు. ఇదీ స్థితి. ప్రస్తుతము మిగిలిన పర్దా స్కూళ్లను అందరునూ చదువుకొన వీలుగా మార్చవలెను. అనవసరమైనవారిని పెకిపార వేయుట తప్పుకాదు. మన ప్రభుత్వము అవసరమైనవారినికూడా తీసివేయగలదు!

అనేకులు విద్యాశాఖోద్యోగులు— ఉపాధ్యాయులు రజాకార్ల కాలములో అనేక క్రూరకృత్యములను చేసిరి. వారిని తీసివేయవలెను. మిగిలిన వారికి, ఏ ప్రాంతములోని వారికి ఆ ప్రాంతపుభాష రావలె నను నిబంధన యుండవలెను. వీరుగాక, బంధుత్వముల బలిమిచే పెద్ద పెద్ద ఉద్యోగముల కెగ్రాకినవా రనేకు లున్నారు. వారినిగురించి విడివిడిగా పేర్కొనుట అనవసరము. వారిని వారి కుచితమైన హోదాలలోనే యుంచుట మంచిది. ఈ లోగా ప్రభుత్వము తలచుకొన్నచో, ప్రతి మతమునుంచి, ప్రతి కులమునుంచి—ఆ శాఖావివరములు మన నాగరిక ప్రభుత్వమునకు కావలెనుగాన—ఎట్టి ఉద్యోగమునైననూ, నిర్వహింపగలవారు దొరకుదురు.

మార్పు జరుగదా ?

కాని నేటికిని ప్రభుత్వ విధానములో ప్రజోపయోగకరమగు మార్పులు లభించు సూచనలు కల్గుట లేదు. మొన్ననే అనేకతర్జనభర్జనలతో 8 వ తరగతి వరకు మాతృభాషలలో రాబోవు సంవత్సరమునుంచి విద్యాబోధ చేయుటకు నిశ్చయింపబడినది. మాతృభాషలలో బోధించు ఉపాధ్యాయులను తయారుచేయు పథక మేమియును లేదు. రాబోవు సంవత్సరములోననే స్కూలు ఫైనలు విద్యార్థులు, ఇష్టమున్నవారు తమమాతృభాషలలో పరీక్షలను వ్రాయుట కైననూ ప్రభుత్వము అనుమతి నీయవలెను. హిందుస్థానీని మొదటినుంచీ విద్యార్థులపై రుద్దుట భావ్యము కాదు. పైగా నాల్గవ ఫారములోననే విద్యార్థులు ఆప్షనల్‌ను తీసుకొనవలె నని నేటి నిబంధన. అది మారవలెను. ఐదవఫారమునుంచి ఆప్షనల్‌ను తీసికొనుట కేర్పాటు చేయవలెను. ఇంతకూ హైస్కూలు విద్యను నడుపుటకు ఒక సెకండరీ విద్యాబోర్డు ఉన్నది. అందులో తెలుగువారు నల్గురే. సంస్థానములో సగము ప్రాంతములో నివసించుచున్న వారికి ఇంత తక్కువ ప్రాతినిధ్యమిచ్చుట అసమంజసము. అదిగాక, ఈ బోర్డులో అనేకరాజకీయములు ప్రవేశించి, విద్యావిషయ చర్చలకంటె సమావేశసంబంధమైన చర్చలతో కాలము గడుచుచున్నట్లు తెలియుచున్నది. తెలుగు, మరాఠీ, కన్నడము మాతృభాషలుగా కలవారిని ఈ బోర్డులో అధికముగా వేసి, తక్షణమే హైస్కూలు విద్యను సంస్కరింప బూనుకొనవలెను. ఏ పనికైనను ఉన్నతోద్యోగులుగా పూర్వపు మతవిద్వేషు లుండరాదు.

కళాశాలలలో తక్షణమే మాతృభాషలను విధిగా బోధింపవలెను. ఇంతవరకును కళాశాలల విషయమై ప్రభుత్వమొక నిశ్చయమునకు రాకుండుట చాలా అనుమానములకు దారితీయుచున్నది.



క్రిందటి గురువారం ప్రధాని నెహ్రూ ఇంటిలో విజయలక్ష్మి పండిట్ కుమార్తె చంద్రలేఖకు అశోక మెహతాకు వివాహము జరిగినది.

గృహస్థాశ్రమంలోని ఆధ్యాత్మిక తత్వం

మూలం : శ్రీ పోతరాజు నరసింహం

అనువాదం : శ్రీ జె. పార్థసారథిప్రసాద్

(గత సంచిక తరువాయి)

— ప్రసన్నన్నగాతుసెరు * "ఆదాము" (*Adam*) లోపలినుంచి మొదట పుష్పవించిన "అవ్వ" (*Eve*) ఎవరో తెలుసుకొని తిరిగి ఆమెను తన దానినిగా చేసుకొని, "తాను" గానే అనగా తానే అయిపోవలెను. అట్టి సమాప్తదశ కలుగు సమయమువరకు, మానవస్వరూపములోని శివుడున్నూ, శక్తియున్నూ, ఒకరికొకరు అపరిచితులుగానే యుందురు. తన "శక్తి" సహకారము లేకుండా స్వయంగా యోగసాధన చేయ చూచే వానికి కుండలినియొక్క రహస్యం అభేద్యంగానే, గోప్యంగానే వుంచబడుతుంది. తన పత్నిలో తన "శక్తి" సూత్రమును కనుగొననంతవరకు బ్రహ్మత్వమును అతడు, సాక్షాత్కరింప చేసుకోనలేడు. అంతవరకు "పైన" (పరములో) ఒకదానియందే ద్విబీజముగా నున్నట్లు "ఇహము" లో అనగా యిక్కడ భూమిమీదకూడా తానే అనుపూర్ణ ప్రజ్ఞతో వుండుటకు వీలులేదు. కాని యిట్టి ఉన్నతస్థితి, పరస్త్రీ సహకారముతో సాధింపవచ్చునను కొనుట గొప్పతప్పు. ఇలా అపోహపడే అనేకమంది తమసాధనలలో తప్పు త్రోవ త్రొక్కిరి. కనుక యెవరైనను సరే క్రీస్తు, బుద్ధ, శంకరాదులైనను సరే "ముక్తి" పొందిరనుట సత్యము కాదు. తమ "శక్తిని" కూడా తమతోపాటు యోగసంకలనముద్వారా మేళవింప చేసుకొని, "పూర్ణత్వము" పొందిననే తప్ప ముక్తులయిరనుటకు వీలులేదు. పైచెప్పిన మహనీయులు, నవీనకాలములో పరిశోధనాలయములో శాస్త్రజ్ఞులు, జ్ఞానసముపార్జన చేస్తున్నట్లు, ప్రకృతిని గూర్చిన విజ్ఞానము సంపాదించి, వుండవచ్చునే కాని "ముక్తి"కి (స్త్రీ అయిన అర్ధంలో చూస్తే) అనగా తనలోని అంశమైన స్త్రీ శక్తిఅయిన కుండలినిని తనలో సమ్మేళవింప చేసుకోనందువల్ల "ముక్తి" పొందివుండరయిరి. (అనగా శివశక్తి ఏకత్వమును పొంది బ్రహ్మత్వమును స్వానుభవంలో తెలుసుకున్నవారు కారు.) అట్లు పొందుటకు వీలులేదు. "ముక్తి" అనగా "ప్రకృతి"ని గూర్చిన విజ్ఞానము కాదు. అది యెంత అపారమైన జ్ఞానమైనను సరే "ప్రకృతి" మన ప్రజ్ఞకు అర్థమైనను కాకపోయినను దాని పనిని అది సాగిస్తూనే వుంటుంది. కనుక మనమంతా యేదో బ్రహ్మాదవశాత్తు సంభవించినట్టివారము కాదని, ప్రతికి వారు స్వతహాగా వేరువేరుగా సాధించుటకు, మనము రాలేదని గ్రహించవలెను. అట్లు కాక యీ స్త్రీపురుష విభేదము మన మూలప్రకృతికి సంబంధించిన ఒక ప్రత్యక్షప్రమాణమనియు, స్త్రీపురుష స్వరూపముల ద్వారా యీ యథార్థము వ్యక్తమగుచున్నదనియు మనము తెలుసుకొనవలయును. మన పూర్వస్థితి యందలి రెండు భాగములు కలసి, సమిష్టిగా యోగముచేయుటవలననే, మోక్షము లభ్యమగును కాని, యీ రెండుభాగముల, వియోగ స్థితిలో లభ్యముకాదు. కనుకనే మన హైందవ వివాహ కర్మకాండలో కూడా, వధూవరులను సాంకేతికప్రాయముగా ఒక బంధకొడికే కట్టే ఆచారము కలదు. ఈ సత్యమే అగ్నిష్వాత్త, బర్హిషత్త, పితృల గాథలలో దృష్టాంతీకరింపబడియున్నది. ఈ పితృదేవులు మానవ శరీరకారకులు. అంటే యథార్థముగ వారు మన అందరియొక్క స్త్రీపురుష స్వరూపములే. ఈ స్త్రీపురుషులలో, యేఒక్కరివల్లనైన ముక్తి సాధించవీలైనయెడల అసలు సృష్టిలో యీ రెండుజాతులు ఏర్పడే వుండరాదు. సృష్టిక్రమ వికాస పద్ధతిలో యీ స్త్రీపురుష విభేదము యేర్పరుచబడుటకు ఒక నియమితోద్దేశమూ, ఒక నెరవేర్పవలసిన విధికలవు. తనకృషిఫలితంగా "ప్రకృతి" మనలను స్వయం సృష్టి చేయగల స్వతంత్రులనుగా, సత్త్వులనుగా తయారుచేయుటకే వుద్దేశిస్తూవున్నది. అందువల్లనే యిహపరాల రెంటిలోకూడా, కుటుంబజీవనానికీ, కులాచారానికీ, అంత ప్రాముఖ్యము యివ్వబడినది. యెవనియందు సృష్టిక్రమవికాసము చేయగలిగినట్టియు, సృష్టించగలయట్టియు "ఏకశక్తి" పనిచేయునో అట్టివాడు తన 'కులసతి'తో కలిసి యోగసాధన కొనసాగించవలసియున్నది. యేనాడు మానవుడు తాను శివుడై తన అర్థాంగిని తనలో ఐక్యము చేసుకొనునో ఆనాడే ఆతని సహస్రారములో అతని కుండలిని శక్తి అతనితో ఐక్యమైనదని చెప్పవచ్చును. ఇదియే మానవుని యోగసాధనలో ఆఖరుమెట్టు. అప్పుడు మానవుడు తన "శక్తి" లేక స్త్రీ స్వరూపములో పనిచేస్తూవున్న చైతన్యత తానేనని గ్రహించగలుగును. అటువంటి సిద్ధపురుషుడు భూమిపై స్థూలరూపము వహించి, ఈశ్వరుడైనప్పుడు తక్షణమే యావత్తు మానవజాతి దైవతుల్యమై స్వర్గసామ్రాజ్యము యిప్పుడే యిక్కడే అనుభవసిద్ధమగును. అటువంటి ఉత్తమపరమావధికే మనమందరమూ సమిష్టిగా సాగిపోతున్నాము. తుదకు మానవజాతిఅంతా ఒకటే. అంటే ఈశ్వరుడే యీ జీవరాసిగా వికసించినాడన్న మాట. అంతే కాదు. దేవుళ్లందరూ, మనలోని వున్నతాంశలు లేక "దివ్యాంశలు" మాత్రమే. అంటే యథార్థముగా యీ దేవతలంతా మానవులే; అనగా స్థూలములో కనుపించుచున్న మానవజాతియే.

పుత్రసంతానము లేనివారికి మోక్షము లేదనే లోకోక్తి యెందుకు పుట్టిందో యిప్పుడు మనకు స్పష్టంగా తెలుస్తుంది. పూర్ణప్రజ్ఞతో తనంతటతాను తల్లిగాను తండ్రిగాను, జననీజనకత్వదశలను, తనలోనే వ్యక్తీకరింప చేయలేనివాడు, నిజమైన ముక్తుడు కాలేడు. ఆ రూపభావమైనజననీజనకత్వము రూపువహించెననుటకు చిహ్నమే "పుత్రుడు". కాబట్టి జ్ఞానములలోకెల్ల జ్ఞానమైన బ్రహ్మవిద్య గృహస్థాశ్రమములోనే కలదు. తన "శక్తి"కి తాను పరిణయము కానటువంటి వ్యక్తికి యీ బ్రహ్మవిద్య పల్లడికాదు ప్రాజాపత్యమువల్ల యేమీ లేని అవ్యక్తస్థితినుండి, స్త్రీపురుషులు తను ప్రతిబింబమును సృష్టించెదరని మామూలుగ చెప్పకొనే విషయములోని రహస్యమును మనము గ్రహించుకోవాలి. సాధారణముగ మనము చెట్టులోనుండి విత్తనము వచ్చినదని విత్తనము తిరిగి చెట్టును ఉత్పత్తి చేస్తుందని అంటున్నా, వాస్తవంగా చెట్టులోనుంచి విత్తనము తయారు చేసేది, యీ విశ్వసృష్టికి మూలసూత్రమేదో అదే. సకలజీవరాసులకు జీవనప్రమాణము (*Life Principle*) ఒక్కటే. యీ జీవనసూత్రమే విశ్వమునకంతకు పత. అదేవిధముగ తనలోనుండి తగిన స్వరూపమును, తయారుచేయడం కోసం తల్లి శరీరానికి బీజమును సృష్టించి యిచ్చేది తండ్రిశరీరము కానేరదు. అలా యిచ్చేది పరబ్రహ్మమే. అనగా సృష్టికర్తయగు ఈశ్వరుడే. మానవశిశువు జన్మించేముందు తండ్రి శిరస్సు చుట్టూ వుండే "తేజోకళ" (*Aura*) లోనికి శిశువుయొక్క జీవాణువు ముందు ప్రవేశించి మూడుమాసములలో తగు స్థూలపదార్థమును సమకూర్చుకొనునట. లదుపరి యీ భౌతికబీజము తల్లియందు ప్రవేశించి నవమాసములు గర్భాశయములోనుండి అందు ధనివృత్త్ శిశుశరీరమును నిర్మించును. మొదట్లో తండ్రి శిరస్సుపైనున్న జీవాణువు అనగా జన్మించబోవు శిశువుయొక్క తాత్కాలిక ఆత్మ, శిశువు జన్మించునంతవరకు, తండ్రితావునే వుండి, యీ శిశుస్వరూపము మొదటిసారిగా వూపిరిపీల్చే క్షణంలో అంటే ప్రథమోచ్ఛ్వాసములో యీ శిశువుశరీరములోనికి ప్రవేశిస్తుంది. దీనినే "ప్రవేశాత్మ" లేక 'స్టెబిలిటీ' (*Stability*) అంటారు. యీ 'స్టెబిలిటి' యిట్లు ప్రవేశించినంతవరకు లోపలవున్న శిశురూపము తల్లియొక్క అవయవములలో అనగా శరీరములో ఒక భాగము మాత్రమే. ఈ జీవాణువు శిశుజననము అగువరకు తండ్రిశరీరమును ఆశ్రయించి వుండునే కాని తల్లి శరీరమును ఆశ్రయించి వుండదని మనము గమనింపవలెను. ఈ అంశము స్త్రీపురుష స్వరూపాలకు వున్న సంబంధమును గూర్చిన ఒక ముఖ్య విశేషము. కావున యీ పన్నెండు మాసముల కాలము, బ్రహ్మాన్వేషియగువానికి అనుకూల్యమైన దినములు. యీ సమయములో తల్లిదండ్రు లిద్దరు "బ్రహ్మవేశులై' వుందురు గనుక యిది వారికి అనుకూల్యమైన కాలము. బ్రహ్మచారులు, సన్యాసులు, యిట్టి మహాదవకాశమును ముఖ్యప్రారంభకముగ, పోగొట్టుకొనుటవల్ల, వారికి బ్రహ్మజ్ఞానము లభ్యపడదు. ఇటువంటివారు ప్రపంచములో యెవిషయమైననూ, తెలుసుకొన్నగలరుకాని "జీవిత రహస్యము" మాత్రం వారి పరం కాదు. "ముక్తి" అంటే శాశ్వతజీవనము మాత్రమే. ఈ సన్యాస, బ్రహ్మచర్యాశ్రమాలు, సృష్టిక్రమానికి, మానవపూర్వకము ఆక్షేపణలనికూడా మనము అనవచ్చు. అందుచేత యీ ఆశ్రమములు బ్రహ్మద్వేషపాపము వొడిగట్టుకుంటూ వున్నవనికూడా అనవచ్చు. యింతకుముందే చెప్పినట్లు నిజమగు బ్రహ్మచర్యము గృహస్థాశ్రమములోనే ఆసించవలసివుంటుంది. గృహస్థాశ్రమములోనే యేవ్యక్తి అయినా చైతన్యావస్థలోనే జీవితసాగరంలోనికి అనగా బ్రహ్మములోకి ప్రవేశించి తానే జీవనసర్వస్వమునకు ప్రభువు కాగలడు. అటువంటి మహనీయుడు సర్వకాలము పూర్ణమగు చైతన్యావస్థలోనుండి మేల్కొనివుండి 'అవిచ్ఛిన్నత్వ'మనగా యేమియో గ్రహించగలడు. 'అవిచ్ఛిన్నత' అనగా "శాశ్వతత్త్వమే'. మనము యెన్నిచెప్పినా, చివరకు మహామహుడైన సృష్టికర్త తన దివ్యానుగ్రహంచేత మనలోనూ, మనకున్నూ సాక్షాత్కారము కావలసియున్నాడు. స్వప్రయత్నమువల్ల మనము యీ పరమరహస్యాన్ని ఛేదించి చేరలేము. సృష్టినాథుడు తన యిచ్ఛామాత్రసృష్టి, సంకల్పమువల్లనే సాగిపోవును. శాశ్వతజీవనము లేక నిత్యసత్యజీవనమార్గము ఇటువంటిది అయినప్పుడు, సహజముగా మనము యోగసాధనలో, స్త్రీకి గల స్థానము యేమిటి అని ప్రశ్నించవచ్చు. దీనినిబట్టి స్త్రీ యెప్పుడు తనంతటతానే స్వతంత్రాంశము కాదని బ్రహ్మనుగూర్చి స్వయముగా తెలుసుకోలేదని మనము సులభముగ తెల్పుకోవచ్చు. స్త్రీ తన నాథుని సహాయముతో, మహాయోగమువల్ల అతని స్వంతమే అయిపోయి ఉన్నతపథమునకు తీసుకొనిపోబడును. "ఆదాము"లోనుంచి "అవ్వ" వచ్చిందని, ఆరంభంలో "బ్రహ్మ" తన "శక్తి"ని సృష్టించి ఆమెను తన సహధర్మిణిగా చేసుకున్నాడని చెప్పబడిన కథలలోని అంతరార్థము మనము గ్రహించవలెను. సృష్టిక్రమవికాసము, చెందేముందు "ఏకోనారాయణ" అయినట్టిది అనేకం కావాలని సంకల్పించినప్పుడే, ప్రతి సూక్ష్మజీవికికూడా తనలో "శక్తి" అంశము, అనగా కుండలినిని, సృష్టికర్త వికసింపజేసియున్నాడు. ఈ కుండలిని శక్తియే, భూమి, స్త్రీ, స్వరూప

(22 వ పేజీ చూడుడు)

* *In the whole mankind regenerated in the New World.*



పశ్చిమ భరతమండలి సర్వసేనాని జనరల్ శ్రీనగేశ్ యిటీవల బికనీర్ సంస్థానమునకు వెళ్లిన సందర్భంలో సంస్థానసేనల ఒంటె దళమును తనిఖీచేయుచూ ఒంటెపై క్రొత్తగా స్వారీచేయుచున్న దృశ్యం.

అధికాహారోత్పత్తి: బంజరువ్యవసాయము

శ్రీ నందివాడ కృష్ణమూర్తి

అనాది నుండి భారతదేశము తన సశ్యసంపదకు పవిత్రనదీజలములకు వన్నెకెక్కియుండెను. కాని ఈ నాడు ఈ దేశమున దుర్భిక్షము తాండవ మాడుటకు కారణము లేక పోలేదు. దేశములో నాటికి 80 వంతుల భూమి సేద్య సాధ్యముగా నున్నను 20 వంతులు మాత్రమే ప్రస్తుత ముపయోగింపబడుచున్నది. అందువలననే నేడు మనల నెదుర్కొనుచున్న సమస్యలలో ఆహారోత్పత్తియే ముఖ్యమైన దగుచున్నది. దేశావసరమగు ఆహారదినుసులకు కొరత లేకుండ చేయుటకై ఇదివరకెన్నియో ప్రయత్నములు చేయబడెను, కాని యట్టి ప్రచారముల వల్ల ఆహారోత్పత్తిలో మార్పులు జరుగుటకు బదులు ప్రభుత్వమునకు తీరని ధననష్టము కల్గుచు వచ్చెను. ఇది గ్రహించినవా రగుటచే నేటికి ప్రభుత్వమువారు నూతన ప్రయత్నముల తలపెట్టుచున్నారు. ఇక మూడు సంవత్సరములలోపుగా అనగా 1951 లోగా, దేశమును స్వయంపోషకముగా చేయవలె ననియు, తరువాత విదేశములనుండి ఎట్టి ఆహార దినుసులు దిగుమతి చేయబడ వనియు మన ఆహార మంత్రిగారు హెచ్చరించి యుండిరి. ఈ లక్ష్య సాధనకై వారు అవలంభింప దలచిన సాధనల వసాయము ముఖ్యమైనది.

అనుకొనకుండగనే మూడు సంవత్సరములలో దేశమును స్వయంపోషకము చేయవలె ననెడి నిశ్చయమునకు వచ్చుటచే సాధించవలసిన కార్యమునకు మనకున్న గడువు బహు స్వల్పమని గుర్తించవలెను. విదేశదిగుమతులే లేకుండ చేసికొనవలె నన్నచో కనీసము 4 మిలియన్ టన్నులాహారము నుత్పత్తి చేయవలసి యుండును. వ్యవసాయ విషయములు సంపూర్ణముగా రాష్ట్రముల బాధ్యతయే ఐనను రాష్ట్రములకు కేంద్రప్రభుత్వపు సహాయము కూడ చాల కావలసి యుండును. ఇందులకు కేంద్ర ప్రభుత్వము సిద్ధముగా నుండుట వారి కార్యదీక్షకే తార్కాణము.

నేడు మన దేశమున సుమారు 65 మిలియన్ ఎకరముల బంజరు భూమి గలదు. కాని ఇందు 6 మిలియన్ ఎకరములు మాత్రమే తక్షణము సేద్యము చేయబడుట కనువుగానున్నది. ఇందులోను 22 మి. ఎకరములు ప్రభుత్వ భూమి వీనిని సేద్యము చేయవలె నన్నచో లోతుగా దున్నవలిసి యుండును. అందుచే ఈ 6 మి. ఎకరముల స్వాధీనము చేసికొనుటకు కనీసము 10 లేక 15 సంవత్సరములు పట్టగలదట, ఇందులకుగాను మున్ముందుగా కావలిసిన యంత్రములను ట్రాక్టర్లను విస్తారముగా ప్రభుత్వము సంపాదించవలసి యుండుటచే 1946 ఏప్రిల్ మాసములో కేంద్ర వ్యవసాయ మంత్రి వర్గము వారు 200 బరువగు ట్రాక్టర్లను సంపాదించి యుండిరి. అదియును గాక నేటివరకు ఎడ్లచే దున్నించు కొనవలవాటు గల మనవారలకు యంత్రముల వాడుట నేర్పవలసి యున్నది. అందుచే కేంద్ర ట్రాక్టర్ సంఘము (*Central Traotor Organisation*) నొకదానిని ప్రభుత్వము స్థాపించి యుండెను. ఈ సంఘమునకు లాభనష్టములతో జోక్యము లేదు. తొలుదొల్తగా 245 ట్రాక్టరులతో ప్రారంభించి ఈ సంఘము దేశమునకు చాల యుపయోగపడుచున్నది.

1947 లో ఈ సంఘము సంయుక్త, మధ్య రాష్ట్రములందు 32,306 ఎకరములను పునః స్వాధీనము చేసికొని వ్యవసాయయోగ్యముగ చేసెను. ఇదిగాక మత్స్యరాజ్యములందు మరి 65,000 ఎకరముల బంజరు భూమి కూడ స్వాధీనము చేసికొనబడెను. అనగా సుమారు 200,000 ఎకరములు క్రొత్తగా వ్యవసాయములోనికి తేబడిన దన్నమాట.

ఇవి,గాక తూర్పు పంజాబులో 8,670 ఎకరములును మధ్యభారతమున 26,000 ఎకరములును గూడ సాగు చేయ బడుచున్నవి. 1949 జూన్ లోగా దీనికి రెట్టింపు భూమిని స్వాధీనము చేసికొనుటకై ప్రయత్నములు జరుగుచున్నవి.

కాని మన కున్న గడువు 3 సంవత్సరములే యగుటచే, మన ప్రయత్నములు కొనసాగుట మనకున్న పనిముట్లు, పని వారలపై ఆధారపడి యుండును. 1951 లోగా 800,000 ఏకరములనే స్వాధీనము చేసికొన నిశ్చయించినట్లు తెలియుచున్నది గాని, ఇది ఇంత వరకు బాగు చేయబడినదో, లేక ఇక మీదట స్వాధీనము చేసికొనవలసిన మొత్తమో తెలియుట లేదు. 1 మిలియన్ ఎకరముల స్వాధీనము చేసికొనుటచే 400,000 టన్నుల నుత్పత్తిచేయవచ్చును. కాని ఇది మనకు కావలసిన ఆహారములో నాల్గవ వంతు మాత్రమే కాగలదు. తక్కిన 3. 6 మిలియన్ టన్నులను సేకరించుట అనుకొనినంత సులభము కానేరదు.

ఇక మీదట కనీసము 2 మిలియన్ ఎకరములనైనను సేద్యయోగ్యముగా చేయుటకై యత్నములు జరుగవలెను. నేటి యాహార పరిస్థితి అతిక్లిష్టముగా నుండుటచే, ప్రభుత్వము వెంటనే అమెరికానుండి కావలసిన యంత్రముల సంపాదించవలసి యుండును. యంత్రముల నడపుటకు గాను, సైన్యములనుండి విడుదల యైన సిపాయిలను లాభదాయకముగా నుపయోగింపవచ్చును.

ఈ బంజరు వ్యవసాయమునకు ప్రభుత్వము ఏర్పాటు చేయుచున్న ట్యూబ్ నూతులు చాల ఉపయోగ పడగలవు. దాని కొఱకై స్థాపింపబడిన సెంట్రల్ గ్రౌండ్ వాటర్ ఆర్గనైజేషన్ (*Central Ground Water Organisaion*) వారు కావలసిన యింజనీర్లను, డ్రిల్లర్లను తయారు చేయుచున్నారు. ఇప్పటికి సుమారు 545 ట్యూబ్ నూతులు తయారు చేయబడినవి. ఇకపై సంయుక్త, మధ్యరాష్ట్రముల లోను, తూర్పు పంజాబులోను మొత్తము 4565 నూతుల కట్టుటకై యత్నములు జరుగుచున్నవి. కాల్వలవలన గాని చెర్వులవలన గాని సహాయం రాని ప్రదేశములలో ఈ ట్యూబ్ నూతులవల్ల విస్తారమగు లాభము కలుగగలదు.

ఇట్టి బహువిధ ప్రయోజనకారులగు సాధకముల ముందు పూర్వపు అధికాహారోత్పత్తి ప్రచారములు (*Grow more food campaign*) తృణప్రాయములు కాగలవు.

కాని ఈ నూతన ఆహారపద్ధతులలో ఒక్క విశేషము గలదు. అదియేదన, వ్యవసాయ విషయమున, అవలంబించదలచినవే నూతన పద్ధతియినను విజయము పొందవలె నన్నచో, వ్యవసాయదారుల గూడ ఆ విషయమున దోడ్పడ వలసి యుండును. ఇది కూడ సాధించుటకై, వ్యవసాయ దారుల సంఘముల స్థాపించుటకై ప్రభుత్వ మాలోచించుచున్నట్లు తెలియుచున్నది. ఇట్టి సదభిప్రాయము గల్గినందులకు ప్రభుత్వ దక్షులు అభినందనీయులే. కాని ఇది ఎంతవరకు సాధ్యము అనుసమస్య రాకపోదు. సహకారసంఘములలో మన కున్న అనుభవములనే మనము నిదర్శనముగా తీసి కొనినచో, మన కంతటి ధైర్యము కలుగకున్నది. కాని కొద్ది పాటి ప్రచారముతో దీనిని సాధించవచ్చును. చిన్న చిన్న అభివృద్ధిసంఘములు (*Development Boards*) కేంద్రమునందును, రాష్ట్రములందును గూడ ఇందు కొరకై స్థాపింప బడునట. మాసమున కొక పర్యాయము సమావేశమై ఈ ఉద్యోగులు అభివృద్ధిమార్గముల నాచరణలో బెట్టుటకు ప్రయత్నింతురు.

కాని ఈ ఆహార సమస్య మనకు క్రొత్తది గాదు. ఈ సమస్య తీర్చుటకై మహనీయులైన ఎన్. ఆర్. సర్కార్, సర్. జ్వాలాప్రసాద్ శ్రీవత్సవ కీ. శే. జోగేంద్రసింగ్, డా॥ రాజేంద్రప్రసాద్ మొదలగు వారనేకులు ప్రయత్నించి యుండిరి. అనేకసమావేశములు జరుపబడెను. ఎన్నెన్నో ప్రయత్నములు పద్ధతులు అమలు జరుపబడెను. కాని విజయము మాత్రము సాధించ లేక పోయిరి.

దేశములో ఉత్పత్తు లధిక మయినప్పుడే దిగుమతుల నాపుకొనుట సాధ్యమగును. ఇందులకుగాను, నూతన భూముల సేద్యములోనికి తెచ్చుటయే గాక, ఇప్పుడు సేద్యము చేయబడుచున్న భూముల నింక నెక్కుడుగా పండించవలెను. దేశమున ప్రపంచమున ఎన్నిమార్పులు వచ్చినను మనదేశపు వ్యవసాయదారుని యందు మాత్ర మెట్టి మార్పుగాని వచ్చుట లేదు. సినిమాలవలన గాని, రేడియోలవలన గాని వారు లాభపడినట్లు తోచదు. అనాదినుండి వచ్చిన పద్ధతులనే నేటికిని వా రవలంబించుచున్నారు. ప్రభుత్వపు శాస్త్ర పరిశోధన లేవియు వారి నాకర్షించుట లేదు. దీనికి తోడు, ధరలు కంట్రోలు వలన వారు, వారలకు గావలసిన సాధక బాధకముల కొనగల శక్తి గూడ తగ్గిపోవుటచే ప్రభుత్వము యెడలగాని, సంఘముయెడల గాని వారి కెట్టి నమ్మకము యున్నట్లు దోచదు. అందుచే, ఈ ఆకలి పిశాచమునే పారద్రోలవలె నన్నచో. మున్ముందుగా వ్యవసాయిదారులలో ఈ నమ్మకము. విశ్వాసము పుట్టించవలెను. ఇది గుర్తించని ఏ మార్గమయినను విజయవంతము కానేరదు.

దేశమున బంజరువ్యవసాయమునకు చాల అవకాశములు గలవు. ఇంతవరకును మనరాష్ట్రమున బంజరు వ్యవసాయము ప్రారంభింప బడనే లేదు. కాని ఈ ప్రయత్నములన్నియు విజయవంతముగా ముగిసినచో నూతనముగా 6 మిలియన్ ఎకరములు సేద్యములోనికి తేబడుటయే గాక 2 మిలియన్ టన్నులాహారము త్పత్తి చేయబడును. విదేశదిగుమతులు లేక పోవుట చేత, ద్రవ్యోల్బణము కొంతవరకు అరికట్టబడగలదు. ఈ దిగుమతులకై ఖర్చు చేయబడుచున్న మన స్టర్లింగు నిల్వలను, డాలర్లను ఇకపై మూల వస్తువుల దిగుమతులకై వినియోగము చేసికొనవచ్చును. దానితో దేశ సౌభాగ్య మభివృద్ధి చేయుటకై ప్రథమ సోపానము తయారు కాగలదని ఆశించవచ్చును.

మనరాష్ట్రం; మనదేశం:

(5 వ పేజి తరువాయి)

వచ్చును. ఈ చెరువులు బాగుపడితే రాయలసీమ వాసుల బాధ కొంతవరకూ తీరుతుంది!

తూర్పు పంజాబ్ మంత్రివర్గం

తూర్పు పంజాబ్‌లో డా॥ గోపీచంద్ భార్గవా పార్టీ నాయకునిగా ఎన్నుకోబడిన మూడువారాలకల్లా కాంగ్రెస్‌పార్టీలో ఒక వర్గం తిరగబడింది. భార్గవా రాజీనామా ఇచ్చారు. రెండోవర్గానికి నాయకుడు భీమసేన సచార్. ఈయన యుద్ధకాలంలో పంజాబ్ యూనియనిస్టు మంత్రివర్గంలో మంత్రిగా ఉన్నారు. ఉభయవర్గాలు సమానబలం గలవి. విశ్వాసరాహిత్యతీర్మానం ప్రతిపాదించడానికి పార్టీని సమావేశపరచాలని సచార్‌వర్గం అడిగింది. పార్టీ సమావేశం జరుగకముందే డా॥ భార్గవా రాజీనామా నిచ్చారు. భార్గవావర్గంలోని కెప్టెన్ రంజిత్‌సింగ్ సచార్‌తో పోటీ చేసి ఓడిపోయారు. సచార్ పార్టీనాయకునిగా ఎన్నిక కాగానే మంత్రివర్గనిర్మాణకాండ ప్రారంభ మయింది. పాకీస్తాన్ సరిహద్దులో ఉన్న తూర్పు పంజాబ్‌లో కాంగ్రెస్ మంత్రివర్గం సుస్థిరంగా ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ అధిష్ఠానవర్గం అక్కడ సర్వవర్గ ప్రాతినిధ్యమంత్రివర్గం నిర్మించాలని సచార్ గారిని ఆజ్ఞాపించింది. సచార్ ఆరంభంలో ఈ ఆజ్ఞను ధిక్కరించారు. తనవర్గంలోని వారినే అయిదుగురితో మంత్రివర్గం నిర్మించి ఆ పేర్లు గవర్నరుకి పంపించారు. వెంటనే కాంగ్రెస్‌పార్లమెంటరీ బోర్డు సచార్‌ను బెదరించింది. పటేల్, ఆజాద్ రాజేంద్రప్రసాద్ గార్లు సచార్‌కు తంతినిచ్చారు. ఆజ్ఞ నెందుకు ధిక్కరించారో సంజాయిషీ అడిగారు. వేరే చేసేది లేక సచార్ ఆ మంత్రివర్గాన్ని తొలగించి భార్గవావర్గంవారిని చేర్చుకోడానికి అంగీకరించారు. భార్గవావర్గం నుంచి ఇద్దరిని తీసుకోడానికి చివరికి నిర్ణయమయింది. కాని ఎవరిని తీసుకోవాలో తిరిగి సమస్య అయిపోయింది. భార్గవావర్గం నుంచి ఇద్దరిని ఎంచుకొనేకోసం నలుగురి పేర్లు సూచించాలని సచార్ గారికీ భార్గవాగారికీ సూచించారు. ఇద్దరూ ఇచ్చే జాబితాలలోనుంచి కాంగ్రెస్ పార్లమెంటరీబోర్డు ఇద్దరిని ఎంచడానికి నిశ్చయించింది.

తూర్పుపంజాబ్ మంత్రివర్గ నిర్మాణంలో ఇంత శ్రద్ధ వహించిన కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు చెన్నరాష్ట్రం విషయమై ఎందుకు విన కున్నారో దురూహ్యంగా ఉంది. ఆంధ్ర రాష్ట్రం నిర్మించమంటే కమ్యూనిస్టు ముప్పు అన్నారు. దేశం భయంకరమైన ప్రమాదపరిస్థితిలో ఉంది కాబట్టి ఇప్పుడు వీల్లేదన్నారు. ఆ ప్రమాదపరిస్థితి చెన్నరాష్ట్ర మంత్రివర్గ నిర్మాణంలో పనికిరాలేదు. చెన్నరాష్ట్రంలో శాసన సభ్యుల గ్రూప్ రాజకీయాల్ని గాలికి వదిలేశారు. తూర్పుపంజాబులో డిప్యూటీ మంత్రుల్ని నియమించకూడ దని ఆజ్ఞాపించాడు.

నేటి ప్రపంచం

(9-వ పేజీ తరువాయి)

నాలుగు అగ్రరాజ్యాలూ (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, చీనాలు) ఒక తీర్మానం ప్రతిపాదించాయి. తీర్మానాన్ని రష్యా సహచరుల్తోసహా ప్రతిఘటించింది. తీర్మానానికి అనుకూలంగా 43 ఓట్లు, ప్రతికూలంగా ఆరు ఓట్లు వచ్చాయి. బర్మా భారతదేశాలు ఓట్లు వెయ్యకుండా తటస్థంగా ఉన్నాయి. తీర్మానమయితే గెలిచింది కాని, పాటించవలసినవారు పాటించరు. అంటే ఈ తీర్మానాన్నికూడా చీటీలో చేశా రన్నమాట.

మలాన్ ప్రభుత్వన్యాయవిచారణ:

డర్బాన్‌లో భారతీయులపై నీగ్రోలు చేసిన దౌర్జన్యాలను గురించి మలాన్ ప్రభుత్వం విచారణ జరిపింది. విచారణ జరిపింది ఒక న్యాయ విచారణాధికార సంస్థ. కాని ఆ కమీషన్ సభ్యులకి న్యాయశాస్త్రంకంటె రాజకీయ ప్రచారం అధికంగా తెలుసని నిరూపించుకున్నాడు. భారతీయుల ప్రతినిధులు, నీగ్రోల ప్రతినిధులు సాక్షుల్ని ప్రశ్నలువేసి పరిశీలించాలని కోరితే కమిషన్ నిరాకరించింది. అయినా సత్యం దాగలేదు. భారతీయుల్ని దక్షిణాఫ్రికా నుంచి వెళ్లగొట్టాలనే ఉద్దేశంతో యూరోపియన్లు నీగ్రోలని రెచ్చగొట్టారు. తమ దీనస్థితికి కారకు లెవరో గ్రహించజాలని నీగ్రోలు యూరోపియన్లపైగాక భారతీయులపైన కక్ష సాధిస్తున్నారు. విచారణలో స్పష్టమయిన ఈ విషయం అంత ప్రధానమైనది కాదని కమిషన్ తన నివేదికలో చెప్పింది. నీగ్రోలు మా పల్లెల్లోనే ఉండాలని కోరుతున్నట్లు నివేదించి కమీషన్ తన పక్షపాతబుద్ధిని దాచుకోలేదు ప్రభుత్వ పోలీసుశాఖ జాగ్రత్త వహించకపోతే ఈ కలహాలు తిరిగి సంభవించగలవని కమిషన్ భారతీయుల్ని హెచ్చరించింది.

అమెరికన్ డాలర్ల పెట్టుబడి

(8 వ పేజీ తరువాయి)

ఒడంబడిక ఒకటి జరిగినట్లు చెప్పుతున్నారు. కాంగ్రెస్ ఈ విషయాన్ని విచారించాలి. సర్వ స్వతంత్ర మనకునే ఒక ప్రభుత్వంతో ఒక వ్యాపారసంస్థ ఎన్నడూ ఇటువంటి అప్రతిష్ఠాకర మైన ఒడంబడిక చేసుకోలేదు. హవానా ఒడం బడికను నేను చూశాను. ఈ ఒడంబడిక అమలు జరిగినట్లయితే ఇండొనీషియాలోని ఆర్థికజీవనం అంతా ఒక అమెరికన్ వ్యాపారసంస్థగుప్పిట్లో ఉంటుందన్నమాట. ఈ వ్యాపారంలో ఏమి నష్టం కష్టం వచ్చినా రిపబ్లిక్ ప్రభుత్వమే భరి స్తుంది. నూటికి $7\frac{1}{2}$ వంతులు కంపెనీకి లాభం ఇవ్వగల రని గారంటీకూడా ఇస్తుంది."

న్యూయార్క్ టైమ్స్ పత్రికలో జనవరి 11 వ తేదీని జినీవా వార్త ఒకటి ప్రచురించ బడింది. అందులో సి. యల్. సల్జ్ బర్గర్ నిర్మొహమాటంగా ఈ క్రింది రీతిగా తన అభి ప్రాయం వ్యక్తపరిచాడు: "యూరప్ లో ప్రజలు ఈనాడుకూడా విలాసజీవనం గడుపు తున్నారంటే, వారి జీవనప్రమాణం ఇంత అధి కంగా ఉందంటే అదంతా ఆసియా ఆఫ్రికా ఖండాల్లో ముడిపదార్థాలు, చౌకలో కూలీలు లభించడంపైనే ఆధారపడిఉంది. ఈనాడు పూర్వవలసరాజ్యవిధానం సామ్రాజ్య విధానం అంతరించినప్పటికీ, పునరుజ్జీవం పొందుతున్న యూరోపియన్ దేశాలు, ఆ జీవనాధారాన్ని పోనాడుకోలేవు. ప్రజల నాకర్షించే క్రొత్త ప్రజాస్వామ్య విధానం అనే నినాదంతో ఈ దేశాల్ని సోవియట్ రష్యా తన ప్రాబల్యంలోకి తెచ్చుకుంటోం టే యూరోపియన్ దేశాలు మిన్నకుండలేవు."

అయితేనేం అమెరికన్ విదేశాంగశాఖా కార్యదర్శి డీన్ ఆఛిసన్ ఒక ఇంటర్వ్యూలో ప్రభుత్వ కార్యక్రమంలో వ్యక్తిగతంగా పెట్టు బడిదారులు పెట్టుకునే అవకాశం కూడా ఉంటుం దని ప్రకటించాడు. పరిస్థితులన్నీ సుము ఖంగా ఉంటే పెట్టుబడి కేం ప్రవాహంగా వచ్చిపడుతుం దన్నాడు.

అమెరికాలోనే ఉత్తరాన ఉన్న స్టేట్స్ నుంచి పెట్టుబడిదారుల నాకర్షించడం కోసం "పరిస్థితుల్ని సుముఖంగా" ఉండేటట్లు చేయ డానికి గత పదిసంవత్సరాలుగా కృషి జరిగింది. ఉత్తరప్రాంతానికీ, దక్షిణప్రాంతానికీ మధ్య వ్యవహారాలు దాదాపు సామ్రాజ్య ప్రభుత్వానికీ, వలసదేశానికీ మధ్య వ్యవహారాల మాదిరిగానే ఉంటాయి. కాబట్టి దక్షిణాన జరిగిన కృషి ఫలితం తెలుసుకుంటే ఇంక ప్రపంచవ్యాప్త మైన కార్యక్రమం ఎలా వుంటుందో గ్రహించ వచ్చును. ఉత్తరపారిశ్రామికుల్ని ఆకర్షించ డానికిగాను మిసిసిప్పి - కార్యక్రమం ఒకటి "వ్యవసాయంతో సమానంగా పరిశ్రమల్ని కూడా వృద్ధిపరచా"లనే ఉద్దేశంతో మొట్టమొదట ప్రారంభించబడింది. అయిదు సంవత్సరాలపాటు ఈ పరిశ్రమలవారు కొన్ని పన్నులు చెల్లించ నక్కరలే దని మినహాయించారు. కొన్నికొన్ని ప్రాంతాలలో ఇన్ని సంవత్సరాలు నిరుద్యోగ బాధ తొలగిస్తామనే గారంటీ ఇచ్చి ఆ ప్రాంత వాసులచేత ఋణపత్రాలు (బాండ్లు) కొనిపించి ఫాక్టరీలు నిర్మించారు. కొన్ని ప్రాంతాల్లో జీవనప్రమాణం వృద్ధిపొందినమాట నిజమే. కాని మిగతా ప్రాంతాలలో అక్కడ వర్తకులతో ఉత్తరాది పారిశ్రామికులు లాలూచీ చేసుకొని, అక్కడ ఆర్థికవ్యవస్థని చిత్తంవచ్చినట్లు ఏలారు. కార్మికసంఘాలను బలపడనివ్వలేదు. ఈ దక్షి ణాది ప్రాంతాలలో వాస్తవంగా దేశీయ సంపదైన అడవుల్నీ, గనుల్నీ, చౌక కూలీ పరి శ్రమనీ దోచుకున్నారు. ఈ దోపిడి సరిగా వలస దేశాల దోపిడిపద్ధతినే ఉంటుంది. ప్రజలు ఎప్పటి మాదిరిగా పేదలుగానే ఉండిపోయారు.

ఇటీవల పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాలు చూస్తే వింత ధోరణి కనిపిస్తోంది. గత 30 సంవ త్సరాలుగా చౌక కూలి ఎక్కడ దొరుకుతుందో ఎక్కడ కార్మికుల సంఘాలు బలపడలేదో వెతు క్కుంటూ క్రమక్రమంగా దక్షిణానికి జరిగి పోతున్నాయి. అదే రీతిగా అన్యదేశాల్లోని అమెరికన్ కంపెనీలు పరిశ్రమలు కూడా చౌక కూలీలు దొరికే ప్రాంతాలు వెతుక్కుంటూ కదిలి పోతున్నాయి.

రెమింగ్టన్ లాండ్ టైప్ రైటర్ కంపెనీ వారి నాలుగు ఫ్యాక్టరీలను స్కాట్లండ్ కు తీసుకుపోవాలని యత్నిస్తున్నందువల్ల, వానినట్లు రాకుండా చేయాలని యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్క్స్ కంపెనీ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఈ మధ్యనే అమెరికన్ ఎసోసియేటెడ్ ప్రెస్ ఒక వార్త పంపింది. అండర్వుడ్ టైప్ రైటర్ కంపెనీ ఒక ఫ్యాక్టరీని ఇటలీలో స్థాపించి అక్కడనుంచి సరుకును అమెరికా పంపిస్తున్న దని కూడా పై కంపెనీ ఫిర్యాదుచేసింది. ఈజీ వాషింగ్ మెషీన్ కంపెనీ తన ఫ్యాక్టరీలలో కొన్ని ముఖ్యమైన యంత్రపరికరాల్ని దక్షి ణాఫ్రికా పంపిందట.

కంపెనీలు కూలి ఇవ్వడంలోనూ, కార్మికుల ఆరోగ్యం కాపాడ్డంలోనూ, వారికి గృహవసతి వారి బిడ్డలకు విద్యాసౌకర్యాలు మొదలైన సౌక ర్యాలిచ్చే షరతుపైన పెట్టుబడిదారులు అన్య దేశాలలో పరిశ్రమలు స్థాపించవచ్చుననీ, ప్రత్యా మ్నాయంగా పెట్టుబడిదారులకు కనీసలాభ ప్రమాణం గ్యారంటి ఇవ్వాలనీ ట్రూమన్ కార్య క్రమంలో ముఖ్యాంశాలు. ఇదే పెద్ద సమస్య కూడా. పై హామీ లెందు కివ్వాలంటే మనతో (అమెరికన్లతో) పైవన్నీ ఇవ్వగల రని చెప్తూ పోటీకి వచ్చేవారు నూత్న వ్యవస్థ తెచ్చిపెట్టగల రని ప్రచారం చేస్తున్నారు కాబట్టి ఇప్పు డీ సమస్యను ట్రూమన్ పరిష్కరించాలి.

మందునీళ్లు

(11వ పేజీ తరువాయి)

ప్రాణమే తనదిని. "నచ్చీ, తెస్తే తెచ్చినావు గాని, గంగయ్యకి తెలీనీక"-అన్నాడు మెల్లిగా.

లచ్చి ఆలోచిస్తూ గుమ్మంమీద కూర్చుంది. తండ్రికి పదిరోజులై మందు లేదు. ముసిలాడు ఎలానా బతకడు. కాని చూస్తూచూస్తూ ఎలా చంపడం? మంచిస్తే బతికితే బతకొచ్చు నంటాడు వైద్యుడు. కాని పది రూపాయి లిస్తేనేగాని మం దివ్వడు. ఎక్కడినుంచి తేవడం పది రూపాయలు?

బయట చీకటి చిక్కగా ఉంది. ఊరంతా అప్పుడే చచ్చినట్టు నిద్రపోయింది. లచ్చి కేం తోచడంలేదు. ఎవ డిస్తాడు పది రూపాయలు? ఏం చెయ్యడం, ఆఖరికి సన్నిబాబే గతి.

వీధిలోంచి "ఈరయ్యా"అని కేక వేసి, చూరుకిందనుంచి వొంగి లోపలికివచ్చాడు సన్ని బాబు. సన్నిబాబు కంసాలిగంగయ్యకొడుకు. "సన్నీ - నువ్వట్రా-ఏటి ఇనేసాలు?" అన్నాడు ముసిలాడు.

"సస్తున్నవోడివి నీ కెందుకేస్ ఇనేసాలు? తొంగో, తొంగో!" అంటూ లచ్చి చెయ్యి పట్టుకుని లోపలికి లాక్కుపోయాడు సన్ని బాబు. ముసిలాడు, "హి, హి, హి,"అని పళ్లు ఇగిలించి నవ్వేడు. అతడికేం వింతలేదు. రోజూ జరిగేదే. సన్నిబాబు చాలా తెలివైనవాడు. చాలా డబ్బున్నవాడు. జల్సామనిషి. గంగయ్య కొడుకు! తనింటికి రావడం తన కూతురితో స్నేహం చెయ్యడం తన కెంత గౌరవం. లచ్చికి పెళ్లి కాలేదు. అయితేనేం, సన్నిబాబులాంటి వాడి స్నేహం కుదరడం ఎంత అదృష్టం! సన్ని బాబుకి పెళ్లి అయితేనేం? లచ్చి అంటే ఎంత అభిమానం! సన్నిబాబుద్వారా గంగయ్యవల్ల ఎన్నిపనులేనా చేయించుకోవచ్చు. ఊళ్లో ఎంత మంది గంగయ్యవల్ల పనులు కావలసినవాళ్లు తన్ను ఆశ్రయించలేదు? లచ్చికి సన్నిబాబుతో స్నేహం; తద్వారా తనకి గంగయ్యతో స్నేహం! గంగయ్యతో సమానంగా తిరిగే టప్పుడు ఎంత లేకపోయినా తనుకూడా కొంత దర్జా చూపించాలి. గంగయ్య కులపెద్ద. గొప్ప వేదాంతి. తను కూడా కొంచెం వేదాంతం కబుర్లు చెప్పగలడు. వీరబ్రహ్మం తత్వాలు పాడ గలడు. అంచేతే ఇన్నాళ్లూ వాడిదగ్గర దర్జాగా మెసులుకొచ్చాడు. ఇప్పుడంటే కాళ్లూచేతులూ పడిపోయాయి, అందరూ తొంగిచూడడం మానీశారు.

తెల్లవారుతూంది. కాని ఇంకా చీకటి ఉంది. దీపపుబుడ్డిముందు లచ్చి కూర్చుని కునుకు పాట్లు పడుతూంది. ముసిలాడికి ఆయాసం మొద లైంది. "నచ్చీ"అని ఊపిరి బిగబెట్టి పిలిచాడు.

"ఏట్రా"అంటూ తుళ్లిపడి లేచింది.

"సన్నిబాబేడే?"

"ఎల్లిపోనాడు."

"నచ్చీ, సత్తూంటే కులమో పొక్కడేనా తొంగిసూసినాడుకాడు."

"పోనీ సూసేటినాబం?"-ముసిలాడు బాధపడు తూంటే చూడలేకపోయింది. "వొయిద్దుడిని పిలుసుకొత్తా నుండు బాబూ" అన్నది.

"రాడు నంజకొడుకు."

"డబ్బిత్తే ఎవడికోసం వొత్తాడు?"

"ఎంతిచ్చినాడేటి సన్నిబాబు." అన్నాడు మూలుగుతూ. సన్నిబాబివ్వకపోతే ఎలా వొస్తుంది డబ్బు! సన్నిబాబు మంచివాడు.

"పది రూపాయిలిచ్చినాడు. సాలవేటి?"

ముసిలాడికి ఆయాసం ఎక్కువైంది. తెరలు తెరలుగా దగ్గుతున్నాడు. లచ్చి తండ్రిబాధ చూసి కంట తడిపెట్టుకుంది. ఎటువంటి మనిషికి ఎలాంటి స్థితి వచ్చింది! ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చిన ట్లైంది. పాపం! తండ్రి యవ్వనంలో ఉండేటప్పుడు ఎంత దర్జా, ఎంత జల్సాగా ఉండేవాడు. ఆఖరికి మందుకి డబ్బు లేక చనిపోతున్నాడు. వైద్యుడిని తీసుకురావ డానికి లేచి రెండడుగులు వేసింది.

"వొద్దు, నచ్చీ సెప్పినమాటిను. వొద్దు-మ రెందుకేటి మందు?" తనెలాగా ఇక బతకడు. మం దెందుకు, డబ్బు దండుగ. తను బతికున్నాళ్లూ ఎవరిచేతా వేలుపెట్టి చూపించుకో లేదు. నలుగురిలోనూ గౌరవంగా బతికాడు. తను చచ్చేటప్పుడుకూడా గౌరవంగా చావాలి. తను చచ్చేక తన పేరెత్తి ఎవరూ ఓమాటన కూడదు. బతికినా చచ్చినా నిలబడేది పేరే.

మళ్లీ దగ్గు ఘోరంగా వచ్చింది. ఆయాసం ఎక్కువైంది. లచ్చి "నాయనా"అని పలకరిం చింది. "లచ్చీ, ఆ డబ్బెట్టి, నా కరమ సేసీయే. తప్పక సేసీయే." అని కళ్లు మూశాడు.

రాజ్యాంగము-అర్థనీతి

(17-వ పేజీ తరువాయి)

తులది బంగారునాణెము. పాలించే ప్రభు వొక్క డైనా, భారతదేశమునకు వెండి నాణెము, బ్రిటిషువారికి బంగారునాణెము వుంచడ మనేది చాల అన్యాయము. దీనినిబట్టి, బ్రిటిషువారీ దేశమున నెంత నిష్పక్షపాతబుద్ధితో వ్యవహరించి నారో విశదము కాగలదు. మన మిచ్చుకోవలసి నది బంగారము. వారు మనకిచ్చునది వెండి. ఈవిధముగా కొంతకాలము గడచినది. సాధార ణముగా లోకములో వెండి, బంగారముకంటె, వెండి, పదిహేనురెట్లుక్కువన్నమాట. ఏతత్కా రణమువల్లనే, ఒకతులం బంగారానికి పదిహేను తులాలు వెండి అనే నిర్ణయం. అధాత్తుగా, ఆస్ట్రేలియాలోనూ తన బంగారుగనులు బయ ల్పడడముతోనే బంగారము వుత్పత్తి మెండై నది. వెండి వుత్పత్తి తగ్గిపోయినది. అదివరకు ఒకతులం బంగారానికి 15 తులాలు వెండి దొరి కేది, రెండుతులాలు బంగార మిస్తేనేగాని పది హేను తులాలు వెండి దొరకడం దుర్లభమైనది. ఈ సందర్భములో, ప్రభుత్వమువారు, వెండితో తీర్చుటకు యేర్పర్చుకున్న ఋణాలవాయిదాలు సమీపించాయి. ఋణదాతల వొత్తిడి యెక్కువ కాజొచ్చినది. వెండి ప్రియమైనది. బంగారము దానిని కొని తీర్చవలసివచ్చుటవల్ల రెట్టింపు బంగారము ఖర్చుపెట్టవలసి వచ్చినది. దానితో ప్రభుత్వము వారికి ఖంగారుపుట్టింది. వెంటనే విదేశములనుండి యీ లోహముల యెగుమతి దిగు మతులను నిషేధించి, వెండి బంగారముల ధరను, కంట్రోలు చేసినారు. క్రమక్రమముగా, రూపాయిలోని వెండిని తగ్గించి, మిశ్రమ లోహపు పాలును హెచ్చించారు. తదాదిరూపా యికి వుండే విలువ నిజలోహపు విలువగాక ఆకారపు విలువ (*Token value*) యేర్పడింది. అందువల్లనే రు. 100/-ల యెత్తు పరిశుద్ధ మగు ఖాదీ వెండి, యాభై ముద్రితనాణెములగు రూపా యలకు లభించేది.

ఇప్పుడు వెండిరూపాయి అన్నమాటే లేదు. చిల్లర నాణెములు కూడ నిక్కెలువే. వీటికి తోడు రూపాయినోట్లు, 2 రూపాయిల నోట్లు ప్రచారములో వున్నవి. వీటికి సెంట్రల్ గవర్న మెంటు హామీ లేదు. 5 లగాయతు 100/లవరకు గల నోట్లకు గవర్నమెంటు హామీ వున్నదిగాని, వాటిలో నైనా వెండి రూపాయిలు యిస్తామనిలేదు. "రూపీసు" అని మాత్రము వున్నది. ఇచ్చే హామీ అయినా ప్రజలవలన రాబట్టబడే ఆదాయమే. సామాన్య పౌరుడు, తన నిత్యకృత్యముల కవసరమగు కూర గాయలు, మొదలగు యితర తినుబండార పదార్థ ములను కొనుక్కొనుటకు వినియోగించునది, *I promise to pay* అని ప్రభుత్వము వారు వ్రాసి యిచ్చిన నోటే. ఆ నో టెవరిదగ్గరవుంటే వారు ప్రభుత్వానికి ఋణదాతలన్నమాట. ఈ విధముగా కూలివాడు లగాయతు, కోటీశ్వరుని వరకు ఋణదాతలే. పండించినవాని పదార్థము లకు, కష్టించిన వాని కష్టాలకు, సేవకుల వేత నాలకు ప్రభుత్వమువారిచ్చే పరిహారము ప్రభు త్వమువారు వ్రాసే నోట్లే. ఇక ప్రజలవద్ద నిలు వేది. ప్రజలు యిచ్చే ఋణమేమిటి? ప్రభు త్వమువద్ద దాచుకొనే నిధి యేమిటి?

ఇన్ ఫ్లేషన్ - డిఫ్లేషన్

ప్రజలు నిలువవున్న డబ్బు దాచుకుంటే, ప్రజలలో కొనగోలు శక్తి ధరలు తగ్గుతాంయ టారు. ఆర్థిక శాస్త్ర సంబంధమగు ఇన్ ఫ్లేషన్ డిఫ్లేషన్ అను యేవో రెండు సాంకేతిక పదాలను దిగుమతి చేసారు.

ప్రజలలో కొనగోలు శక్తి సన్నగిల్లి ధరలు తగ్గుతాయని వీరి అభిప్రాయం. ధరలు తగ్గ టానికి అర్థశాస్త్రజ్ఞుల అభిమతం యేమిటంటే, తినేవాళ్లసంఖ్య తగ్గనైనా తగ్గాలి; పంటలు ద్విగుణీకృతంగా పండనైనా పండాలి; నేతికి ప్రతిపద్ధాగా దాల్డా సృష్టింపబడినట్లు బియ్యానికి బదులు, మరొకవిధమగు కృత్రిమ బియ్యం కను పెట్టనైనా కనుపెట్టాలి; లేక, ప్రజలను త్రాగుడు నుండి తప్పించి, యితర పానీయములకు మర లించినట్లు, ప్రకృతి సిద్ధమైన, వారివారి, గంటె చోడి, కొఱ్ఱ, చామ, జొన్న మొదలగు ఆహార విధానాలకు మరలించనైనా మరలించాలి. తద తర విధానములు నిరుపయోగములు. ప్రజలవద్ద వెండి బంగారాలు అనలేవు. ఏ కొలదిమాత్రము వున్నను, ప్రథమ ఐరోపా మహాసంగ్రామ సమ యములోను ద్వితీయప్రపంచ సంగ్రామ సమ యములోను, బ్రిటిషువారు, ముద్దలోహముల రూపకముగా స్వీయదేశమునకు గొనిపోయిన సంగతి ఆబాలగోపాల మెరుగుదురు. ఇంకా యేమైనా మిగిలియుంటే, స్వరాజ్య సంపాదన సందర్భములో, మూలనున్న ముసలమ్మల మెడల లోనివి, పడుచమ్మల ముంజేతులవి మహాత్మ గాంధీగా రూడదయించారు. ఇన్ ఫ్లేషన్, డిఫ్లేషను, అను పదాలకు న్యాయమగు అర్థ మేమిటంటే ప్రభుత్వకోశాగారమునిండా వెండిబంగారము లుండి, దేశఖర్చుకు ప్రజలలో చలామణీకి విడుదలబడిన ద్రవ్యము ఏకొలదిమంది వద్ద మాత్రమే చిక్కుపడి అది బయటికి రాక పోవుటవల్ల ప్రభుత్వపుఖజానాకు దెబ్బతగులుతుం దని తోచినప్పుడు నిలువవున్న వాని డబ్బును వెలి కీడ్చి, అసలే లేనివానికి సర్దుబాటు కొనర్చించే విధా నము."ఇన్ ఫ్లేషన్ వల్ల ధరలు హెచ్చించి ఋణ దాతను మోసగించి ఋణాసుడు ఋణములు తీర్చుకోగల అవకాశమును, డిఫ్లేషన్ వల్ల ధరలు పడిపోయి ఋణదాత ఋణస్థుని మోసగించు అవకాశమును కల్గించుటయగును."

గోదావరిలో ఒకచోట యెత్తుగావున్న తిప్పను త్రవ్వి, లోతుగావున్న మడుగులోపోసి, మట్టంచేయడంవంటిది. అంతేకాని, ప్రజలవద్ద డబ్బుతో ప్రభుత్వపు బొక్కసము పూరింప జూడటం శ్రేయోదాయకములనుకాదు. పూర్తిగా ప్రజలను నిర్ధనులు జేయజూడటము, ప్రభుత్వము నకు క్షేమదాయకము కాదు.

కర్తవ్యము

మనకు సిద్ధించిన స్వాతంత్ర్యము స్థాయీ భావముదాల్చి, సుస్థిరమగు పునాదులపై స్వరా జ్యము నిర్మింపబడాలంటే, ముందుగా కోశ మును వెండి బంగారములతో పూరించాలి. ఆర్థిక విధానమును సంస్కరించాలి. నిజలోహపు విలువగల నాణెములను, ప్రస్తుతపు నీచలోహ నిర్మితమగు నాణెములకు ప్రతిపద్ధిత మొన రించాలి. సామాన్యమానవుడుకూడ ముద్దలోహ మును టంకసాలకు గొనిపోయి నాణెములుగా ముద్రించి యివ్వమని కోరినంతనే మజూరీ మాత్రము పుచ్చుకొని నాణెములు ముద్రించి యిచ్చే సౌకర్య మేర్పడాలి. అప్పుడేకాని, మహాత్మాగాంధీగా రేర్పర్చిన రామరాజ్య నిర్వ చనం సార్థకంకాదు.

"సర్వసుందరి"

(6 వ పేజీ తరువాయి)

1605 వ సంవత్సరం వచ్చింది. అక్బరు పాదుషా ఇహలోకయాత్ర ముగించాడు. సలీమ్ సింహాసన మధిష్ఠించాడు. 'జహాంగీరు' గా ప్రఖ్యాతి పొందాడు. జహాంగిరుకూడా తండ్రి అయ్యాడు. అతని కొడుకులు యవ్వనంలోకొచ్చారు. జహాంగీరు ఇంకా తనకు తాను యవ్వనుడే అనుకుంటున్నాడు. అతని హృదయ సీమలో, ఇంకా మెహార్ రాజ్యం చేస్తోంది. అతని హృదయంలో చిత్రితమైన ఆమె స్మృతి చిత్రం యింకా తుడిచివేయబడలేదు.

బర్ద్వాన్‌లో చాలా గడబిడలు జరిగాయి. ఓవిధమైన కల్లోలం జరిగిం దనొచ్చు. 1607 వ సంవత్సరం మార్చి 30 వ తేదీన షేర్ అఫ్‌ఘన్ దివ మలంకరించాడు. ఈ హత్యలో జహాంగీరు ఎంతమట్టుకు బాధ్యుడో, ఈ విషయంలో మనకి స్పష్టంగా తెలీదు. చరిత్రకారుల్లోకూడా మత భేదా లున్నయ్. 'లోకో భిన్న రుచిః'. ఏమంటారు?

పోయినవా డెలాగా పోయాడు. బ్రతికిన వాళ్ల సంగతి చూద్దాం. మెహార్ మొగల్ రాజ మహల్లోకి తీసుకురాబడింది. ఇది మనకి చరిత్ర వల్ల తెలుస్తుంది. ఆమెతోపాటు సర్వసుందరి కూడా రాజభవనంలోకి ప్రవేశించింది. మహల్లో, మెహార్, రాజమాత (అక్బర్ భార్య) యొక్క సేవలో లీనమైంది. రాజమాతకూడా ఆమెను తన దగ్గరే వుంచుకుంది. మెహార్ రాజ భవనానికి రాగానే జహాంగీరు, ఆమెను తనవై పాకర్షించాలని ప్రయత్నాలు సాగించాడు. మృతుడైన తన పతిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ, జహాంగీరుకోరికను, మెహర్ తృణీకరిస్తూ వచ్చింది.

జహాంగీరు వయస్సు ఎక్కువవుతున్న కొద్దీ అతని హృదయంలో మెహార్ యొక్క స్మృతి మరింత 'తాజా' అవసాగింది. అన్ని విధాలా ప్రయత్నించి, నిరాశచెంది, పాదుషా జహాంగీరు, జులేఖా పాదాల్ని పట్టుకున్నాడు - "నువ్వు మెహార్‌కి 'నీడ' వని నాకు తెలుసు. నువ్వు, భారతదేశసార్వభౌముడు నిన్నీవేళ 'భిక్ష' అడుగుతున్నాడు. నువ్వెలాగయినా మెహార్‌ని నాతో పెళ్లిచేసుకోడానికి రాజీ చేశావంటే, నీ ఉపకారం నే నెప్పుడూ మరువను" అంటూ జహాంగీరు ప్రాధేయపడ్డాడు. ఏమిటో ఆ ప్రేమ! ఎందుకో! ప్రేమచరిత్ర ఎంత విచిత్రమైనదీ! పాదుషా ఒక సామాన్యమైన పరిచారికను ఈ విధంగా వేడుకోటమా! ఆశ్చర్యం......... వాహ్‌రే ప్రేమ్!......

జహాంగీరు జులేఖజవాబుకోసం ఎదురు చూస్తున్నాడు. ఆమె ఆలోచించింది. చచ్చే వరకూ మెహార్ వైధవ్యజీవితం గడిపితేనే చాలా బావుణ్ణనుకుంది జులేఖ. కాని ఈ వేళ... ఈ వేళ...భారతదేశాని కధిపతి యొక్క దీనమైన కళ్లు.. అతని అమాయకమైన ముఖం......అతని హృదయ వేదన.. అతని పిచ్చిప్రేమ.. పాదుషా 'భిక్ష' పెట్టమంటున్నాడు.. ఉఫ్...ఎంతమాట!...

జులేఖహృదయం ద్రవించింది. ఆమె తప్పకుండా పాదుషాకి సహాయం చేస్తుందని మాట ఇచ్చింది. ఈవేళటివరకూ జులేఖా, జహాంగీరుపట్ల మెహార్‌హృదయం విషంతో నింపేసింది. మరిప్పుడో ఆ విషాన్ని దింప నారంభించింది. హమ్మయ్యా! ఆడదాన్ని యింత వరకూ ఎవ్వరూ 'స్టడీ' చెయ్యలేకపోయారు కదా! బలే! ఆడదాన్ని సృష్టించడంలో బ్రహ్మ చాలా కష్టపడ్డాడని చెప్పాల్సిందే! చెప్పితీరాల్సిందే!...

మెహార్‌జీవితం వైధవ్యాగ్నిలో మండుతూండాలని కోరే జులేఖా మనస్సు, ఆమె నిప్పుడు భారతదేశానికి సామ్రాజ్ఞిగా చేయాలని కోరుతుంది. తన నూరేళ్ల బ్రతుకును ఈవిధంగా పాడుచేసిన 'షేర్'ను జహాంగీరే హత్యచేయించాడని ఆమె అనుకుంది. అందుకోసమే గాబోలు, ఆమె హృదయంలో ఓమూలను కొంత కృతజ్ఞత ఉందిజహాంగీరుపట్ల. ఆహా! మనశ్చాంచల్యము!

జులేఖాప్రయత్నాలకు ఫలితంగా షేర్ చనిపోయిన నాలుగు సంవత్సరాల తరవాత 1611 వ సంవత్సరంలో మార్చి నెల 25 వ తేదీన మెహరున్నిసా జహాంగీర్ల వివాహం జరిగింది. ఆమె 'నూర్‌మహల్' అనే పేరుతో భారత దేశానికి సామ్రాజ్ఞి అయింది. నూర్‌మహల్ చేతిలో పాదుషా కీలుబొమ్మయిపోయాడు. ఆమె ఆజ్ఞకు వ్యతిరేకం లేదు. అప్పటి చరిత్ర అంతా ఆమె చర్యల్తోనే పేజీలు నిండిపోయాయి. నాటున్న్నిట్లోనూ జులేఖా చెయ్యి వుంది. తెరవెనుక భాగోతం దీనికే అంటారు గాబోలు. నూర్‌మహల్ మెరిసిపోయింది. కొద్ది సమయంలోనే ఆమెకు 'నూర్జహాను' అని ఉపాధి దొరికింది. పేరులో ఏముందిలెండి పేడ ముద్ద!..

* * *

జహాంగీరుకి నలుగురు కొడుకులు. ఖుస్రో, పర్వేజ్, ఖుర్రమ్, శెహరయార్, నలుగురూ 'పాదుషా' అవాలని గాలిలో మేడలుకట్ట నారంభించారు. వీళ్లందరిలోనూ ఖుర్రమ్ వీరుడు, చతురుడు. ఖుర్రమ్‌తల్లి రాజపుత్ర స్త్రీ. జహాంగీరు తరవాత ఖుర్రమ్ పాదుషా అయితే మాదా లని రాజపుత్రు లందరికీ కోరికగా వుండేది. నూర్జహానుయొక్క షడ్యంత్రాలకు విసిగి, ఖుర్రమ్‌తో, మహబత్‌ఖాన్ ఏకీభవించాడు. ఖుర్రమ్ పేరంటే నూర్జహాను ఏవగించుకొనేది. ఖుర్రం 'విద్రోహి' అని పిలువబడ్డాడు. ఖుస్రో మందబుద్ధి. అతని బుద్ధిమాంద్యంవల్ల, జహాంగీరు నూర్జహాను, యిద్దరూ అతనంటే అసహ్యించుకునేవాళ్లు. అతనికేవిధమైన సహాయంలేదు. అప్పటికీ పాదుషా అవాలనే ప్రబలమైన కోరిక అతని మనస్సులో బాగా వికృతంలా నాటిపోయింది. అతనికోరిక ఫలించలేదు. అతన్ని జైల్లో తోశారు. నూర్జహానుకుతంత్రంవల్ల జైల్లోనే ఖుస్రో హత్య చేయబడ్డాడు ఎంత స్వార్థం! కాదు, కాదు, ఇది స్వార్థమా! రాజకీయాల్లో ఒక సామాన్యకార్యమా? ఏమో!! ఆమె హృదయం ఎంత విపరీతం! ఆమె అందమో!!

షేర్ అఫ్ఘన్‌కి పుట్టిన తన కూతుర్ని శెహరయార్‌కిచ్చి పెళ్లిచేసింది నూర్జహాను. తన లాగే తన కూతురుకూడా, భారతసామ్రాజ్ఞిగా కావాలని ఆమెమనస్సు తహతహలాడిపోయింది. ఆమెనిశ్చయాన్ని జులేఖా తెల్సుకుంది. ఆమె ప్రయత్నాల్ని నిష్ప్రయోజనం చెయ్య సంకల్పించుకుంది జులేఖా.

శెహరయార్ దాన్లో రెండే రెండు కంటకాలు - ఖుర్రమ్, పర్వేజ్. ఖుర్రమ్ పాదుషా అవాలనే ప్రయత్నాల్లో నున్నాడు. జహాంగీర్ మాత్రం, పర్వేజ్‌కే సింహాసనం సమర్పించాలనుకున్నాడు. పర్వేజ్ విలాసప్రియుడు. ఎప్పుడూ అతనికి నాట్యకత్తెలూ, నాట్యం, ద్రాక్షరసం, పాటలతోనే తీరిక దొరికేదికాదు. ఇదే అతనిలోనున్న లోపం. ఏవిధంగానయినా పర్వేజ్‌కీ, ఖుర్రమ్‌కీ 'లటాపటీ' తగిలించాలని చూస్తుంది నూర్జహాను.

ఖుర్రమ్‌ని దండించడానికి పర్వేజ్‌ని పంపించమంటుంది జహాంగీరుతో నూర్. తను బ్రతికుండగా తన కళ్లెదుటనే తన కొడుకులు ఒకర్నొకరు చంపుకుని, రక్తపుటేరుల్లో స్నానం చెయ్యడం, తన కిష్టంలేదని స్పష్టంగా చెప్పేశాడు. అదే సమయంలో శెహరయార్ సింహాసనాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాల్ని జులేఖా 'బ్రేక్' వేస్తూ వచ్చింది.

(సశేషం)

గృహస్థాశ్రమంలోని ఆధ్యాత్మిక తత్వం

(19-వ పేజీ తరువాయి)

ముగ వుద్భవించి యున్నది. కాబట్టి స్త్రీ, జీవరాశికి పురుషుడైనవానియొక్క ప్రతిబింబములేక ప్రతిరూపము మాత్రమే అవుతుంది. స్త్రీకి, తన నాథుని వినా స్వతంత్రపతిపత్తి యేమియూ లేదు. కనకనే స్త్రీ స్వతఃగానే, మోక్షము పొందుటకుగాని, "గురువు"గా వ్యవహరించుటకు గాని వీలులేదు. భక్తురాండ్రగు క్రైస్తవ కన్యలను, ఏసుక్రీస్తుయొక్క పురుషాంశముతో అనేక వివాహములు జరిపినారంటే దీనిని మనము యీ పైచెప్పిన భావములోనే అర్థము చేసుకోవాలి. సిద్ధిపొందిన "ముక్తుడు" అంటే "శివ, శక్తి" రెండూ తనలో ఐక్యము గావించుకొని తన పురుషాంశముతో, తన ప్రకృతిశక్తిని తనలో ఐక్యము గావించుకొని పూర్ణుడైనవాడని పెన్నమాట.

ఆదిలో అవ్యక్తముగ యిమిడియున్న రెండు ప్రకృతులు ఒకే వ్యక్తిగ విశేషముగ చిరపము బడే సంస్కృత దివ్యమూర్తి స్వభావము. సాంకేతిక ప్రాయముగ మహాదేవుని (శివుని) అర్ధనారీశ్వరునిగా చిత్రించుటంలో వున్న అర్థమిదే. అయినా సృష్టివికాసములోని ప్రస్తుతపు దశలో యింకనూ ప్రపంచం "శక్తిమయం"అనియే చెప్పబడుచున్నది యెందువల్లనంటే, యింకా మనము మాతృప్రకృతిలోనుండి స్వతంత్రజీవులముగ జన్మించక పోవడంచేతనే. అట్లు జన్మించి యింకనూ, సృష్టినాథునివద్దనే వుంటున్న మన స్వతంత్ర ప్రాణ శక్తి (*Independant Life Breath*) తో మనము యింకా ఐక్యము కాలేదు కనుక యిందుచేతనే ఈ రోజులలో కూడా ఈశ్వరుని మాతృదేవిగా భావించి కొన్ని మతసాంప్రదాయాలు వుండడం మనము చూస్తున్నాము. లోకమాత అయిన "కాళి" అహంకారతన్మయురాలై, చైతన్యరహితుడై, వుపేక్షితుడై, భూమిపై శయనించిన, శివుని హృత్పీఠముమీద తన పాదాలతో చిందులు త్రొక్కుతున్నట్లు చూపే పటములలో ఒక చిత్రమైన అంతరార్థము కలదు. (ఈ శివుడు ఇట్లా నేలమీద, మొద్దువలె పడివుండడం తన భవిష్యత్ సంతానము, తనవంటి అశక్తులుగానే, తయారవుతా రని ఆలోచనానిమగ్నుడవుటవల్లనేమో!) త్వరలోనే సృష్టిపరిణామ ప్రవాహము మార్పుపొంది 'కాళి' తన పాదముల క్రింద శయనించి యున్న శివుని, తన నాథుని, స్వామి గుర్తెరిగి, తాను, ఆయనస్వరూపిణియయి, ఆయన లోనే ఐక్యమైపోవలెను. ఉత్తరకాలములో యీ స్త్రీ పురుష జాతి అనుబంధానికి ఒక అర్థం కలదు. జీవితమునుండి యేదో ఒక వంకను పిరికివై తొలగుట కాక శాశ్వతజీవనానిక (నిత్య సత్యజీవితము) అంటే యెక్కడైతే "దేహి"అనే మాట లేకుండా యెల్లప్పుడూ అనుగ్రహించుటే (నిత్యదాతృత్వమే) వుండునో అక్కడికి నూటికి యైన రాజమార్గమే యీ "స్త్రీ పురుషజాతి"కి గల అర్థమని మనము గ్రహించవలెను కనుక యీ స్త్రీపురుషజాతికి బ్రహ్మత్వసిద్ధికి వున్న యీ సంబంధవిశేషమును గ్రహించనివారు, మతమనగా యేదో "లింగోపాసన" వంటిదనీ, "యోగము"అనగా కామోద్రేకచిత్తవైకల్యం (*Psycho-Pathia-Sexualis*) అనీ చెప్పారంటే ఆశ్చర్యం లేదు. సృష్టిస్థితులకు, బ్రహ్మము మూలముగ యెంచి ప్రార్థనవల్లగాని, ఆత్మవిచారపద్ధతివల్లగాని కనుగొనుటకు వీలున్నదా యని మనము యిప్పుడు ప్రశ్నింపవచ్చు. లోకక్రమము అనగా "కర్మ"యొక్క "ఫలితముల" మాత్రమే అయిన మనబోంట్లు బ్రహ్మమును సాక్షాత్కరింపుమని బలాత్కరించవచ్చునని, గుప్తమతసాధకు లెవరైననూ వూహించుచో అది శుద్ధ అసంభవ మగును. తనలోనే అనుభవపూర్వకముగ, ఋజువుచేసుకొన్నవాడును, యితరులను సరిగా ఆ త్రోవలోనే, నడిపింపగల మార్గదర్శకుడు మనకు కావలెనని మామూలుగా మనము అంటుంటాము. అట్టి మార్గదర్శకునే "గురువు" లేక "మాష్టరు" అంటాము. రహస్యములలోకెల్ల వుత్తమరహస్యమైన జీవనరహస్యమును, మనకు బోధించేందుకు "మాష్టరు"గా వ్యవహరించగలవారెవరు? ఆదిలో ఎవరైతే మనలను "జీవులు"గా చేసిరో వారే అంత్యమునకూడా మనకు గురువుగా నుండి మనలను పరిపూర్ణస్థితికి గొనిరావలసి యున్నది. పరబ్రహ్మమే మనయందు ప్రవేశించి, "అది"యే మనము, మనమే "అది"యు కావలసియున్నది. ఆ మహాత్తరని మేషమువరకు యీ కర్మక్షేత్రములో మనము శిక్షణనారము కర్మ చేస్తూ వుత్తమజననము గడుపుచూ, సమస్త జీవులు, అనగా సర్వము ఒక్కటేనను యేకత్వముతో, ఒకరితో వేరియుండుటయే మన ము చేయవలసిన పని. ఇంతవరకు అవతరించిన జగద్గురువులందరూ యీ మెట్టువరకే వచ్చారు. క్రోధము, ద్వేషము - వీటిని తొలగించి పరస్పరమూ ప్రేమించుకోవడం నేర్చుకోమని వీరందరు వుద్బోధించారు. కళ్లయెదుట కనబడుతూవున్న తోడిమానవుణ్ణే ప్రేమించలేనిచో, అగోచరుడగు పరమాత్మను యెవరు మాత్రము యెట్లు ప్రేమించగలరు అనే యథార్థం మనకు తెలిసినదే. మానవజాతి యనగా రక్తమాంసముల లోనికి, లేక "స్థూలములో"నికి దిగుచున్న ఈశ్వరత్వమే కాక మరేమున్నది? సృష్టిక్రమవికాస ఆరంభంనుండి అనగా యేనాడైతే అద్వైతుడగు 'పురుషోత్తముడు' మహాకార్యముతో సహస్రాంశములుగా ఆవిర్భవించినాడో, ఆనాటనుండి ఈ "ఈమహాయోగము"నే భగవానుడగు ఈశ్వరుడు ఆచరిస్తున్నాడు. "నేను" లేక "అహం" ఆయనయే. ఈ విశ్వముల కంతకూ యేకమగు పురుషాంశము ఆయనదే. ఆయనయే యీ జగత్తు యావత్తుకూ జీవనాధారము. ఆయనయే మూలపురుషుడు. ఆయనయే అన్ని "నేను"లకు మూలము. 'అహం'అను అన్ని 'అహము'లకు మూలకారణమైన 'అహం' ఆయనయే. శాశ్వత జీవితానందమును ఇచ్చు యోగమును ఉపదేశించు శాశ్వతజగద్గురువు ఆయన ఒక్కడు మాత్రమే. ఇకనైన మానవుడు తన సోదరమానవులతో కార్యమునకు కాలు ముందుకు పోవుటేక జీవించుటకు "ఈశ్వరుడు" క్రమమే గాన అందరకు సాక్షీభూతుడు గాక!

వింతలు - విశేషాలు

చేపలు చేయు శబ్దములు

కొన్ని చేపలు లోలోపల మొరుగునట; కొన్ని ఒకటకు మొరుగునట. కొన్నిటికి ఈదు తిత్తిపైగల సన్న ఎముకలు కొట్టుకొనుటవలన అతిమాధుర్యమైన తాళము వేయు శక్తి ఏర్పడెనట. గురునాగులను చేపలు తలలోని ఎముకల కదలికవలన డమరపు మోతరప్పించునట. కొన్ని చేపలు ఝుంకరించునట; మరి కొన్ని గురక పెట్టునట; కొన్ని పందివలె గీపెట్టునట; గుఱ్ఱపుజాతి చేప తప్పెట శబ్దము చేయునట.


మబ్బు ఎత్తెంత?

మెరుపునకు ఉరుమునకు మధ్యకాలమును సెకండులు చూపించు గడియారముతో కొలిచి మబ్బు ఎత్తు కనుగొన వీలున్నది. సెకండు వ్యవధికి 373 గజముల ఎత్తున మబ్బున్నదని గ్రహింపనగును.


పంపకవిధానము

ఘనము త్రాగు సోడాలలో వినియోగించు కర్బనామ్లమును తగిన వత్తిడివలన, వేడి తగ్గింపు వలన ద్రవముగాను తమపరి కర్బనామ్లపు మంచుగాను విరివిగ తయారుచేయనగును. అమెరికాలోని సంయుక్తరాష్ట్రములలో, ఈ ఐస్‌లోనే ప్యాకింగ్ చేసి, కూరగాయలు మాంసము చేపలు దూరతావులకు రవాణా చేయగలుగుతున్నారు. కుళ్లుడు బాపతు నష్ట ముండదట; అవితాజాగానూ ఉండునట. "వలస"

వార్తా చిత్రాలు





ంబైలో రాష్ట్రపతి డా॥ పట్టాభి, వారిప్రక్కనే రాష్ట్రప్రధాని బి. జి. ఖేర్ గారు




భారత ప్రభుత్వ రక్షణమంత్రి సర్దార్ బలదేవ్ సింగ్ గారు ఏప్రిల్ 9-వ తేదీన బులాంద్ షార్ కు వెళ్లినప్పటి చిత్రం. ...నాజీ సైనికులను చూసి, సైనికుల విశ్రాంతి భవనానికి ప్రారంభోత్సవం జరిపారు.

హైదరాబాద్‌లో దేశోద్ధారకుని వర్ధంతి






శ్రీ మాడపాటి హనుమంతరావుగారు దేశోద్ధారకునిగురించి ఉపన్యసించుచున్నారు. మధ్య చిత్రములో కూర్చునియున్నవారు శ్రీ బూర్గుల రామకృష్ణారావుదంపతులు.



ఇటీవల ఢిల్లీలో కేంద్రగృహపరిశ్రమల విక్రయ కేంద్రానికి ప్రారంభోత్సవం జరుపుతున్న గవర్నర్ జనరల్ రాజాజీ: భారతపరిశ్రమలమంత్రి డా॥ శ్యాంప్రసాద్ ముఖర్జీగారి సమక్షంలో ఈ ఉత్సవం జరిగింది.





భద్రాచల శ్రీ రామాలయంలో శ్రీరామనవమినాడు కళ్యాణోత్సవం

కళ్యాణమంటపానికి ఊరేగింపు.

★

శ్రీ సీతారామలక్ష్మణ ప్రతిమలు.






శ్రీరామాలయం

★

శ్రీరామాలయ దర్శనం చేసిన హైదరాబాద్ సంస్థాన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామానందతీర్థ.



Regd. M. No. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7, Thambu Chetty St., G. T. Madras.